UNIVERSAL LIBRARY
OU_204422
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82 K15P

Name of Book ప్రసన్నయాదవము.

Name of Author కందుకూరి రావు.

# పునర్వివాహము

(పంజాబీ భాషనుండి)

గ్రంథకర్త
శ్రీపాద కామేశ్వరరావు

అభినవాంధ్ర
గ్రంథమాల
రాజమంద్రి

ప్రకాశకుడు:
చెఱుకువాడ వేంకటరామయ్య
అభినవాంధ్రగ్రంథమాలాకార్యాలయము
రాజమంద్రి
1928.

సర్వస్వామ్య
సంకలితము

వెల { మేలు 1-4-0
సాదా 1-0-0 }

PRINTED BY
A. LAKSHMANASWAMY NAIDU
AT
THE SARASWATHI POWER PRESS,
RAJAHMUNDRY

# పీఠిక

ఆంధ్రవాఙ్మయమున పౌరాణిక చారిత్రక నాటకములు విపులముగా ఉన్నవి కాని సాంఘికనాటకములు తక్కువ. ఆధునిక ఆంధ్రసాంఘికసమస్యాచర్చ అంతగా లేదు. మన సదాచారదురాచారములు నిరూపించి యోగ్యసంస్కరణావశ్యకత చూపే నాటకము లెన్నో వ్రాయవలసి ఉన్నది. ఈవిషయమున మేము "భారతరమణి", "చిత్రవృత్తి" అనే రెండు నాటకములు లోగడ ప్రచురించి ఆంధ్రసోదరుల కర్పించినాము, ఈనాటకమూ అట్టిదే.

పంజాబుదేశభాషకు "పంజాబీ" అని "గురుముఖి" అనీ పేరు. మనదేశభాషలవలెనే అదికూడా పోషణలేక చిక్కినదని ఎరిగి ఆదేశీయులలో కొందరు విద్వాంసులు ఆభాషనే గ్రంథములు ప్రచురించసాగినందున ఇప్పుడాభాష కొంచె మభివృద్ధి చెందుతూంది. శ్రీమాన్ ఈశ్వరచంద్రనంద మహాశయు డీ భాషను "సుభద్ర" అనే నాటకము రచించగా దానిని చూచి ఆదేశీయులపరిమితానంద మొందిరని విని మా మిత్రులు శ్రీమాన్ బలరామభనోట్ గారిచే ఆనాటకమును ఆంగ్లభాషలోకి తర్జుమాచేయించి చూసేసరికి అందా దేశాచారము లత్యధికముగా చిత్రింపబడినందున మన కానంద దాయకము కాదని యెంచి మన ఆచారములకు తగినట్లు కొంత మార్చినాము- ఇందుచే ఈగ్రంథము కేవలానువాదము కాక అనుకరణమంటే సమంజసముగా ఉంటుంది.

రాజమండ్రి
డిసెంబరు 1928

ప్రకాశకుడు

## ముఖ్య పాత్రములు

### పురుషులు

| | |
|---|---|
| వీరేశ్వరశాస్త్రి | ... ... ఒక గృహస్థు. |
| ప్రేమానందుడు | ... వీరేశ్వరశాస్త్రి కుమారుడు. |
| ముకుందశాస్త్రి | ... ,, వియ్యంకుడు. |
| సుందరము | ... ప్రేమానందుని మిత్రుడు. |

### స్త్రీలు

| | |
|---|---|
| ప్రేమాంబ | ... వీరేశ్వరశాస్త్రి భార్య. |
| కావేరమ్మ | ... ముకుందశాస్త్రి భార్య. |
| భద్ర | ... వీరేశ్వరశాస్త్రి కూతురు. |

# పునర్వివాహము

## మొదటి అంకము

### మొదటి రంగము—భద్ర అత్తవారిల్లు.

(భద్ర, ప్రభావతి, కర్మదేవి, ప్రసన్నకుమారి...)

ప్రభా—కర్మా, పోదాము రావే. ఫలాహారానికి వేళయింది, తరువాత తిరిగీ దారము తీయవచ్చును.

కర్మ—ఎక్కడే, పొద్దు తిరుగనిదే? నీ కడుపులో అసిరమ్మ దూరిందా? నీ ఆకలి తీరేటట్టు లేదు. ఇందాకా కడుపునిండా మెక్కలేదటే?

ప్రభా—నా ఏకు లయిపోయినవి. నా కేమి పనుంది? రాట్నము చూస్తూ కూర్చోనా? లేక నీ మొగమువైపు చూస్తూండనా?

ప్రస—పని లేకపోతే పంటి కెక్కించు నా దారము. చేయవలెనంటే పని ఉండదే?

కర్మ—బాగా చెప్పినావు. ప్రభావతీ, తొందర కెందుకే?

మా ఈమేకులూ అయిపోవచ్చినవి, అందరమూ కలిసే పో వచ్చును. కొంచెము నీ గుర్రము కట్టు.

ప్రభా—మీా కెందుకర్రా రోసము? పని చేయకపోతే ప్రసన్నకి కోపము వస్తుంది, దాని పని తప్పకుండా చేస్తాను.

కర్మ—ఒక్క కదురు బుడత కెక్కించడాని కెంత సేపో కాదు. పాట పాడుతూ పనిచేస్తే పావుగంట చాలును. భద్రా, ఏదీ, నీవు మొదలుపెట్టు, మేము నీవెంటనే పాడుతాము; పని కాగానే అందరమూ పోదాము.

భద్ర—కావలిస్తే మీారు పాడుకోండి. నాకు పాడవలెనని లేదు.

కర్మ—నీచేత పాడించితీరుతాము. నీకు పాడక తప్పదు.

ప్రభా—పాట పాడితే నేనుంటాను, లేకుంటే ఇప్పుడే వెళ్ళుతాను. పాడుతావా? పాడవా?

ప్రస—భద్రా, వాళ్లింత ముచ్చటపడుతూంటే ఒక్క పాట పాడే, ఏమి భాగ్యము? నీవు మొదలుపెట్టు, తరువాత వాళ్ళూ పాడుతారు.

కర్మ—ఏమి మురిపింతే! ఒక్కపాట పాడరాదా?

భద్ర—నన్ను చంపకర్రా! ఇదిగో పాడుతున్నాను.

కన్నడగౌళరాగము.

ఓరచూపు జూచేది న్యాయమా - ఓ రఘూత్తమా
నీవంటివానికి ॥ఓ॥

నీరజాక్ష, మును నీ దాసులకు నీ కేమి వావులు తెల్పవే॥

ప్రభా—ఆహాహా! ఏమి కృతి! నీ అవస్థకి సరిపోయింది.

కర్మ—ఎప్పుడూ కరుణరసమే కాని ఇంకో రసము దీనికి కావట్టదు. ఏదీ చరణము పాడవే భద్రా.

భద్ర—

మాన మింతయైన, నీకు దోచలేక పోయినదేమి?
పుణ్యమూర్తి యో
దీనరక్షకాశ్రితమానవసంత్రాణ గానలోల, త్యాగ
రాజనుత ॥ఓగ॥

ప్రభా—నీ కష్టము గట్టెక్కుతుంది లే—

కర్మ—ఈ చెర వీడనీ ముందు; దీని అన్న వచ్చి పుట్టింటికి తీసుకొనిపోతే కొంత మెరుగు దీని బ్రతుకు.

ప్రస—నేను భద్రను వెళ్లనివ్వను.

భద్ర—నాకొంప ముంచకు, నన్ను పోనీ నీ ధర్మ మాయెను.

ప్రస—ఏదీ, ఇంకొక్కమారు పాడు, ఆ చరణము.

భద్ర—చాల్చాలు. మరి పాడలేను.

ప్రభా—ఎంత బాగుందే! కొత్తపాట- ఏమి సాహిత్యము, ముద్దుగారుతూన్నది. నా కిది చెప్పవూ?

ప్రస—నే నొకటి పాడనా?

భద్ర—ఏది. కానీ— వింటాను.

ప్రస—		శ్యామరాగము.

శాంతములేక సౌఖ్యములేదు - సారసదళనయనా॥
దాంతునికైన వే - దాంతునికైన ॥శాంత॥

ప్రభా—సరిపోయింది. కరుణరసానికి విరుగుడు శాంతరసమే. అదీ కాకుండా, మంచి హితోపదేశముంది ఇందులో. అదిగో పొద్దువాలింది పోదాము రండి. (పోవుదురు)

ప్రసన్న—భద్రా, మీ అన్న వస్తాడన్నావు. ఆ పెమ యముని కృషి చేస్తూన్నావా? లేక ఊరకున్నావా?

భద్ర—నే నేమి చేయగలను? ఇక్కడుండడము నాకు సుఖముగా ఉం దనుకొంటున్నావా? నాగతి నరముమీది పుండులాగుంది. నాకన్న కుక్క మేలు, కోపము వచ్చినప్పుడు కర్రతో రెండు కొట్టినా తరువాతైనా బుజ్జగిస్తారు. నా కహో రాత్రము నరకయాతనే! నారాత అటువంటున్నప్పు, ఒకరి ననడ మెందుకు? ఓపిక పట్టగలిగినంతకాల మూరకుంటాను, భరించలేనప్పుడు బావురని ఏడుస్తాను. అన్నికష్టములూ పడుమని బ్రహ్మ నానొసటనే వ్రాసినాడు. ప్రారబ్ధ మనుభవించి తీరవలెను. కట్టుకొన్న పురుషుడు గతించెను. అత్తమామలకు నాపై ప్రేమ ఆయన ననుసరించిపది కాని ప్రత్యేకము నాయందు వారి కెందు కుంటుంది? పదిమిటితోనే నా ముద్దుముచ్చటలు తగులబడ్డవి. ఇక బ్రతికినన్నాళ్ళూ దినములు లెక్కపెట్టుకోవడము తప్ప వేరుపని నా కుండదు. మనుష్య జన్మ మెత్తినాను కనుక నాబుద్ధి నైజముగా ముద్దుముచ్చటల వెంట పరుగెత్తుతూంటుంది. పుట్టింట నుండే అవి కొంతవరకూ అనుభవించవచ్చును. అత్తింటివాసము అమరిననాడే అన్ని విలాసములకు నీళ్ళధార! నాప్రాత అట్టిది. యావజ్జీవము దుఃఖ

సాగరములో మునిగి తేలుతూండవలెను. నావైపు చూచేవా రుండరు, సర్వజ్ఞుడూ సమాసముద్రుడూ అయిన పరమేశ్వరుడే నన్ను మరిచినాడు, ఇక కించిజ్ఞుల మాట చెప్పనేల? నాపాట్లు పరమశత్రువుకైనా వద్దు. పుట్టింటివాళ్ళని చూచి పట్టెడు ప్రాణమూ బిగపట్టినాను, కాని లేకుంటే ఈపాటి కు యెప్పుడో చూసుకొనియుందును. అంతతో కాని ఈదుఃఖాగ్ని చల్లారదు. ఇక బ్రతుకలేను.

ప్రస—భద్రా, ఎరుగుదును, అంతా నాకు తెలుసును. నీవు శాంతమూర్తివి, వివేకవతివి. నీకున్న ఓర్పు ఇంతా అంతానా? ఎంతబాధ ఓర్చియున్నావు! నాబోటి దైతే ఓపిక పట్టలేక నీవన్నంతా ఇదివరకే చేసియుందును.

భద్ర—ప్రసన్నా! శొంతర పడితే ఏమి లాభము? మొదట భగవంతుడే నన్ను సగము చంపినాడు, లేకుంటే ముడిపడ్డ మూడునాళ్ళకే ముత్తైదువతన మూడనా? తరువాత... ఇటువంటివాళ్ళతో వేగనా?... దయాదాక్షిణ్యమూ మందుకైనా కానరావుకదా? నాత్రింపగళ్ళు కాల్చుకో తినడమే కదా,—ఒకమాట కాదు, ఒకతిట్టు కాదు, ఒకశిక్ష కాదు,ఒకపాటు కాదు...నా ఒళ్ళంతా పచ్చిపుండైనది. మనస్సు మూడే మాటలు - వినరాదు, చెప్పరాదు... నేను మృత్యుదేవత నట, నాది మూడు మొగ మట, నావిచమురుకాళ్ళట- నేను దౌర్భాగ్యరాశి నట- మగని మింగిన మహామారి నట- నేనింట కాలుపెట్టిననాడే జ్యేష్ఠాదేవి వారింట అవతరించిన

డట—నానుంచి వాళ్ళఐశ్వర్య మంతరించినదట!...ఇంకేవో ఎన్నడూ ఎరుగని సామెతలు-పొడుపుమాటలు- శాస్త్రిలు... ఏమని చెప్పుదును?... నేనే మెరుగుదును? నావల్ల నేరమేమి? అర్ధరాత్రి దాకా యింటిచాకిరి చేస్తూనే ఉంటాను, ఒక్కసారి పక్కవాళ్ళేసరికి కోడికూస్తుంది. అంతలో లేచి మాఅత్తగారు కూర్చున్న దగ్గిరనుండి లేవకుండా అన్ని పనులూ చేస్తాను. అయినా మాటలుమాత్రము తప్పవు. అవన్నీ తలుచుకుంటే ఈపాడుప్రాణము పోదా మెగా, పాపిష్టిదైవము నాకెంతఆయుస్సు పోసినాడని మొత్తుకుంటాను. ఆతిట్లు, ఆశాపాలు వింటే అప్పుడే చావాలని ఉంటుంది, కాని వీళ్ళ కేమి పోయింది? నాతల్లిదండ్రులు దుఃఖపడుతారనే భయముచేత అంత దురంతము చేయకుండా సిగ్గు అభిమానము, ఆత్మగౌరవము విడిచి పెట్టి జీవచ్ఛవములాగు బ్రతికి యున్నాను... విముక్తి ఏనాటికో?

ప్రస—నే నొకమాటు బుద్ధి చెప్పుదునా?

భద్ర—నీపుణ్య ముంటుంది, అది మాత్రము వద్దు. మాఅత్తగారు నీమాట అసలే చెవిని పెట్టదు, సరేకదా, నన్ను వెనుకవేసుకొని వచ్చినందుకు నిన్నూ పది తిట్టడమే కాకుండా నీతో చెప్పినానని నన్ను ఇంతకన్న ఎక్కువగా నలిపివేస్తుంది. ఒకసారి కరుణతల్లి మాటవరుస కీప్రసంగము తెచ్చిందని, నన్ను పడమోది, ఒళ్ళంతా హూనముచేసి పైపెచ్చు నేనేమో ఆమెమీద చాడీలు అందరితో చెప్పి

ఇంటిపరువు తీస్తున్నానని నానామాటలాడింది...నాకర్మము నాది, నీ విందులో కలుగజేసుకోకు...నా కష్ట మనుభ వించక తీరదు...ఇదిగో మాఅన్నకు త్తరము వ్రాసినాను. రేపో నేడో వస్తాడు. వాడు నన్నింటికి తీసుకొని వెళ్ళినాడా సరే, లేకుంటే ఈబాధ తొలగేదారి నేనే చూచుకొంటానని నిక్కచ్చిగా చెప్పుతాను. నాకు వాడే దిక్కు.

ప్రస—అయితే నీ ప్రయాణము నిజ మన్నమాటే. ఇంకా ఎన్నో పాటలు చెప్పుకోవలెను, కట్టు బాకీఉండి పోయింది. ఉన్న నాలుగుగడియలూ వీలున్నంత నేర్చుకొం టాను. వారము రోజులేనా ఆగుతావా ?

భద్ర—ప్రసన్నా ! క్షణ మొక యుగములాగు చూసుకొంటున్నాను. నామీద నీకు నిజమైన ప్రేమ ఉంటే త్వరలోనన్నిక్కడనుండి తరలించుమనిభగవంతుని ప్రార్థించు- నేనూ వేయిదేవుళ్ళకి మొక్కుతూన్నాను. మా అన్నయ్య ఇక్కడికి రావడమే తడవు. ఒకక్షణ మాగను, ఎవ రేమను కొన్నాసరే.

ప్రస—బాగానే ఉంది. పాటమాత్రము వ్రాసి యివ్వవలెను సుమా...... (వెళ్లుదురు)

---

*

## రెండో రంగము—భద్ర అత్తవారిల్లు

---

భద్ర—మాఅన్నను చూడవలెనని కళ్లు కాయలు కాచినవి. నిన్నటి కాకి అదేపనిగా అరుస్తూన్నది. అరికాలు దురద వేస్తూన్నది. ఎడమకన్ను బెదురుతూన్నది. ఈ శుభ శకునాలు చూస్తే మాఅన్న నేడో రేపో వచ్చి నన్ను తీసుకొనిపోక తీరదు. దారము తీస్తూ ఉంటాను.

(కావేరమ్మ వచ్చును)

కావే—ఇంకా దారము తీయడము కాలేదే? రాత్రి పడుతూంది, వంటెవరు వండుతారు నీ అబ్బ? నీ ఏడుపూ పాటా అంతమయ్యేటట్టు లేవు. ఇక చాలించి రాట్నము దగ్గరనుండి లే. పనిచేయవ సివస్తుందని రాట్నము ముందు పెట్టుకొనికూర్చుంటావు. మాయ రాట్న మొకటి దొరికింది, మగవాళ్ళకీ ఆడవాళ్ళకిన్నీ.

భద్ర—ఇదిగో బుడత అయిపోవచ్చింది, కొంచెము దారము తీసి చాలిస్తాను. (దారము తీయును).

కావే—నామాట వినబడ్డదా? లే, వంటకి వేళయింది. ఈ దయ్యము నిన్న వదలదా ఏమి?...తీయవేమి? నీ యేడుపు కాల, నన్నేమి నమిలేస్తున్నావే! నా మాట లక్ష్యములేదే?

భద్ర—ఇప్పుడే కదా చెప్పినారు. ఈ రెండేకులూ

తీసి రాట్నము తీసివేస్తానన్నాను. వంట కేమి తొందర ? ఇంకా పొద్దు గుంకలేదే ?

కావే—ఓసి భ్రష్టా, తప్పు నీ మీద నుంచుకొని పైపెచ్చు నేను తొందరపడుతూన్నా నంటావా ? నా మాటంటే అంత నిర్లక్ష్యమా ? మాటకి మా టెదురు చెప్పుతావా ? ఎంత తలబిరుసే ! ఏమి చూచుకొని ఇలాగు మిడిసిపడుతూన్నావు ? లేస్తావా ఒక్క తాపు తన్ననా ?

భద్ర—అంత కోప మెందుకు ? నే నేమన్నాను ? .. వంట కప్పుడే ఏమి తొందర ? కావలసినంత వ్యవధి ఉంది.

కావే— లెమ్మని చెప్పితే పేడతట్టలాగు కూర్చొని నోటికి వచ్చినట్లల్లా వదరుతూన్నావా? నా మాట వినకుండా కూచున్నదగ్గరనుండి కదలకున్నావు. నీ మొగాన నిప్పులు పొయ్య, ఎంత బండతనమే. దుమ్ములు విరిగేలాగు పొడుస్తా నుండు (క్రిందతోసి జుట్టుపట్టుకొని లేవనెత్తును)

భద్ర—అమ్మా ! అమ్మా ! నా కేమిదారి ? ఎవరితో చెప్పుకోను ? ఏమి చెయ్యను ?

కావే—పాడునూతిలో పడు, పాడుముండా; నీకుదిక్కెవడే ? చెట్టంత మగడిని కడుపున పెట్టుకొన్నది చాలక నన్ను నమిలి మింగివేయవలెనని ఉన్నది కాబోలు నీకు ?

భద్ర—నావల్ల నేర మేమి ? న న్నెందుకు చావ కొట్టుతారు ? పాడుదైవము నా ప్రాణాన్ని తీసుకొని పోకు

న్నాడు. (అత్తగారికాళ్ళమీఁద పడి) నాకు మీరే దిక్కు, మీరే రక్షించాలి.

కావే—(కాళ్ళతో తన్ని) నీవు నన్ను భక్షించుతూంటే నేను నిన్ను రక్షించవలెనా? (మరిరెండు తన్నును) ఎంత టక్కరివే!

భద్ర—అమ్మా! నాయనా! నాగతి ఏలాగున్నదో ఒకసారి వచ్చి చూడరాదా? అన్నయ్యా! నీవేనా రక్షించవా? దిక్కులేని దీనురాల నైనాను. దైవమా! నీవేనా దయజూపి నన్నంతమొందించరాదా? మృత్యుదేవతా, నీవైనా తీసుకోపోరాదా?

కావే—లే-దున్నపోతా! ఎందుకా ఏడుపు? నీ పుట్టింటివాళ్ళు బుగ్గికాను! వాళ్ళు రావాలని ఏడుస్తూంటావు. గట్టిగా ఏడుస్తే ఇరుగుపొరుగువారికి వినబడుతుందని పెద్దగోల చేస్తున్నావా? నీ కేమి ప్రాణముమీఁదికి వచ్చిందే? నీ వింతలో చావవు- మమ్మందరినీ చంపినదాకా నీకు చావు మూఁడదు; నాది పూచి- నీవంటి పాపిష్ఠికి నూరేళ్ళు ఆయుర్వుంటుంది. నీ దొంగఏడుపు లెక్కచేస్తా ననుకొన్నావు కాబోలు? నాదగ్గరా నీ టక్కులు? ఎంతో కొట్టినట్టు గోల పెట్టుతూన్నావు- ఎంత వగలవంకాయవే? మాయలాడీ!

భద్ర—చావమోఁదడమే కాకుండా ఏడువవద్దంటారా? మంచి శాస్త్రే! నావల్ల తప్పుంటే నన్ను చంపినా ఒప్పుకొం

టాను- ఊరకే నా పుట్టింటివాళ్ళని తిట్టడ మెందుకు? వాళ్ళ నేంచేమి?

కావే—అగ్గా! పుట్టింటివారి నంటే ఎంత రోషము వచ్చిందే? ఆ దౌర్భాగ్యుల కడుపున పుట్టి మాకొంప తీసినావు. నీవు పుట్టకుంటే మేమూ వాళ్ళూ హాయిగా ఉండియుందుమే- కొమ్ముకొట్టిన గేదె లాగు ఎక్కడుంటే అక్కడంతా నాశనము చేస్తావు. నీవంటి దౌర్భాగ్యురాలిని కన్నందుకు వాళ్ళని తిట్టడమే కాదు, బ్రతికుండగానే చితిమీాద పెట్టి కాల్చినా నాకసి తీరదు- వాళ్ళకొంప కొల్లేరు కానూ!... నీవల్ల తప్పు లేదేమి? అంట్లు తోమినావా? ఇల్లు తుడిచినావా? పిండి విసిరినావా?...బోడెద్దుకె టొంప అన్నట్లు రాట్నం ముందు పెట్టుకొని సానిదానిలాగు పాటలు పాడుతూన్నావు, ఇది సంసారికి తగిన పనేనా? పదిమంది పెంకెరండలని చేర్చి ఇల్లంతా ఎగరకొట్టుతూన్నావు. మాయిల్లు రామానుజకూట మనుకున్నావా? రోజూ ఇదే వరుస. కల్లు దుకాణముకన్న <u>కనీస</u> మయింది!

భద్ర—నేనా వాళ్ళన రమ్మన్నాను? మీాకేదో పని తొందర ఉందని వాళ్లకి మీారేగా కబురు పంపినారు?

కావే—వాళ్లని రమ్మన్నాను కాని ఇల్లంతా సంత చేయు మన్నానా? ఏమి టీగోల? వాళ్ళతో సమంగా నీవూ ఆడుతూంటే ఇంటిచాకిరీ నీమగ డెవడు చేస్తాడనుకొన్నావు?

భద్ర—శివశివ! ఇట్టిమాట లనడముకన్న పెద్ద

రాత్రితో ఒక్క పెట్టు పెట్టరాదా? నా బాధ తీరిపోతుంది మీకు.

కావే—అలాగు చేసేది మీ అమ్మా- మీ నాయనా! మాట కెదురు చెప్పవద్దని ఎన్నిసార్లు చెప్పినాను? (కఱ్ఱతో కొట్టును) మానుతావా? నీఃహ్వా పడిపోను!

భద్ర—అమ్మో! నాయనో! అయ్యో దేవుడా!

కావే—నోరు మూసుకో, వెళ్ళు. అంట్లు తోమి పిండి విసురు...పొరుగువారింటికి వెళ్ళవలెను నేను, తెలిసిందా?

భద్ర—పిండి విసరలే నిప్పుడు.

కావే—ఎందుచేత? ఆపని వెవరు చేస్తారు? మీ నాయనా? మీ తాతా?

భద్ర—నేను చేస్తున్నాను చాలదూ? మా నాన్న మీకు చాకిరీ చెయ్యవలెనా? ఈరాత్రికి పిండి ఉంది, రేపు విసరుతాను.

కావే—అప్పటి కప్పుడు రేపు విసురుతావా అపసంతి ముండా! ఏమి ధిమాకు?...ఇప్పుడే విసురు, లేకుంటే వీపు బద్దలుకొట్టి చర్మము నిలువునా చీరుతాను.

భద్ర—ఇప్పుడు విసరలేను, చేతులు బొబ్బలెక్కనవి.

కావే—విసరలే వేమి? తట్టెడు పిండి ముందు పెట్టితే తినగలవూ? తిండికి తిమ్మక్క, పనికి పంది ..బొబ్బ లేమి? రాళ్ళెత్తినావా? గుళ్లెత్తినావా? బాగా కూవో మరిగి అహర్నిశాలు రాట్నము తిప్పితే బొబ్బ లెక్కవూ? అపసంతి రండ

లతో ఆటలాడి దెబ్బతగుల్చుకొన్నావు కాబోలు? నీ వేషాలు నాముందర సాగిరావు. పిండి విసిరితేనే నీకీ రాత్రి తిండి, లేకుంటే పస్తు. ఎంత వేషాలమారివే? పని చేయబడుతుందని పగుల కొట్టుకొన్నావా చేతులు? మాటాడవేమి మొద్దులాగు? మాదిగముండా!

భద్ర— వేకువజామున లేచినదగ్గరనుండి యిప్పటిదాకా పనిచేసి నడుమైనా వాల్చలేదు. ఒక్కసారి ఊరకే కూర్చోలేదు. నా కాటలాడేటందుకు వీలేది?

కావే— నీ పుట్టిల్లు చట్టుబండ కానూ! నీ మొగాన మొద్దులు పెట్ట! ఇరుగుపొరుగువారితో పెత్తనాలు చేసే పెద్దమ్మవు నీకు తీరి కెక్కడ? పెడసరపు మాట లాడినావంటే పలువునా గోతిలో పాతివేస్తాను, ఏమనుకొన్నావో.

భద్ర— మాటాడకుంటే తప్పు, మాటాడితే తప్పు; ఏమి చేతును? చూడండి, నాచేతులలో బొబ్బ లున్నవో లేవో.

కావే— ఎంత వంగనాచివే - చిన్న బొబ్బ ఒక్కటున్నదని పనిచేయడము మానుతావా? ఎంత సుకుమారివే - ఆడదానికి చేతులు కాయలు కాయవలెనని ఎరుగవా? నీ వేమి మహారాజు కూతురవా? కుబేరుని కోడలవా? సాధారణపు సంసారులు ప్రతిపనీ చేసుకోవద్దా? మేమంతా నీలాంటివాళ్ళమేనా? మాచేతులు బొబ్బలెక్కినప్పుడు పనీపాటూ మానితే ఇంటి మగవాళ్ళు పస్తుంటారా? లే - రవ్వంత విసిరేసరికి

బొబ్బ చితికిపోతుంది, కొన్నాళ్ళకి కాయలు కాస్తవి. అంత వరకూ ఈబాధ ఉండేదే- ఆడవాళ్ళ కిది ఆనవాయితి.

భద్ర—ఈరాత్రి ఊరుకుంటే రేపు విసరుతానన్నాను కాని, నేను అసలే విసర నన్నానా!

కావే—మీ తండ్రి కుత్తరము వ్రాసి నీకు పనిసాయము చేయడాని కొక దాసిని పెట్టుమను, నీవప్పుడు హాయిగా కూర్చున్న దగ్గరనుండి లేవ నక్కరలేదు...అందాకా నీకు చేయక తప్పదు, బొబ్బెక్కినా సరే, పుండుపడినా సరే.

భద్ర—ఇంత జాలి లేదా! నే నూరకుంటే ప్రమాదమా?

కావే—ఓసి మాడుకొండా, మాటలలో పెట్టి మరి పిస్తావా నన్ను? నీ అంతర మేమి, నా అంతర మేమి? (కొట్టును) దౌర్భాగ్యపు పెద్దమ్మా, జెష్టముండా, నీ వెక్కడ దాపురించినావే నా పాలిటికి!...చెట్టంత కొడుకునీ తిన్నావు, పైపెచ్చు నన్నింత రవ్వపెట్టుతున్నావే' (కొట్టును)

భద్ర—అమ్మా, అన్నా, నాన్నా! రారేమి?

కావే—వాళ్ళంతా చచ్చారు. వాళ్ళను పిలుస్తావేమి? నోరు మూసుకో- (తన్ని నోరు నొక్కును.)

(ప్రసన్నకుమారి ఉన్ని, కాగితముతో వచ్చును.)

ప్రస—ఏమే భద్రా, ఏడుస్తూన్నావు? ఊరుకో!

భద్ర—నన్ను బాధ పెట్టడము కాకుండా మావాళ్ళ నందరినీ తిట్టుతున్నారు. నావల్ల మావాళ్ళకి కలిగిన అమ

ర్యాద కేడుస్తూన్నాను - నేను పడడము విధి - ఏమీ ఎరు గని మావాళ్ళ నెందుకూ నిందించడము? నా కేమి దారి? నే నేమి చేతును? ఎన్నాళ్లీ యాతన పడగలను?

కావే—నోరు మూసుకో. నీ వెవరో చంపబోతూ నట్లు చుట్టుపట్లవా రందరినీ రప్పించుతూన్నావు. నీ కేమి వినాశకాలము వచ్చిందే? నన్ను రవ్వపెట్టడానికి పుట్టి నట్టున్నావు. నీకు చావు రాదేమే?

ప్రస—అమ్మా! కొంచెము శాంతించండి. చిన్నవా ళ్లేదైనా తప్పుచేస్తే పెద్దలు వచ్చినంత కోపమూ పడుతారా? దీనికి తల్లి, తండ్రి, తోబుట్టువు అంతా మీరే - మీ గర్భ వాసమున పుట్టినదానిలాగే చూడండి దీనిని.

కావే—ఛీఛీ - ముక్కుపచ్చలారని కుర్రది కూడా నన్ను మాటలాడడమేనా?... నేను కోపపడ్డానా? నిన్నె క్కడ తీర్పుచెప్పుమని బొట్టూ కాటుకా పెట్టి పిల్చినవా రెవరు? మా ఇంటిగోలలో నిన్ను తలదూర్చుమన్న దెవరు? ముద్దరాలు సిద్దెవలె వచ్చి బుద్ధులు చెప్పుతున్నావా నాకు? నీ అత్తగారికి చెప్పి, రెండు చెప్పుదెబ్బలు తగులుతవి - అప్ప టికి నీకూ బుద్ధి వస్తుంది.

ప్రస—దిక్కులేని పసికూనను కొట్టవద్దన్నందుకు నామీ దెందుకమ్మా కళ్లెఱ్ఱచేస్తావు? నీ యిష్టమే కానీ, నీకు చెప్పడము నాది తెలివితక్కువే - ఇం కేమనను లే.

కావే—నీ అత్తగారిదగ్గర నీ విలాగే మెలగుతూన్నావు

కాబోలు? ఇంక నోరెత్తకు - మాట వినబడితే మెడపట్టి గెంటుతాను చూసు - తగుదునమ్మా అని తగవు తీర్చవచ్చి నావా?

భద్ర—ప్రసన్నా! నీ విక్క డుండకు. ఈమెచేత తిట్లు పడడము నాకు చెల్లును కాని నీ కెందు కీరవ్వ? ఈరట్లు?

ప్రస—కావేరమ్మగారూ! క్షమించండి - ఇంక మీ యింటికి రాను, కోపపడకండి. రోజూ వచ్చి పోయే ఇల్లు కనుక వచ్చినాను - క్షమించండి ఈతప్పు-

(వెళ్ళబోయేసరికి ముకుంద శాస్త్రి ఎదురుపడి వచ్చి కూర్చుండి)

ముకు—ప్రసన్నా, నిలువబడ్డా వేమి? కూర్చో, రా.

ప్రస—కావేరమ్మగారికి కోపము వచ్చింది నామీద. ఇంకెందుకు కూర్చోడము? (పోవును)

కావే—పీడ వదలినది-తగుదునమ్మా అని నోటికివచ్చి నట్లెల్ల కూసి మీరూ రాగానే ముద్దుగుమ్మలాగు ఊరకుంది.

ముకు—మూర్ఖురాలా, ఇంటికి వచ్చినవాళ్ళ నీలా గేనా గౌరవించడము? ఎంత మర్యాదగా చూడవలెను!

కావే—పిలువని పేరంటానికి వచ్చి పెద్దపెద్దమాట లాడితే ఈలాటి మర్యాద తప్పదు-గుడ్డొచ్చి తల్లిని వెక్కి రించినట్లుంది-ఇప్పటి పిల్లలకి తలతిరుగుడు హెచ్చింది- చిన్నా పెద్దా అంతరము శూన్య మయింద! కాని కాలము వచ్చింది.

ముకు——భద్ర ఏడుస్తూన్నట్టుంది, దాని నేమైనా అన్నావా ఏమి? దాన్ని చూస్తే ఎప్పుడూ చిరచిరలాడు తునే ఉంటావు, అదేమి ప్రారబ్ధమో? (భద్ర ఏడ్చును)

కావే——ఇం కేముంది? మీరా రాసరా యిచ్చినారు కదా ఇంక ఏడవడమే కాదు, నేను కొట్టినాననీ, తనకు దెబ్బ తగిలిందనీ చెప్పుతుంది-పనిచేయక పందిలాగు కూర్చుంటే లేచి వండుమన్నాను- అదీ తప్పే? అంతమాత్రానికి వాళ్ళ వాళ్లెవరో చచ్చినట్లు మొర్రో అని ఏడుస్తూన్నది- ఎంతలేసి వగలు పడుతూన్నది, పెంకి రండ!

ముకు——ఊరుకో అమ్మా! ఊరుకో! మనయింటిపని మనము కాకుంటే ఇం కెవరు చేస్తారు? పెద్ద దొకమాటంటే పట్టుబట్టుతావా? నేను కోపపడతా నూరుకో!

కావే——ఇదిగో-ప్రొద్దుటనుంచీ చిన్న మెత్తుపని చెయ్య లేదు- ఏమైనా అంటే రాట్నము ముందుపెట్టుకొని కూర్చుం టుంది. చీకటి పడుతూన్నదికదా వంట చేయవా అని అంటే ఏడుస్తూన్నది-దానికి తోచదు, ఒకరు చెప్పితే వినదు.

భద్ర——పని చేయుమంటే నే నేడువలేదు-పనిచేయ డమున కెప్పుడూ నేను బద్ధకించలేదు. నన్నేమన్నా నా కెప్పుడూ దుఃఖము లేదు. మావాళ్ళని తిట్టితే మనసు నొచ్చింది, అందు కేడుస్తూన్నాను.

కావే——(నోరు నొక్కుకొని) మీవాళ్ళని తిట్టినానా? ఎంత అబద్ధ మాడినావే? (ముకుంద శాస్త్రితో) దానిమాట

నమ్మకండి-దొంగేడుపు కేదో కారణము చెప్పవలెనని ఈ మాయ పన్నింది. మీరు దీనికి తగని చనువిస్తూన్నారు, ఇంకేమైనా అంటుంది- ఇప్పుడు తిట్టినానన్నది, ఇటుపైని కొట్టినా నంటుంది-

భద్ర—ఆమాటబద్ధమా? విరిగిన కఱ్ఱా, తేరినతట్టూ చూస్తే కొట్టడము నిజమానో కాదో తెలిసిపోతుంది.

కావే—ఓసి నీకొంప కూల, అన్నంతా చేసినావే?

ముకు—చిన్నదాని నెందుకు కొట్టినావే? ఉందిది చెప్పు. అదేమి నేరము చేసింది అంతదెబ్బ తినడానికి?

కావే—అంతా ఇది చేసినపనే, చూడండి. అంట్లు అక్కడేడుస్తూన్నవి, ఇంటినిండా దుమ్ము రేగుతూన్నది. పిండి విసరనేలేదు...ఇంతసేపూ అదిచేసిన దేమిటంటే పిల్లలంనరినీ యింటచేర్చి పెంకు లెగిరేటట్టు పాటలు పాడుతూన్నది, దుమ్ము రేగేటట్టు ఆట లాడుతూంది. అదిగోలకాదు, అంగడికన్నా అధ్వానమయింది.

భద్ర—(చేయిచూపి) ఇదిగో చూడండి, చేతిలో బొబ్బ లెక్కినందువల్ల యిప్పుడు పిండి విసరలే నన్నాను, దానితో వచ్చిం దీశీతు; అంతట నావీపు విరిగేటట్లు కఱ్ఱతో మోదినారు. దెబ్బలు తినలేక అమ్మా, నాయనా అని ఏడ్చినానని, అక్కడనుండి తిట్లు మొదలుపెట్టి నన్నే కాకుండా మావాళ్లని కూడా తిట్టినారు, లేక లేక వాళ్ల కొక్క కొడు

కున్నాడు, వాడిని తిట్టడ మెందు కన్నాను. ఇదీ నేనుచేసిన తప్పు.

ముకు___ఓసిపాపీ, దీనిని కొట్టడానికి నీకు చేతులేలాగు వచ్చినవే? నీవు నోటిపడి కల దానవు. తిట్టినావంటే వింత కాదు. కొట్టినా వన్నా నమ్మవలసినదే. అంతదానివి కావా?

కావే_బాగుంది. మీరుదానిపక్షమే చేరినారు. మీకు నామాట ఏలాగు నచ్చుతుంది? దానిమాట లన్నీ నిజము, నామాట లబద్ధమూ అవుతవి. దాని నేమన్నా అది పుట్టింటికి పోతుంది- నే నెక్కడికి పోతాను? వల్లకాటికి-దానిమాట విని నన్ను చావ కొట్టండి, దాని కసి తీరి కడుపు నిండుతుంది- నే నుండడమే దానికి కిట్టదు; నాకూ చావాలనే ఉంది కాని చావురాదు. ఏమిచేతును?

ముకు___చాల్చాలు- నోరు మూసుకో- మగనిని కొట్టి మొగసాల ఎక్కిందన్నట్లు దానిని చావచంపి చెవులు మూసి చివరకి నే నేమెరుగ నంటావు? లోకము చేప్పేదంతా అసత్యమా ? నీవేనా సత్యవంతురాలవు ?

కావే___సరే- దానిమాటే నిజము కానీ- తప్పుచేస్తే దండించినాను. మాటికి మాట ఎదిరించడము, పెడసరపు మాటలూ దీని కెవరు నేర్పినారో అడుగండి. పెద్దదానిని నన్ను రవ్వంతా లెక్కచేయదు.

ముకు___ఇక చాలించు-తప్పుచేస్తే మందలిస్తారు కాని కొట్టుమని నీ కెవరు చెప్పినారు ?...అమ్మా, భద్రా, దీని

నైజ మెరిగినదే కదా, కోపము వస్తే దీనికి ఒళ్లూ పై తెలియదు- ఏదో గడుపుకో. ఇకముం దీలాగు జరుగనీయనులే... లేచి యింట్లోపని చూసుకో... వాకట్లో చప్పుడౌతూంది, తలుపుతీసి చూడు ఎవరో వచ్చినట్టుంది.

(భద్ర, కావేరి తలా ఒకవైపు పోవుదురు.)

---

## మూడో రంగము.

---

(ప్రేమానందుడు, ముకుందుడు, భద్ర.)

ప్రేమ—శాస్త్రిగారూ, నమస్కారము- అత్తగారూ వందనము—భద్రా, ఖులాసాగా ఉన్నావా ?

భద్ర—అన్నయ్యా, ఇం తాలస్యము చేసినా వేమి ? అమ్మా నాన్నా ఖులాసాగా ఉన్నారా ? ఇప్పటికి నీకు తెరిపయింది మేలే, దారితప్పి వచ్చినట్లుంది.

ముకు—బాబూ, చిరంజీవ. నీవు రావడమువల్ల చాలాసంతోషముగా నుంది. మీ అమ్మగారూ నాన్నగారున్నూ ఖులాసాగా ఉన్నారా ? ఇప్పుడు సెలవులా ?

ప్రేమ—సెలవు లివ్వగానే మా ఊరు వచ్చి రెండు రోజు లుండి మాచెల్లిని తీసుకొని పోదామని వచ్చినాను.

ముకు—మంచిమాటే- కిసిమిసి సెలవులా ?

ప్రేమా—కిసిమిసిసెలవులు శీతాకాలములో ఇస్తారు, ఇప్పుడు వేసంగి సెలవులు, మూడు నెలలు.

ముకు—నా కా ఘోష తెలియదు. చదువుకొన్న వాళ్ళు మీరే ఎరుగుదురు. మా కేమి తెలుస్తుంది?

ముకు—ఇదిగో కొంచెము దాహము పుచ్చుకో. (భార్యతో) కొంచెము ఫలాహారము పెట్టు, అలసివచ్చినాడు (ఆమె వెళ్ళును) నాయనా! కూర్చో, ఇప్పుడే నేను వస్తాను (పోవును)

ప్రేమా—చిత్తము. ఏమి భద్రా, సుఖముగా నున్నావా? చిక్కిన ట్లున్నావేమి?

భద్ర—నీవు వస్తావని ప్రొద్దుటా సాయంత్రము చూసిచూసి కన్నులు కాయలుకాచినవి. ఇక్కడ నాగతి ఏలాగున్నదో దైవానికి తెలుసును, నేను చెప్పలేను.

ప్రేమా—అదే మాలా గంటూన్నావు? బాధ హెచ్చుగా నున్న ట్లున్నదే. కడుపునిండా తిండికి, ఒంటి నిండా బట్టకి కూడా కరవు వచ్చినదా ఏమి?

భద్ర—వాటి కేమి? ఇక్కడి బాధ నరకములోనైనా ఉంటుం దనుకోను. తప్పుచేస్తే దండిస్తే బాగుండును. తప్పు లేనిదే తల బద్దలుకొట్టుతున్నారు మా అత్తగారు. ఏదో మిష పెట్టి నన్ను కొట్టడము న్యాయమే, తిట్టడము స్వాభావికమే. మీదమిక్కిలి మి మ్మన్నమాటలు తలుచుకుంటే నాకు నోటి కన్నము పోదు, కంటికి నిద్ర రాదు. ఇప్పుడే రాద్ధాంత మైనది, ఈనాడు నీవు రాకుంటే రేపు నన్ను చూచియుండవు. నామనస్సు యమయాతన పడుతూన్నది.

ప్రేమా——ఎందుచేత ?

భద్ర——అన్నయ్యా, ఏ మందును ? మాఅత్తగారు వంటి దీలోకములో నుంటుం దనుకోను- నన్ను చూస్తే ఆమె కంట్లో మిరియపుపొడి జల్లినట్లుంటుంది-ప్రతిదానికీ చిరాకు; పనిచేస్తే తప్పు, చెయ్యకపోతే తప్పు; జవాబు చెప్పకపోతే మాటలాడవేమని తన్నుతుంది, మాటలాడితే నా మాటకు బదులు చెప్పుతావా ? నన్నెదిరిస్తావా ? ఏమి పెడసర మని మోదుతుంది- అందుకుతోడు అవి దుర్భాషలు కావు-పోనీ నన్నేమన్నా సరే- అంతతో చాలించక మిమ్మందరినీ నానా మాట లాడుతుంది; ఏమి చెయ్యడానికీ తోచదు- ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగున్నది నా బ్రతుకు.

ప్రేమా——మీ మామగారితో చెప్పలేకపోయినావా?

భద్ర——చాడీలు చెప్పుతూన్నా ననుకోరూ? అప్పుడప్పు డాయనికి తెలిసినా అసిరమ్మ మాట కెదురుచెప్పలేక ఆయన నన్నే మందలిస్తారు. ఏమన్నా ఆయనమీదా పడి కరుస్తుందని భయము. ఈ ఊరంతా ఆమెపేరు చెప్పితే అడలిపోతుంది...మాటవరుస కాతనితో నేనేమన్నా అంటే అదను చూసుకొని నన్ను చావమోదుతుంది. అందుచేత నోరు నొక్కుకొని ఊరకున్నాను.

ప్రేమా——ఇంత బాధ పడుతూన్నప్పుడు నాన్నగారికి కబురంపలేదేమి; ఒక్క ఉత్తరము వ్రాస్తే అతడు తీసుకొని

పోకుండునా? లేకుంటే ఎవరినైనా సాయము తీసుకొని మన యింటికి పోలేకపోయినావా?

భద్ర—ఆలాగుచేస్తే మనకేమైనాగౌరవముంటుందా? పుట్టింటికి అత్తింటికీ అమర్యాద తెచ్చే ఆడది బ్రతికినా ఒకటే చచ్చినా ఒకటే- అందుకు భయపడి ఎన్నిబాధలైనా పడి యిక్కడున్నాను- నిర్భరమయినప్పుడే నీపేర వ్రాసినాను- నేడో రేపో వస్తావు కదా ఈ బాధలు కడతేరుతవని ఆశతో నున్నాను- ఒకమాట కాదు- చిత్రవిచిత్రమైన మాటలు, దెప్పుళ్లు, తిట్లులు- జన్మజన్మాలకీ మరపురావు.

ప్రేమా—నేనూ ఆలోచిస్తున్నాను నీకీబాధ తప్పించవలెనని, అందుకే యింతవేగము వచ్చినాను...(కావేరమ్మ వచ్చును) ఇంక ఒకక్షణ మిక్కడ నుండవీలులేదు, ఇప్పుడే బయలుదేరుదాము.

కావే—ఇప్పుడే? ఈరాత్రి కుండకూడదా? రేపు బయలుదేరవచ్చును.

ప్రేమా—ఇప్పుడే మంచిది, రేపు వర్జ్య ముందట. ...ఇంకొక్కక్షణ మిక్కడుండవద్దు- ఇప్పటికే చాలును.

కావే—అంత ముళ్లమీద నున్నారా? మీచెల్లెలేమైనా నామీద పోటీలు చెప్పినదా ఏమి? నీకెందు కంతకోపము? పెద్దాచిన్నా ఉన్నప్పుడు మాటలు రావా? నేను తన్నేమైనా అన్నానని చెప్పించా ఏమి? అంత కోపముగా నున్నావు నామీద!

ప్రేమా—మా చెల్లెలు చాడీలు చెప్పేది కాదు- అది అబద్ధమాడదు.

కావే—అవును- నావే అబద్ధపుమాటలు- ఓసీ ముద్ద రాలా, మీఅన్నతో నేమి చెప్పినావో ఏదీ నాముందర చెప్పు.

భద్ర—చెప్పడాని కేముంది? అంతా మీరెరిగినదే, మీరు చేసిందే, నే నేమీ కల్పించలేదు.

కావే—నాయనా! నూరేళ్లు బ్రతుకు-దాని చాడీలు మాత్రము విని నమ్మకోకు. ఇది చెప్పినది సర్వాబద్ధము.

ప్రేమా—అది చెప్పనక్కర లేదు-దాని మొగమూ ఒళ్లే చెప్పుతూన్నవి. దాని ఏడుపువల్లనే నిజా యితీ తెలుస్తుంది-

కావే—దానిదంతా దొంగేడుపు-చూచినవాళ్లంతా రామరామ అనవలెనని బుడిబుడి రాగాలు తీస్తుంది-కడుపులో దుఃఖముండదు, కంట నీరుండదు, అదొక వేషము-దాని నేమైనా అంటే నా నాలుక వెయ్యి చీలిక లయిన ట్లే-నేనుగొడ్డు దానిని కాను, అదీ కాక అంద రత్తగార్ల లాగు నేను కోడరికము పెట్టనే పెట్టను- పువ్వులాగ పెంచుకుంటున్నాను దీనిని-

భద్ర—నేనుమాత్ర మందరు కోడళ్లవలెనే కాక ప్రభాసి నా? నన్నెందుకు రోజూ కొట్టడమూ తిట్టడమూ?

కావే—ఎంత పనిమంతురాలవో కనబడుతూనే ఉన్నది. మీ అన్న ఉన్నాడని నన్ను దెప్పుతూన్నావా? నాకేమి భయ మనుకొన్నావా?... నాయనా, చూచినావా దీని చమత్కారపుమాటలు? నేను రోజూ కొట్టుతూన్నా

నట, తిట్టుతూన్నా నట- అత్తగా రెంతమంచిదైనా ఈకాలపు కోడళ్ళతో వేగలేదు- వీళ్ళు చదువుకొన్నవాళ్ళు, తమ బుద్ధి అంతా ఆమెదగ్గరే చూపుతారు- కొంచెము విసుగుకుంటే తిట్టినా రంటారు,కొట్టినా రంటారు-మా చిన్ననాటికోడలాయితే మూడునాళ్ళకే కాపురము ముక్కలుచేసుకొని పోదురు. అత్తాకోడళ్ళ కెక్కడా ఆరుమూడే, తగిన అన్నమునకు తగిన కూర దొరకదు. నేనెప్పుడూ దానిఒంటిమీద చెయ్యి వేయ లేదు, దైవసాక్షిగా చెప్పుతూన్నాను.

భద్ర—నిజమే- అన్నయ్యా, చేతితో కొట్టితే చేయి నొస్తుందని మా అత్తగారు నన్ను కర్రతోనే కొట్టుతారు-

కావే—ఓసి నీనోరు కట్టిపోనూ, ఎంత చతురతబొమ్మ వే ? నామాట నామీదికే తిప్పినావా ? వెళ్ళిపోతానని ఇంత గర్వమా ? ఎప్పటికైనా ఇక్కడికే వచ్చేదాన వన్నమాట మరచినావు కాబోలు ? వచ్చినమాట రానే వచ్చింది. ఇక నానేరము లేదు, ఇదిగో ఇప్పుడే శాస్తి చేస్తానుండు.

(కర్ర విసరును)

ప్రేమా—(చేతితో కర్రనాపి) నా కళ్ళయెదుటే ఈ లాగు చేసినదానవు, ఎవరూ లేనప్పు డెంత చేస్తావన్నా నమ్మ తగినదే. ఇక చాలు- చెప్పేమాట లోకత్రోవ, చేసేచేత లోక త్రోవ— (ముకుంద శాస్త్రి వచ్చును)

ముకు—ఏమి టిది ?

ప్రేమ—ఏమీ లేదు, మాకు సెల వివ్వండి, మేము బయలు దేరుతాము.

ముకు—ఏమిది? ఇప్పుడే? పుట్టిమి మునిగింది? రేపు కూడదా?

ప్రేమ—బయలు దేరే వేళకి రేపు వర్జమట, ఇప్పుడే మంచిదని మా నాన్నగారు చెప్పినారు.

ముకు—అలాగు కాదు, భోజనముచేసి ఈరాత్రి ఉండి రేపు మంచిది చూసుకొనే బయలు దేరవచ్చును.

ప్రేమ—మామగారూ, మీతో చెప్ప కేమి? నాకళ్ళ యెదుటనే మా చెల్లిని కర్రతో కొట్టబోయిందే అత్తగారు, ఎవరూ లేకుంటే అమాంతముగా నెత్తి బద్దలుకొట్టునేమో? కారణ మేమీ లేదు, నాతో మా చెల్లి ఆమెమీద చాడీలు చెప్పిందని మిషపెట్టి కొట్టబోయింది. అ దా సంగతే నాతో చెప్పలేదు. కొట్టవలెనని నిశ్చయిస్తే కారణము దొరక కేమి? మీకూ మాకూ ఈ రవ్వఎందుకు? దీని కీబాధ యెందుకు? ఎంత త్వరలో నిక్కడినుండి తరలితే అంత శ్రేయము ఉభయులకూ.

ముకు—నాయనా, నా మొగము చూడు, ఆడవాళ్ళు మూర్ఖులు, మంచిచెడ్డలు తెలుసుకోలేరు. నోటి కెంతవస్తే అంతమాటా అని తీరుతారు... నేను దానిని మందలిస్తానులే. ఈరో జుండి రేపు బయలుదేరండి. భద్రా, నీవు చెప్పవే మీ అన్నతో నామాటవినుమని.

కావే.—అంత తొందరైతే వెళ్ళనీ. ఇక్కడుండి వీరు చేసే దేమి- మరినాలు గబద్ధాలు కల్పించి నన్ను నిందించడమే కదా? మనము బతిమాలితే మరింత క్రొవ్వెక్కుతున్నారు. ఉంటే హాయిగా కడుపునిండా తింటారు, లేకుంటే రాత్రి అంతా వాళ్ళకడుపులోనే కాలుతుంది. మన కేమి ఉపకారమా? మమ్ముద్ధరించ నక్కరలేదు. నడువనీ- ఒక్క క్షణము నాయింట నుండవద్దు.

ప్రేమా.—భద్రా, నడువ వేమి? మన నంత చులకన చేస్తూంటే మన ముండడము మర్యాద కాదు. ఈమాటలు వింటూ ఇక్కడ కాలు నిల్పవచ్చునా? పద.

ముకు.—అమ్మాయీ! కోపపడకు- అది కొంచెము నోటివడి మనిషి; నన్ను చూచియైన మీరాగండి. అది వెర్రిది.

కావే.—నాకా వెర్రి? వీడికి వెర్రి! వీళ్ళతల్లికి వెర్రి, వీళ్ళతండ్రికి వెర్రి- వాళ్ళందరికీ మతి పోయింది. బుద్ధి లేదు.

ప్రేమా.—నిజమే నమ్మా- నీ వన్నట్లే కానీ...మామగారూ సెల విప్పించండి.

కావే.—వెళ్ళండి- మిమ్ము పట్టుకొన్నవా ళ్ళెవ్వరు?... ఓరీ- దిప్పకాయా, ఇక్కడట్టే వదరకు... మీచెల్లెలికి ఒక మగడిని జతపెట్టితివా దానికీ మాబాధ తీరుతుంది. ఆ అత్త వారింట ఇది మహారాణిలాగు ఊళ్ళేలుతుంది, అప్పుడు వంటా పెట్టూ చేయనక్కరలేదు, కుడిచి కూర్చుండవచ్చును.

ప్రేమా—తథాస్తు. అట్లే దీని నుదుట వ్రాసిఉంటే అయితీరుతుంది, మనము తప్పించగలమా? మీ ఆశీర్వచనమ మోఘమై అంతటి అదృష్టము దీనికిపట్టనీ;మీమాటే సాగినట్లయితే దీనికి మీ బాధ తప్పుతుంది; కాని మీ కూసుహో దేమో అని చింతిస్తూన్నాను- దానికి మగడు దొరకుతాడు కాని మీకు కోడలురాదు.

కావే—చాలు, నోరు మూసుకొని తిన్నగా పైకి నడువండి.

(వారు వెళ్లినతరువాత ముకుందశాస్త్రి కావేరమ్మ మెడపట్టి గెంటి)

ముకు—చాలు నిక నోరుమూసుకో, చుప్పనాతీ, సిగ్గులేక ఇంకా మాటలాడుతున్నావా? నా మర్యాద దంతా మట్టిలో కలపినావు...ఎవరైనా ఇది వింటే యేమంటారు? పుచ్చినకుక్కలాగు కూస్తూన్నావు.

కావే—వాళ్లమీద మీకంత అభిమానముంటే వాళ్లవెంట వెళ్లలేకపోయినారా? నామీదికి నల్లేరుమీద బండిలాగ వస్తున్నారు. ఆచచ్చినవాడు నన్ను మాటలాడుతూన్నప్పుడు వాడినోరు మూయలేక పోయినారుకదా? చేత కాని వాళ్లకి శౌర్య మెక్కువ- మీ అధికారము నాదగ్గరే. ఆడదానిమీదే మీ యాజమాన్యము.

ముకు—అట్టే వాగకు,నెత్తి పగలగొట్టగలను... (ఒకటి కొట్టును)

కావే—నీచేతులు మండిపోనూ! ఎంతదెబ్బ కొట్టినావు! అయ్యో! బాబో!...(తెరపడును)

---

# పునర్వివాహము

## రెండో అంకము

---

### ఒకటో రంగము

(భద్ర రుమాలు కుట్టుతూండగా తల్లి తలదువ్వుతూండును)

భద్ర—అమ్మా, ఇంక చాలించవే. నీకళ్లు చిల్లులు పడుతూన్నని ఇంతసేపటినుండి చూస్తూన్నావు, ఏమీా కన బడలేదు. మెడ నొప్పిపెట్టుతూన్నది.

ప్రేమాంబ—తరువాత పేలు వెతకవచ్చును- ముందు తల దువ్వతాను. ఇదేమే సన్యాసిజుట్టులా గంతా అట్ట కట్టింది? మీా అత్తగారు నీతల రుద్దలేదా ఏమి? ఎంత దుమ్ము పట్టింది!

భద్ర—నీ వింత పెరుగు పాడుచేసినావు, ఇంకా వదల లేదే? దుమ్ముపడి అట్ట కట్టినదా?

ప్రేమ—చూడే, నామాట అబద్ధ మేమో (కొంత మట్టి చేతిలో పెట్టును)

భద్ర—సరే- ఇంకోసారి రుద్దుదువుగాని లే-

(భద్రా అని పిలుపు)

ఎవరో వచ్చినట్లుంది. శ్యామ కాబోలు. శ్యామా, రా, రా. (శ్యామవచ్చును)

శ్యామ—ఇదేమే? మంగళవారమునాడు తలంటుకొన్నావా?

భద్ర—ఈవేళ బుధవారము కాదే? మొన్న నే కదా ఆదివారము.

శ్యామ—సరిసరి. మొన్న ఆదివారమైతే నేడు బుధవారమా? ఎక్కడ నేర్చుకున్నా వీలెక్క? మీ అత్తవారి ఊళ్లో యిలాగే లెక్క పెట్టుతారా ఏమి?

భద్ర—పోనీలే. తెలియక చేసిన తప్పంత ప్రమాదము కాదు. అదీ కాక నాకంత నీమ మెందుకు?

శ్యామ—భద్రా రావే, ఆటకో పోదాము.

ప్రేమ—ఇక్కడాడుకో కూడదా?

శ్యామ—అమ్మో! మీ అబ్బాయి వచ్చినాడు గా? అతనిని చూస్తే సిగ్గుగానుంటుంది.

ప్రేమ—మావాడింట్లో లేడు. ఎవరో స్నేహితులు వస్తూన్నారని స్టేషనుకి వెళ్లినాడు, ఇంతలో రాడు.

శ్యామ—సరే. నేడిక్కడ, రేపు మాయింట ఆడుకొందాము.

భద్ర—శ్యామా. పడమట చూచినావా, మేఘాలెట్లున్నవో, కాటుకలాగు నల్లగా వున్నవే!—దైవమా! మాఅన్న ఇల్లుచేరేవరకూ వర్షము కురియనీయకు!

శ్యామ—అవి వానమేఘాలు కావు-ఒక క్షణములో చెదరిపోతవి చూడు, గాలి రేగనీ- భయపడకు- ఆడుకోందాము రా.

భద్ర—ఇంత తొందర రేమే, కొంచె మాగు అందరూ రానీ-చూడే-ముచ్చట వేస్తుంది-అకాశ మెంత సుందరముగా నున్నదో! అక్కడికి కెగిరితె నీళ్లలో ఆడుకుందా మనిపిస్తున్నది.

శ్యామ—అక్కడికి పోతే నీ వా మేఘములో మెరుపులా గుంటావు-అప్సరసల్లో చేరిపోతావు-నీ అందమునకూ చందమునకూ అదే తగిన చోటు-మేమంతా నీ కాలిగోరికి పనికి రాము. ఉయ్యాల నీవుగాని ఊగితే వాళ్ల తలప్పై తన్నినట్లుందువు-రా, మా యింట రావిచెట్టుకి ఉయ్యాల కట్టిఉన్నది, నేనూపుతాను.

ప్రేమ—ఇవి కొంచెము నోటిలో వేసుకోండి-వెనక ఆడుకోవచ్చును (రొట్టె లిచ్చును)

శ్యామ—నోరు తీపి అయినది, కడుపులో చల్లగా నుంది; ఊగుదాము పద (బైట చప్పుడు)

తెలులో—అమ్మలారా, అయ్యలారా, మీ చేతులు చూచి మీ అదృష్టము, మీ మేలు, కీడు, సుఖము, దుఃఖము, మంచి, చెడ్డ ఉన్నదున్నట్టు చెప్పుతాను-శకున శాస్త్రము, పక్షి శాస్త్రము, భూత శాస్త్రము చదివినవాడను-మళయాళ భగవతి ప్రభావముచేత భూతకాలము, వర్తమానకాలము, భవి

వృత్తులోనూ, జరిగినది జరిగినట్టు, ఉన్నదిఉన్నట్టు, లేనిది లేనట్టు చెప్పుతాను-రండో! రండి!

శ్యామ—ఓహో శకునాలు చెప్పేవాడే-చేయి చూపించుకొందామా-మన అదృష్టము చెప్పుతాడే.

భద్ర—వీడు చెప్పే దేమిటి? మనకు కనబడుతూండగానే. "కోటి వేషాలూ కూటికోరకే." ఊరకుంటే ఎవరూ బిచ్చము పెట్టరని ఏదో వాడి నోటికివచ్చినట్టూ మనము సంతోషించేటట్టూ నాలుగుమాటలు చెప్పి దోసెడుబియ్యము తీసుకొని పోతాడు.

శ్యామ—అలాగు కాదు-మొన్న మా పొరిగింటి వాళ్ల చేతులు చూచి జరిగిపోయినదీ, ముందు జరుగబోయేదీ సరిగా చెప్పినాడట.

భద్ర—అలాగైతే ముందు నీచేయి చూపించు, నిజము చెప్పుతే తరువాత నేను చూపించుకొంటాను.

శ్యామ—అయితే పిలుస్తాను...(పోయి తీసుకొని వచ్చును) శకునాల తాతా, నీ వేమేమి చెప్పగలవు?

తాత—అమ్మా, జరిగినది చెప్తా, జరుగబోయేది చెప్తా, పీడలు పోగొడ్తా, భూతాలు విడిపిస్తా, సంతానము కలిగేటందుకు మందిస్తా, వలపు పోతే తిరిగీ పుట్టిస్తా-పిల్లలు పోతూ ఉంటే, గర్భాలు నశిస్తూంటే వనాంతరా లిచ్చి బాగుచేస్తాను-పాముమందు, తేలుమందు, విషజాతిపురుగు

ముట్టితే మందిస్తా...తలతిప్పు, డోకు, వాంతి, విరేచనము, జ్వరము, వీటికి మందిస్తా.

శ్యామ——అవన్నీ మాకు కాపట్టవు గాని చేయిచూచి ముందు జరుగబోయేది చెప్పుతావా?

తాత——అది మా కులవిద్య. చెప్పకేమి? ఏదీ నీ చెయ్యిచూపు.

భద్ర——చూచినందు కేమి పుచ్చుకొంటావు?

తాత——మీరు సంతోషించి ఏమిస్తే అది పుచ్చుకొంటాను——విద్య నమ్ముకోగూడదని మా గురువుగారి ఆజ్ఞ-అందుకోసము మీరు తృణమిచ్చినా సంతోషముతో పుచ్చుకొంటాను.

శ్యామ——సరే-ఏదీ నా చెయ్యి చూడు. (చూపును)

తాత——(కర్ర పట్టుకొని కళ్లు మూసుకొని కొంత సేపు గొణిగి, చేయిచూచి) అమ్మా, అడుగదలచిన దడుగండి-దైవసాక్షిగా, గురువుపాదాలు సాక్షిగా, మళయాళభగవతి సాక్షిగా, శాస్త్రము చెప్పేది, మీరు కోరేదానికి మాకు తెలిసేది చెప్పుతాము. ఇందు మాయమూ లేదు, మంత్రమూ లేదు...(కళ్లు మూసి తెరిచి) నీవు గొప్పయింటి పడుచువి-గొప్పయింట పుట్టినావు-గొప్పయింట పడినావు-మీఅమ్మ అయ్య మంచివారు, అత్తమామ...మంచివారే కాని... (మొగము వంచును)

శ్యామ—చెప్పు చెప్పు-అందరూ ఎరిగినదే-భద్ర నాకు పైది కాదు.

తాత—కాని అక్క డొక యిల్లాలుంది, ఆమెకు నిన్ను చూస్తే...

శ్యామ—అవును ఆడపడు చుంది, నన్ను చూస్తే దానికి కిట్టదు.

భద్ర—నీవే చెప్పు తాతా వేమి?అందించకూ.

తాత—అమ్మా, ఇంటిగుట్టు బట్టబయలు చెయ్యకూడదని ఊరకున్నాను కాని నేను చెప్పదలచిన దదే.

శ్యామ—మా అత్తగారికి నిజముగా నామీద అభిమానముంది, ఆ చుప్పనాతి ఈమధ్య చెడగొట్టింది.

తాత—ఆమేనా మంచిదే. కాని ఈమధ్యచిన్న గ్రహచారముచేత నీమీద ఆమె కిష్టము పోయింది.

శ్యామ—ఏమే భద్రా, నిజమానా కాదా? నే నేమైనా అందించినానా? కాపురానికి వెళ్లకముందు చక్కగా నాతో ఎంతో కలసికట్టుగా నుండేది-మరుసారె నేను వెళ్లినదగ్గర నుంచే కదా దానికి పుండు పుట్టింది...అప్పటనుంచీ చాలా బెట్టుగా నుంటుంది, అదేమి తెగులో? తాతా, కానీ, ఆమెకు నాపైని యిష్టము కుదురుతుందా?

తాత—కుదర కేమి? కొంచం యత్నం చెయ్యవాలి-

శ్యామ—అ దేమిటో చెప్పుదూ.

తాత—ఇప్పుడు నీ గ్రహచారం బాగా లేదు-గురుడు

నీకు సాయం చేయకుంటే ఈపాటి చాలా బాధపడియుందువు.

శ్యామ—గురు డంటే మామగారేనా? ఆయనికి నన్ను చూస్తే ఎంతో ప్రేమ-కూతురిని కూకలేస్తారే కానినన్ను పల్లెత్తుమాట అనరు, ఒకరి ననని వ్వరు-

తాత—రెం డేళ్లనుండి నీకు ఏలినాటిశని పట్టుకొని పిడిస్తూన్నది-అదే సుఖము చెడగొట్టుతూన్నది.

శ్యామ—ఔను-ఆవిడ మాయింట చేరి ఏడాది మీద నాలుగునెల లయింది. అంతకుముందే ప్రవేశించిందీ పీడ?

తాత—మరేమీ-నీవు చీకటిలో పోతూంటే వెనక నడుస్తూంటుంది-ఇంకో మనిషి సాయంవుంటే దూరము తొలగుతుంది-ఒక్కర్తె వుంటే మీదపడి భయము పుట్టిస్తూంది.

శ్యామ—చూచినావా? భద్రా, మా యింట్లో ఎంత చీకటైనా నా కేమీ భయము లేదు, మా అత్తవారింట్లో చీకటిపడితే మసలలేను-ఎంత నిజము చెప్పుతూన్నాడే తాత!

భద్ర—నీ మొగము-మీయింట్లో చిన్నప్పటినుంచీ ఉన్నావు గనుక నిర్భయముగా తిరుగుతావు, మీ అత్తవారిల్లు కొత్తవుటచేత ఒక్కర్తెవూ చీకటిలో నడువలేవు-ఒకరు చెప్పేటందు కేదేమి కష్టము?

(తాతభద్రవైపు చూచి) అమ్మగారికి నమ్మకము లేదు-ఏదీ మీ చెయ్యి చూపండి-మీకు ఫలం చెప్పుతాను-

శ్యామ—అలాగే కాని నావెంటా నున్నపీడ పోగొట్టగలవా తాతా?

తాత—నమ్మకముంటే ఒకక్షణములో వదిలిస్తాను.

భద్ర—శ్యామా, గోతులో పడుతూన్నావు. పీడ పేరు చెప్పి నీ దగ్గిరనుంచి ఒకటో రెండో తాత లాగాలని చూస్తూన్నాడు-జాగ్రత్త!

శ్యామ—ఏమి తాతా! నాదగ్గర సొమ్ము లేదు సుమా, ముందే చెప్పుతున్నాను-నాలుగణాలున్నవి-వీటితో ఒదుల్తే వదలనీ, లేకుంటే ఉండనీ, అంతకన్న ఒకదమ్మిడీ లేదు నాచేతిలో.

తాత—డబ్బు కేమమ్మా! మీరు సుఖముగా నుంటే చాలు, పాడుడబ్బు? పందీ తింటుంది, మనిషీ తింటాడు-డబ్బేమిచేస్తుంది? ఆపీడ వదలి మీకడుపున మగశిశువు పుట్టితే అప్పుడు మీ సంతోషముకొద్దీ యివ్వచ్చును.

శ్యామ—(నవ్వుకొనును)

భద్ర—నవ్వుతూన్నాడు తాత వల-చేప పడ్డాది, కాని యిప్పటికి లాభము కొంచమే.

శ్యామ—తాతా, ఇంకో టడుగుతాను-నిజముగా చెప్పు-ఈమధ్య నెల ఎగించి నాలుగోనెలలో పాడయింది, అందుకు కారణము ఏమిటి?

భద్ర—నేను చెప్పనా?

శ్యామ—చెప్పు చూతాము-చాలా వేళాకోళంగా నుంది నీకు-

భద్ర—నీ గ్రహచారము మొదటి కారణము-రెండో

కారణము తాతచెప్పిన పీడ-పరిహారోపాయాలు తాతకి స్తే ఇటుపై నాలాగు జరుగదు.

తాత—(సంచి కట్టబోవును)

శ్యామ—ఏమి తాతా? కట్టివేస్తూన్నావు.

భద్ర—పాచిక పారలేదని. ఓసి తెలివితక్కువదానా, కోటివిద్యలూ కూటికని నేను చెప్పలేదే?

తాత—నమ్మకము లేకుంటే శాస్త్ర మెందుకు? మీకు నవ్వులాటగా నుంది-సాపమ్మకక్కరలేదంటే నమ్మదా యమ్మా. గురువుగారి యాజ్ఞ నేను మీరుతానా? మీరునా కేమీ యివ్వ నక్కరలేదు-నేను పీడ వదలకొట్టు తాను. మీ గర్భవాసము ఫలించి మగశిశువు పుట్టే ఫలానా యోగి చెప్పినాడని మీరు సంతోషిస్తే చాలును-

భద్ర—తాతా డబ్బు కాకుంటే నీ కేమి కావలెను?

తాత—నాకు ఖ్యాతి-యోగి చెప్పినమాట నిజమని మీరు సంతోషిస్తే చాలును-పాడు డబ్బు, ముండా గడిస్తుంది-కూలివాడూ గడిస్తాడు-

శ్యామ—ఇప్పటికి నమ్మకము కుదిరిందా? తాతా, ఏమి కావాలి చెప్పు-

తాత—దోసెడు బియ్యం, పసుపు కొమ్ము, రవ్వంత నూని, ఉంటే తమలపాకూ వక్క లేకుంటే వద్దు-తక్కినవి మావద్ద ఉన్నవి.

భద్ర—ఇంకేమైనా కావలెనా?

తాత—ఒద్దు-మా కేమీ వద్దు.

శ్యామ—అదిగో బియ్యమున్నవి కదా, తెస్తాను. దోసెడు పోదాము, ఎంతో కాదు, తక్కినవి నీ యింటిలో నుండి తీసుకొని రా.

భద్ర—చూతాము (చేటతో బియ్యము, తక్కినవస్తువులున్నూ తెచ్చును)

తాత—బియ్యముచేట ఎందు కమ్మా, దోసెడు కన్నా ఎక్కువ మాకు గురువాజ్ఞ లేదు-

శ్యామ—(మెల్లగా) చూచినావా? తాత నిజాయితీ-

భద్ర—చివరదాకా చూడు-

తాత—(దీపము వెలిగించి పసుపుకొమ్ముకి పూజచేసి బియ్యంమీద పెట్టి ఏమేమో గొణిగి అమ్మా దక్షిణ ఉంచండి (శ్యామ ఉంచును) గంటవాయించి కుంకుమబొట్టు పెట్టి, విభూతి కలిపి కొంత ఆర్భాటము చేసి సంచిలోనుండి పండు తీసి నైవేద్యము పెట్టి లేచి ప్రదక్షిణము చేసి) అమ్మా, మీరు లేచి ఆచేట తెండి-

భద్ర—చూచినావా శ్యామా?

తాత—(నవ్వి) బియ్యము క్రింద పోసి వేయండి.

శ్యామ—(పోస్తూ భద్రవైపు చూచును)

తాత—నేనుచెప్పిన మాట లనండి-నాకు పట్టిన-భూతము- మళయాళభగవతి- ప్రభావంచేత- నన్ను వదలి-నాశత్రువులమీదికి పోవును గాక!

శ్యామ—(అనును)

తాత—ఇదిగో నేను మంత్రంచెప్పి చెయ్యి ఆడించే టప్పుడు చేటను తన్నండి...హ్రాంహ్రీంహ్రూం ......... ఉచ్చాటం-ఉచ్చాటం-ఉచ్చాటం...

ఇదిగో పీడ మిమ్మల్ని వదలింది- మీవళ్ళు చులకబడి నట్లుందా?

శ్యామ— లేదు-

తాత—(మరికొంత గందరగోళము చేసి)

ఇందుతో పూర్తిగా పోయింది-ఇక మీరు ఇంటిలోకివెళ్ళి కాళ్ళు కడుక్కొని తులసమ్మకు మొక్కి బొట్టుపెట్టుకొని రండి, చిన్న తాయెత్తుకట్టి వసాంతర మిస్తాను-అది కట్టుకుంటే పీడ వదిలిపోతుంది- (శ్యామ లోనికి పోవును-) అమ్మా, ఏదీ మీచెయ్యి చూపండి-ప్రశ్న చెప్పుతాను.

భద్ర—నీ బొల్లిమాటలు నా కక్కరలేదు- నాదగ్గర ఒక దమ్మిడీ లేదు-ఇది నాయిల్లు కాదు-పిడికెడు బియ్యమైనా ఇవ్వను- నీకిష్టమైతే చూడు కష్టమైతే పోను.

తాత—అమ్మా! నీ వేమీ యివ్వవద్దు. ఒక్క సంగతి చెప్తాను. నిజమైతే నామాట నమ్ముతావా?

భద్ర—చెప్పు. (చేయి చూపును)

తాత—నీకు మీ అత్తింట సౌఖ్యము లేక పోవడము చేత మీఅన్న యిక్కడికి తెచ్చినాడు.

భద్ర—నీ కెలాగు తెలిసింది?

తాత—మా కులదేవత చెప్పింది. ఇంకా కొంత చెప్పనా?

భద్ర—చెప్పు.

తాత—మీ అత్తవారింటికి నీ విక వెళ్ళవు.

భద్ర—ఇదేలాగు నీకు తెలిసింది?

తాత—నావిద్య చెప్పింది. సత్యమని నీకు నమ్మకము తోచిందా?

భద్ర—ముందేమి జరుగుతుంది చెప్పు?

తాత—నీవు సుఖపడే రోజు లొస్తూన్నవి. (శ్యామ వచ్చుట తెలిసి భద్ర చేతితో ఊరకుండుమని సంజ్ఞ చేయును.)

శ్యామ—వచ్చినాను.

తాత—కూర్చో. (కూర్చుండును. తాత మూటలో నుంచి ఏవో కొన్ని వేళ్ళు తీసి ధూపంవేసి మంత్రంచెప్పి శ్యామచేతికి కట్టి) ఇంకోమారు నేను చెప్పినట్లను.— నాకు పట్టిన భూతము నన్ను విడిచి యోగి వెంట పోవునుగాక! మళయాళభగవతి ప్రసాదమహాత్మ్యంచేత నామీద నదివాల కుండునుగాక. ఇంకోసారి నాదగ్గర కొస్తే ఇలాగు తన్నుదును. (చేయి తన్నించును) మొగమిమ్మీద కాండ్రించి ఇలాగు ఉమ్మివేతును (బియ్యంకుప్పమీద పడేటట్టు ఉమ్మును) అమ్మా, నీవులేచి కుంకుమబొట్టుంచుకొని మూడుమాట్లు ప్రదక్షిణము చేసి కూర్చొని లే. (శ్యామ ఆలాగు చేయును.)

అమ్మా, ఆ మైలబట్ట మోగిమొగ్గనుమీద పారవేయి.

(భద్ర నవ్వును).

శ్యామ—మరి నాకు బట్ట లేదే!

తాత—పీడ దాని కంటె ఉంటుంది. ఆపైని మీ చిత్తము. భద్రా ఏదైనా బట్ట ఇయ్యవూ?

భద్ర—(నవ్వి) తాతకే డబ్బక్కరలేదు కాని బట్ట కావాలి.

తాత—(ఆమెకు నమస్కరించును)

భద్ర—(లోపలికి పోయి మారుబట్ట తెచ్చును. శ్యామ కట్టికొంచి తాత సంచిలో పెట్టును.)

తాత—అమ్మా, నాకు సెలవు. బదరీనారాయణము యాత్రకి పోయి నాలుగునెలలకు వస్తాను. అప్పుడమ్మగారి గర్భంలో మళ్లీయూళ్లభవాని ప్రసాదం మగశిశు వుండాలి మాందేవి తోడు. గురువు తోడు. నారాయణమూర్తి తోడు. (పోబోవును)

భద్ర—తాతా! బియ్యము వదలివేసినావు.

శ్యామ—పిచ్చిలో నున్నాడు కాడే!

భద్ర—మొక్కుటున్నాడు కాని (నవ్వి) చివర కంచులో ఉమ్మినాడు కాడే? మన కెందుకు ఎంగిలి బియ్యము?

శ్యామ—అమ్మా! ఎంత గడుసువాడే!

భద్ర—కోటివిద్యలూ కూటికే నే.

తాత—(నవ్వుతూ) అమ్మగారు చాలా గడుసరి—

(పోవును.)

భద్ర—చూచినావా పీడెంత టక్కరో?—నేను లేకపోతే నీదగ్గర ఏదో అంకించుకొనును. పిచ్చిదానా! ఇటువంటివాళ్ళ మాటలు నమ్మక బుద్ధితో వర్తిల్లు (శ్యామ పోవును)

(ప్రేమానందుడు వచ్చును.)

అన్నయ్యా, ఎంత తాలస్య మయింది. తోవలో గాలివాన వస్తుందనుకొన్నాను. మీ స్నేహితులు వచ్చినారా?

ప్రేమా—వచ్చినారు, ఒకడు మనయింటికే వచ్చినాడు, రెండోవాడు మరొకరిగ్గరకు వెళ్లినాడు.

(సామాను పట్టించుకొని సుందరము వచ్చును)

భద్ర—(సుందరమును చూచి పోబోవును.)

ప్రేమా—చెల్లీ, నాగది తుడిచినావా?

భద్ర—తుడిచి అలికి ముగ్గు పెట్టినాను.

సుంద—(భద్రను జూచి) ఈమేనా నీ చెల్లెలు?—

ప్రేమా—అవును. అదుగో మా నాన్నగారూ అమ్మాను. (పీ రేశ్వరుడు ప్రేమాంబా వత్తురు.)

సుంద—అయ్యా, నమస్తే, అమ్మా, వందనము.

ప్రేమా—చిరంజీవ, నాయనా, ఇద్దరు స్నేహితులన్నావు, ఒకరే వచ్చినారేమి?

సుంద—మరొకడు వారి బంధువులయింటికి వెళ్ళుతానన్నాడు.

వీరే—అయ్యో! అతనినికూడా తీసుకొని రాలేక పోయినారా? మనము బంధువులము కామా? ఎంత పని చేసినారు?

ప్రేమా—రేపు తీసుకొని వస్తాను. నేటి కక్కడుండని. మేముపోయి బండివాని కద్దె యిచ్చి వస్తాము. (సుందరము వెళ్ళును).

వీరే—మంచిది. ఇంతలో వాళ్ళకి భోజనము సిద్ధము చెయ్యి.

ప్రేమ—అలాగే కాని, నాయనా, ఎంత బాగున్నాడురా ఈ అబ్బాయి ఎవరోగాని!

ప్రేమా—మన శాఖే. నుంచి భాగ్యవంతుడు, తలిదండ్రులకొక్కడే కొడుకు. చాలా తెలివైన వాడు. నేనంటే ప్రాణము పెట్టుతాడు.

వీరే—ఏమి చదువుతూన్నాడు?

ప్రేమా—బి.ఏ ప్యాసయి డాక్టరుపరీక్షకు చదువుతూన్నాడు. ప్రతి పరీక్షలో మొదటివాడుగా తేలుతూన్నాడు. సీమ వెళ్ళదామనుకొన్నాడు, ఇంతలో యుద్ధము రాగానే వాళ్ళవాళ్ళు వెళ్ళనిచ్చినారుకారు... వీళ్ళ కుటుంబసంస్థ అతి చిత్రము. వీళ్ళ తాతలు ముగ్గురు సోదరులు, వీళ్ళ తండ్రులారుగురు సోదరులు. అంతా సమిష్టికుటుంబము. ఒకొక్కరికి అన్ని ఖర్చులూ కుటుంబమే పెట్టుతూ పైన నెలకు నూరు రూపాయీలు పైఖర్చు కిస్తారు. బట్టలు, నగలు, ఇళ్లు, ఇంట్లో

సామాను, జబ్బుచేస్తే డాక్టరుకి సొమ్ము అన్నీ సమిష్టికుటుంబ ధనములోనివే- ఏనెల కానెల ఖర్చు వ్రాసి పంపిస్తే సొమ్ము పంపుతారు- ప్రతిఏడూ సంక్రాంతి కండ రొక్కదగ్గర చేరుతారు, రానూపోనూ ఖర్చులు కుటుంబానివే. అప్పుడు పెళ్ళిళ్లూ, చదువులూ మొదలయినవాటికి ప్రతిదానికీ ఎంత ఖర్చు చేయవలసినదీ ఆలోచించుకొంటారు. ఇదికాక నెల జీతములో ప్రతివారూ ఖర్చుకాగా మిగిలినసొమ్ము కుటుంబ నిధికి పంపితీరవలెను- ఒకరో జాలస్యమయితే జరిమానా- భార్యాభర్తలకు వారి తాహతుబట్టి మూడు మొదలు ఐదువందలదాకా ఖర్చు యిస్తారు. సంతానము కలుగగానే మగ శిశువుకి నూరు ఆడశిశువుకి అరవై రూపాయలు చొప్పున హెచ్చు చేస్తారు. మూలధనములోనుంచి ఎవరికైనా హెచ్చు సొమ్ము కావలిస్తే వారి దరఖాస్తు సగముకన్న హెచ్చు మంది ఒప్పుకోవలెను, లేకుంటే ఇవ్వరు- పెళ్ళికి ఐదువేలు మొదలు పదివేలవరకూ ఖర్చు చేస్తారు. అంతా అతిచిత్రము. మొన్ననే గొప్పఎస్టేటు కొన్నారు, సాలుకి ముప్పైవేలు రాబడి.

ప్రేమ—అదృష్టవంతుడు ఇతనికి పెళ్ళి అయినదా ?

ప్రేమా—లేదు- చదువు ముగిస్తేనేకాని చేసుకోనన్నాడు- ఈ సెలవులలో చేసుకోకతప్పదని తండ్రిగారు నిర్బంధిస్తూన్నారు- ఏమవునో తెలియదు.

(సుందరము వచ్చును)

వీరే—భోజనము కానిత్తామా? అందరితో నున్నారు కాబోలు.

ప్రేమా—నేను స్నానము చేస్తాను.

సుంద—నేను చెయ్యను-వేగము పోయి రా, నే నిక్కడే ఉంటాను-

ప్రేమా—నాగదిలో కూర్చో, క్షణములో వస్తాను.

సుంద—(గదిలో బొమ్మలు, ఉన్నపనులు చూచి) వాహ్వా! ఇవన్నీ ఇతని చెల్లెలు తయారుచేసినవే కావచ్చును. మంచి తెలివైనది, రూపసి, కాని దౌర్భాగ్యదశవల్ల వైధవ్యము ప్రాప్తించింది- ఇట్టి కష్టజీవిని సుఖపెట్టుటకు ఎంత యత్నమైనా చెయ్యవలెను. ఇతని తలిదండ్రులు ఒప్పుకోరు. పోనీ, ఈమె ఉద్దేశ మేలాగున్నదో కనుక్కొని ఏమాత్రము వీలున్నా మంచిసంబంధము కుదిర్చి ముడిపెట్టవలెను. (లోపలి నుండి పిలుపు)—ఓహో భోజనానికి వేళయింది- (పోవును)

---

రెండో రంగము—వీరేశ్వరుని ఇల్లు.

---

వీరేశ్వరుడు—రామయ్య.

రామ—బాబో మాబోంట్లకి మీరే దిక్కు. కుమార్తె ఎదిగింది, పెళ్ళిచేయకపోతే మాయింటిది కూడెట్ట నన్నాది- ఇంటి కొచ్చేవాళ్ళు, పొయ్యేవాళ్ళు రోజూ జాతరే. చెప్ప

లేక చస్తూన్నాము-ఇంక మూర్తాలు లేవని పంచాంగం బాపనయ్య చెప్పి వెళ్ళినాడు-చేతిలో గుడ్డిగవ్వ లేదు-పంట లెగవేసినవి- పాటుపడతామే కాని పైసా చేతిలో చిక్కదు-ఇక మీదే భారము-ఈకార్యము ఏలాగు గట్టెక్కిస్తారో?

వీరే—ఏమంటావు; అప్పు కావలెనా?

రామ—లేకపోతే మీయింటి కెప్పుడైనా వచ్చినానా?

వీరే—అన్నా! మంచి చిక్కుసమయానికి వచ్చినావే. దస్తు ఏమీ వసూలు కాలేదు. కాటకమని అంతా వెనకబెట్టినారు. ఒక్క రూపాయి లేదు నాదగ్గర.

రామ—ఎలాగైనా ఇవ్వాలి-లేకుంటే ఇక్కడ పస్తు పడుకుంటాను కాని ఇంటికి వెళ్ళను. ఊరంతా తిరిగినాను, పది రూపాయిలు పుట్టలేదు- చావుమన్నారా ఏమిటి? మీకివ్వక తప్పదు.

వీరే—ఎంత కావలెను?

రామ—ఎంతోనా? నూరు రూపాయీ లుంటేనే కాని పని సాగదు-ఇప్పుడంటే చితికిపోయినాము కాని మా అయ్య బ్రతికుండేటప్పుడు నాపెళ్ళి కారువందలు ఖర్చు చేసినాము-ఇప్పుడేనా పిల్లాడి పెళ్ళైతే నాలుగైదువందలయితేగాని చాలవు. ఆడపిల్లపెళ్లి గనుక అంతక్కరలేదు-ఒక్క నూటితో ఏలాగోలాగు కార్యమయిందనిపించుతాను.

వీరే—నిజమే దస్తు నాదగ్గర లేదు-ఏమి చేయను?

ఉంటే ఇంతసేపా ? మోతుబరివి కానా ? సొమ్ముకేమి భయమా ?

రామ—పోనీ ఎక్కడేనా తెండి.

వీరే—ఆపని నీవే చెయ్యవలెను. నేనైతే వడ్డీ ఎక్కువడుగుతారు.

రామ—ఎంత వడ్డీకైనా తేకతీరదు. అవసరమటువంటిది. రైతుల పని ఇలాగే చితుకుతుంది.

వీరే—సాయంత్రము గా, ఎక్కడా అడిగి తేలేదు ఈసరికి. నీ వంతగా బలవంతపెట్టుతూన్నావు గనుక తేక తీరదు. వడ్డీకి మాత్రము వెనకతీయకుమా.

రామ—ఎంత కావలిస్తే అంత పుచ్చుకోవచ్చు. ఎంతో కాలము ముంచను. రెండువందలు ఖరీదుచేసే ఆవుంది, వారము రోజుల్లో ఈనుతుంది. గాని అమ్మి క్షణంలో అప్పు తీర్చేస్తాను.

వీరే—మరచిపోయినాను. మా ఆవు వట్టిపోయింది, దానిని మార్చి క్రొత్తదానిని కొనవలెనని చూస్తున్నాను.

రామ—మా ఆవును పుచ్చుకోండి.

వీరే—అంత పెద్దది నాకెందుకు ?

రామ—ఖరీదు కేమి లెండి. దూడ మంచివంగడము కలది, గంగిగోవు. చంటిపిల్ల పొదుగులో చేయి పెట్టినా ఏమీ అనదు.

వీరే—కొద్దిరోజు లుండనీ, నేను భరించలేకపోతే తీసుకొనిపోదువు గాని.

రామ—అలాగే-ఈనగానే పంపుతాను. (వెళ్లుదురు)

(భద్ర చీపురుతో ప్రవేశించును)

భద్ర—నాన్నగారు స్నానానికి వెళ్లినారు, మా అన్న ఏటికివెళ్ళినా డింకా రాలేదు-వాళ్ళు వచ్చేసరికి గది తుడిచి నీళ్ళు జల్లవలెను...ఇ దేమిటి, నేను కుట్టే రుమా లిక్కడి కేలా వచ్చింది? మా అన్న తెచ్చి ఉంటాడా-లేకపోతే అతడే...తీసియుంచునా?... ఏమో?... ఇంతలో నేమాయె?...(తుడువబోయి) అయ్యో దైవమా!...నాగతి ఏమి కాను? ఇట్టి దౌర్భాగ్యాన్ని నేల సృజించినావు?...నాలోని బాధ అణగదాయెనే? ఎవరితో చెప్పుకొందామన్నా సిగ్గు వేస్తూన్నది-ఎట్టి దుఃఖమైనా కొంత కాలానికి తగ్గుతుందంటారు-ఇదట్లుకాక నానాటికి హెచ్చి దుర్భరమవుతూన్నదే-అత్తింట నుంటే అ దొక బాధ, ఇక్కడికి వచ్చి దానిని మరచినాను కాని, ఈ కొత్తబాధ బ్రతికి ఉన్నంతకాలము తగ్గేటట్టు లేదు-ఇక నా కీజన్మమున సుఖము లేదు-అయినా మనస్సు పరిపరివిధముల పరుగు లెత్తుతూన్నది-మాఅన్న ఇతని నెందుకు తెచ్చినాడు? ఇతనిని చూచినప్పుడు మరేమీ తోచదు-ఎంతసేపైనా ఎదురుగా ఉండవలెనని ఉంటుంది-అతను మాటాడితే ఇక ప్రపంచమే మరచిపోతాను-కంటికి నిద్ర రాదు, అన్నము నోటికి పోదు-ఏపని చేసినా మన స్సతని

మీదికే పోతుంది-ఈరోగము కుదిరేటట్లు లేదు. ప్రాణహింస పాపమనే భీతిచేత బ్రతికియున్నాను కాని లేకుంటే చావ వలసినదే-హా! దైవమా నన్నెందు కింతబాధ పెట్టుతూ న్నావు? ఒక్కసారి చంపరాదా? పైకి చెప్పలేను, లోపల ఉంచుకోలేను-మరణయాతనలా గున్నది... పాడుప్రాణము పోకుండా ఉన్నది-నిరాశ పీడిస్తూన్నది-మనసులో ధైర్యము నశించింది-ఈబాధ అనుభవించినవారికే తెలుస్తుంది కాని ఇతరు లూహించలేరు-ఏ వైద్యుడూ ఈవ్యాధిని కనిపెట్ట లేడు-చికిత్సచేసినకొద్దీ స్ఫోటకములాగున హెచ్చుతూంది-నా శరీరమనే అమ్ములపొదిలోనుండి మనస్సనే బాణము సూటిగా సుందరుని దాకినది-అతడు నిసర్గ గంభీరుడూ, మగ వాడూ కావున ఒకవేళ నాలాగే బాధపడుతూన్నా బయలు పడకు-పదిమందిలో నున్నా నాకేమో నిర్జనారణ్యమున నున్న ట్లున్నది-దారి తోచదు, తెన్ను తోచదు. ఎవరు! చూచినా చిక్కిపోతున్నానని, మనసు కుదుటలేదనీ అంటారు-నా శక్తికొద్దీ అదుముతూన్నా రోగము బయట కుబుకు తూన్నది-మావాళ్లకి తెలుస్తే ఎంతప్రమాదము! ఏమి దారి? ఇంతవరకూ బ్రతుకు సగౌరవముగానే సాగింది-ముం దున్నది ముసుళ్లపండుగ...(భద్రా అని పిలుపు) అదిగో! వాళ్ళు వచ్చి నట్లున్నది- ఇంకా ఆలస్య ముంది గనుక కన్నులకరవుతీర నా ప్రేమనిధానమును చూస్తాను, తాపము కొంత శమించవ చ్చును (తలుపు తీయగా ప్రేమానందుడు సుందరమూ వత్తురు.)

ప్రేమా—నాన్నగారేమి చేస్తున్నారు?

భద్ర—పూజ చేస్తున్నారు-మీరు పట్టుబట్టలు కట్టుకో వచ్చును- (పట్టుబట్టలతో వత్తురు)

సుంద—ఔను కాని, రోజూ తినడము తిరగడముతోనే గడచిపోతూన్నది-ముఖ్యమైన పని మరచిపోయినాము-ఆ ప్రసంగము తెచ్చి చూడు మీవా ళ్ళేమంటారో, దాని పరిణతినిబట్టి మనము ముందు కార్యక్రమము మార్చవలసి ఉంటుంది-ఆలస్యమైనకొద్దీ కార్యము చెడిపోతుందేమో సుమా!

ప్రేమా—నా కాసంగతి జ్ఞాపకము లేక పోలేదు, కాని దానిగురించి ఏలాగు మాటలాడడానికీ పాలుపోకున్నది-అవకతవకగా వ్యవహరిస్తే అసలుకే మోసము వస్తుందేమో అని జంకుతూన్నాను.

భద్ర—మీరు మాటలాడు తూండండి, నేనుపోయి భోజనానికి సమయము కాగానే చెప్పుతాను- (వెళ్లబోవును)

ప్రేమా— భద్రా, ఉండుండు నిన్ను కొన్ని మాటలడుగవలెను.

భద్ర—నన్నా? తరువాత కూడదూ? ముందు మీ ప్రసంగము కానీ.

ప్రేమా—అదీ నీ గురించే, నీవు లేకుంటే ఏలాగు?

భద్ర—ఆలాగైతే ఉంటాను-

ప్రేమా—కుర్చీమీద కూర్చో. (ఆమె క్రింద కూర్చుండును)

ప్రేమా——మీ అత్తవారు నేడో రేపో నిన్ను పంపు మని వస్తారు, ఏమి చెయ్యడము?

భద్ర——బాగుంది-నన్నా అడుగుతావు?

ప్రేమా——వెళ్ళేదానవు నీవు, ఇం కెవరి నడగడము?

భద్ర——వెళ్లడానికీ మానడానికీ నా యిష్టమా?

ప్రేమా——బాగుంది-నీ యిష్టము లేకపోతే పంపేవా రెవరు?

భద్ర——అ దేమన్నమాట-నాన్న పంపుతే నాకు వెళ్లకతీరుతుందా? నేను వెళ్లనంటే సాగుతుందా?

ప్రేమా——సాగేలాగు చేయడమే మా ఉద్దేశము.

భద్ర——నాన్న గారిని నొప్పించడ మేలాగు?

సుంద——మాశక్తికొద్దీ యత్నము చేస్తాము.

భద్ర——కొంతకాల మక్క డుండి ఇప్పుడు వెళ్లనంటే సాగుతుందా?

సుంద——మొదటనే వెళ్లనంటే మొండితన మవు తుంది, కొంతకాల మక్కడుండి అనుభవించిన తరువాత నిర్భర మవుతేకదా వెళ్లననడము దగ్గిరకి వచ్చింది-

ప్రేమా——నిన్ను వాళ్ళు పెట్టిన బాధలన్నీ నాన్న గారితో చెప్పినాను-కంట నీరుపెట్టుకొని ప్రారబ్ధ మన్నారు-

భద్ర——అంటే నే ననుభవించకతీర దన్నమాటేనా?

సుంద——అలాగు కాదు. ఆయనకి కూడా యిష్టము లేదన్నమాట-నీవక్క డుండడము

భద్ర—పుట్టింట ఎన్నాళ్ళని ఉండడము? ఇది బాగుంటుందా పదిమందీ వింటే? ఎంతో ఘరానాగా బ్రతుకుతూన్న మనకుటుంబమున కది మచ్చ కాదా?

సుంద—కాదు. భార్యాభర్తల కన్యోన్య మిష్టము లేనప్పుడు ఆడది పుట్టింట ఎన్నాళ్లైనా ఉండలేదా? మగడు విడిచినవారు పుట్టింటికి కాక ఇంకెక్కడికి పోగలరు?

భద్ర—వాళ్ళదారి వేరు. ఇద్దరూ బ్రతికిఉంటే ఎక్కడున్నా తకరరు లేదు.

సుంద—దారి ఒకటే. అత్తింట ఉండడానికి వీలులేకపోతే పుట్టింట ఉండడము స్త్రీజనమునకు సహజము.

ప్రేమా—అత్తవారింటికి వెళ్ళడమా, మానడమా? ముందిది తేలనీ; ఎక్కడుండడమో తరువాత ఆలోచించవచ్చును. అక్కడుండడము నీ కిష్టమా? అది చెప్పు.

సుంద—ఆ మాట కొకటే జవాబు. అంతా కళ్ళార చూచి యింకా అడుగుతా వెందుకు?

భద్ర—(కంట నీరు పెట్టుకొనును)

ప్రేమా—అలాగైతే మరొకటడుగుతాను. అత్తవారింటికి వెళ్ళడ మిష్టము లేదు. పుట్టింట ఉండడ మిష్టమేనా?

భద్ర—ఇష్టమైతే చెల్లుతుందా? వీళ్ళుంచవద్దూ?

సుంద—ఉంచకపోతే చూసుకోవచ్చును. ముందీమాట నిశ్చయించుకున్నావా? మీవాళ్ళు చంపినా సరే అత్తవారింటికి వెళ్ళనని అనగలవా?

భద్ర——నే నంటే మావాళ్ళు వింటారా?

సుంద——వినకపోతే ఏమి చేస్తారు?

భద్ర——తన్ని తగిలివేస్తారు.

సుంద——తల్లిదండ్రులు అలా గెన్నటికీ చెయ్యలేరు.

ప్రేమా——నిన్నొకర్తెనే తగిలివేస్తే తీరదు. నీ మీద ఆశ వదలుకొన్నట్లే నామీద కూడా ఆశ వదలుకోవలెను. నీ ప్రాణమునకు నా ప్రాణ మడ్డు. ఉంటే ఇద్దరమూ ఉండవలెను; పోతే ఇద్దరమూ పోవలెను.

భద్ర——నానుంచి నీవు చెడుతావా?

ప్రేమా——మనమీద ప్రేమ కోసి యింటినుంచి గెంటివేసేటంత దురంతమునకు మన తల్లిదండ్రులు పూనుకుంటే ఇద్దరమూ పోదాము. మన యిద్దరినీ నేను పోషించగలను.

సుంద——సెబాస్-అన్న అంటే నీవంటివా డన్న, తక్కినవాళ్ళు పెద్దన్నలే. అంత దురవస్థ మీకు తటస్థిస్తే మీకు కావలసిన సాయము నేనూ చేస్తాను. మీ కేలోపమూ రానీయను.

ప్రేమా——సరే-నేడే యీ ప్రస్తావన భోజనము దగ్గర తెస్తాను.

సుంద——నే నుండగా నీవు తేవద్దు. నేడేమితొందర? ప్రసంగవశాత్తు రేపో మాపో కదల్చిచూడు.

ప్రేమా——చెల్లీ, ఒక్కటే మాట. మనవాళ్ళు నిన్నత్తవారింటికి పంపుతా మంటారు, నేను వద్దంటాను,

నన్నేమన్నా సరే నేను జంకను; నీవుకూడా కొంచెమైనా జంకక వెళ్ళనని పట్టుబట్టు. ఆపైని ఏమంటారో చూతాము కొట్టరు, తిట్టుతారు, భయపెట్టుతారు; మనమిద్దరమూ చింతాకంతయైనా జంకవద్దు, ధైర్యము తెచ్చుకో; పైని దైవ మున్నాడు. వాళ్ళింటికి వెళ్ళడమువల్ల నీకు యమ యాతన సిద్ధము కదా? అంతకన్నా అడవిలో నుండడము మేలు. నీవు వెళ్ళనంటే మనవాళ్ళు బలాత్కరించకుండా నేను చేస్తాను, నిన్ను కొట్టనివ్వను; తిట్టనీ, ఏమిపోయింది? నోట తుంపరలు రాలుతవి.

భద్ర—సరే. నీ అసరా చూసుకొని నీ వేమి చెయ్య మంటే అది చేస్తాను; వాళ్ళు నన్నేమిచేసినా జంకను.

సుంద—మీ కింత మనోధైర్య ముంటే వాళ్ళు మాత్ర మేమి చేయగలరు? ఇంటిలో నుండ నివ్వరు. అం తేనా? మీరు యథేచ్ఛముగా బ్రతికే దారి నేను చూపు తాను, నన్ను నమ్మండి—దైవసాక్షిగా ప్రమాణముచేసి చెప్పుతున్నాను; మీకు నేను చేదోడువాదోడుగా నుంటాను.

(తెరలో అబ్బాయీ, భోజనమునకు రండి.)

ప్రేమా—ఇదిగో వస్తూన్నాము. వడ్డించు.

## మూడో రంగము

---

వీరేశ్వరుడు - ప్రేమానందుడు.

వీరే—నాయనా, ఇక చింత లేదు. ఇంటిలో పాడి లేక సకల చిక్కులూ పడుతున్నాము. రామయ్యా వారము రోజులలో ఆవుని పంపుతా నన్నాడు, అది పూటకి మూడు నాలుగు సేర్ల పాలిస్తుందట. ఇక మనింటిలో పాలూ పెరుగూ సమృద్ధిగా నుంటవి; ఏమీ లోటుండదు.

ప్రేమా—దాని నెంతకి కొన్నారు?

వీరే—ఖరీదు నిశ్చయించలేదు. ఎంతో కొంత యివ్వవచ్చును. మనదగ్గిర నూరురూపాయీలు బదులు పుచ్చుకొన్నాడు, ఇప్పు డల్లా తీర్చలేదు. ఈయీత పాలు తాగి వట్టిపోయిన తరువాత వాడికే కట్టిపెట్టవచ్చును దానిని

ప్రేమా—దాని అసలు ఖరీ దెంత?

వీరే—ఎనభై రూపాయీ లుంటుంది.

ప్రేమా—పాపము వాడికి చాలా నష్ట ముంటుందే.

వీరే—మనలాభము చూచుకోవాలి గాని వాడి నష్టముజోలి మన కెందుకు? వ్యవహార మంటే ఏ మను కొన్నావు?

ప్రేమా—ఇ దన్యాయము కాదా?

వీరే—ఇదంతా నీ కోసమే, పోయేటప్పుడు నావెంట తీసుకొని పోతానా? కష్టపడితేనే కాని కాసు చిక్కదు.

సుంద—ప్రేమానందా! నేను మహేంద్రు నింటికి పోయి వస్తాను. (సంజ్ఞచేసి పోవును)

వీరే—మహేంద్రు డెవడు?

సుంద—నాతో వచ్చిన స్నేహితుడు.

వీరే—త్వరగా రమ్మా అబ్బాయీ!

సుంద—గంటలో తిరిగివస్తాను. (వెళ్లును)

ప్రేమా—నాన్నగారూ, మి మ్మొకమాట అడుగ వలెనని అనుకొని ఎప్పటి కప్పుడే మరచిపోతూన్నాను. కోపపడనంటే అడుగుతాను.

వీరే—మంచిమాటైతే కోప మెందుకు పడుతాను? అడుగు.

ప్రేమా—మన భద్రమాట ఏ మాలోచించినారు?

వీరే—ఆలోచ నెందుకు? కొద్దిరోజులు పోగానే అత్తవారింటికి పంపివేయడమే.

ప్రేమా—అక్కడ దానిబ్రతు కెలా గుంటుందో మీకు తెలిసియుండీ ఆలాగు చేయడము న్యాయమా?

వీరే—ఎల్లకాల మొకలాగే ఉంటుందా? చిన్న తనము గనుక దానికి తెలియక అక్కడికి వెళ్ళడ మంటే కష్టముగా నుంటుంది. కొన్నాళ్ళ కలవా టయిపోతుంది.

ప్రేమా—మీ రిది స్వల్పవిషయ మనుకొంటున్నారు, కాని దాని కక్క డుండడ మతికష్టము. నేను కళ్ళారా చూచినాను. మన కపకీర్తి వచ్చునని అది జంకుతూన్నది.

కాని లేకుంటే ఆత్మహత్య చేసుకొని యుండు నీపాటికి.

వీరే—తెలివిమాలిన పిల్ల. లోకములో అత్తగార్లందరూ చెడ్డవాళ్లే! కోడళ్లని లొంగదీసుకోవలెననే బుద్ధితో వాళ్ళు సహజము ఉంటుంటారు, అది యిష్టములేక కుర్రకుంకలు ఇంతుంటే అంత చేస్తారు; కొన్నాళ్ళకన్నీ చక్కబడుతవి.

ప్రేమా—అయితే దాని నక్కడికి పంపక తీరదా?

వీరే—అక్కడికి పంపక ఎన్నాళ్ళిక్క డుంచుకో గలము?

ప్రేమా—పంపకుంటే ప్రమాద మేమి?

వీరే—నలుగురిలో నగుబాటు.

ప్రేమా—ఎందుచేత?

వీరే—పూర్వాచార విరుద్ధము గనుక.

ప్రేమా—అత్తగారు కోడలిని చీటికీమాటికీ చావగొట్టడము, కోడలినీ దానిపుట్టింటివారినీ నానాదుర్భాషలాడడమూ పూర్వాచార మేనా?

వీరే—కోపము వచ్చినప్పుడు మాటలాడుతారు, ఒకానొకప్పుడు కొట్టుతారు. కాస్త ఊరకుంటే తీరిపోతుంది, దీని కింత ఆర్భాటమా?

ప్రేమా—పెనిమిటి జీవించియుంటే అత్తింట మగనాలి ఉండడము ఆచారము, కాని అత్తమామలకు చాకిరీ చేయడానికి నితంతమైన కోడలిని పంపడ మేమి సదాచారము? ఇదే శాస్త్రములో నుంది?

వీరే.—దీనికి శాస్త్రమెందుకు? మన దేశాచారమిది; భార్య భర్త యింట నుండడమే పరమధర్మము. ఇదే సదాచారము.

ప్రేమా.—ఎవరి చిత్తము వచ్చినట్లు వాళ్ళు చేయడమే సదాచారమా? అలాగైతే మనము పంపవద్దు, మనల జూచి మరికొందరట్లు చేస్తారు, కొన్నాళ్ళకిదే సదాచారమవుతుంది. పదిమంది చేసేదే పరమధర్మము కదా?

వీరే.—ఇవి మనజాతికట్టుబాట్లు, మన మతిక్రమించకూడదు వాటిని.

ప్రేమా.—కట్టుబాటన్నప్పుడు ఉభయులకూ సుఖదాయకముగా నుండవలెనా వద్దా? కట్టుబాటని నరకముతో నురక మంటారా?

వీరే.—నిజమే, కాలక్రమమున అన్నీ చక్కబడుతవి.

ప్రేమా.—ఇందులో ఎవరైనా చచ్చిన పిమ్మటనా?

వీరే.—విపరీతార్థములు తీయకు. కొన్నాళ్ళు పోతే సరి. కొత్తప్పుడు గడుసుపదును గల కత్తి క్రమేణ మొత్తపడుతుంది.

ప్రేమా.—మన కిప్పుడీ చర్చ ఎందుకు? ముడిమాట చెప్పండి. అక్కడికి వెళ్ళవలెనని దానికి లేదు, మీరు దానిని బలవంతపెట్టినట్లైతే భయముచేత వెళ్ళుతుంది; కాని మరి రాదు, ప్రాణాలతో నుండదు. కనుక దాని నక్కడికి పంపడము నా కిష్టము లేదు. ఆ బాధ భరించడ మతికష్టము.

వీరే— నీ మూర్ఖపుపట్టు సాగనేరదు, దానిని పంపక తీరదు.

ప్రేమా— మేము మీమాట కెన్నడెదు రాడలేదు కనుక ఈ విషయమున మామాట చెల్లించండి, ఇదే వేడుతూన్నాను.

వీరే—మీరు చిన్నవాళ్లు, సాధకబాధకము లెరుగరు, అందుచేత మీమాట చెల్లనివ్వను; పట్టుపట్టకండి.

ప్రేమా— మేము చచ్చినా సరేకాని మీమాట నిలుపుకొంటారా? ముందువెన్క లాలోచించ నక్కరలేదా?

వీరే—నలుసంత లేరు, నాకు బుద్ధి చెప్పుతారా మీరు?

ప్రేమా—ఔను, తెలియనప్పుడు చెప్పవలసినదే.

వీరే—అబ్బా! ఇంత దుస్సర్వజ్ఞత్వమా? నక్కపుట్టి నాలుగాదివారాలు కాలేదు ఇంత గాలివాన నెరుగనన్నదట. లోకానుభవము లేని పసివాళ్ళు మీమాట చెల్లవలెనా? ఏమి పొగరు!

ప్రేమా—కాయక్లేశము విషయమున పెద్దలకంటే పసివాళ్లే ఓర్చుకోగలరు... ..దాని కేమి? భద్ర నత్తవారింటికి పంపడము నాకు సమ్మతముకాదు; అ దొప్పుకోదు. మాకు నచ్చనిపని చేయవలెనని మీ రెందుకు పట్టుపట్టుతారు?

వీరే.—నీకు కూతురు పుట్టితే దాని నత్తవారింటికి పంపకు-భద్రప్పైని నీకేమి అధికార ముంది?

ప్రేమా.—అది నా తోఁబుట్టువు. దాని ప్రాణాలు పోయే టప్పుడు నే నూరకుంటానా? సకలవిధములా దానిని సుఖపెట్టి తీరుతాను; ఇది నా విధి. సోదరప్రేమ సకల జంతువులకూ సహజము కాదా?

వీరే.—తలిదండ్రులను, పెద్దవాళ్ళను, మామాట వినరా?

ప్రేమా.—మీరు చేసేపని మా జీవములు నిల్పుతేనా?

వీరే.—మిమ్ము కని పెంచి పెద్దచేసినాము కదా, మేమే చంపుకొంటామా? కన్నబిడ్డలచంపుకొనే కఠినాత్ము లున్నారా?

ప్రేమా.—మేము పడే బాధ మీరు సరకుచేయకుంటే మీమాట ప్రకారము పులిగుహాలో దూరుతామా? అంత పితృభక్తి కృతయుగములో నుండేదేమో కాని, కలికాలములో లభించదు. రానురాను జీవులకు ప్రాణములయందాశ ప్రబలమైనది. తండ్రిమాట చొప్పున తల్లిని చంపే పుత్రు డిప్పు డుండడు. అట్టిప్రేమ పురాణగ్రంథములయందే కాని ఇప్పటి జనులలో కానరాదు, కాలము మారింది.

వీరే.—ముందూ వెనుకా చూచి మాటలాడు.

ప్రేమా.—అంతటా ఆలోచించే మాటలాడుతూ న్నాను.

వీరే.__నామాట వినవా ?

ప్రేమా.__ఈ విషయమున నేను వినను, దానిని విననివ్వను- మేమెంతో దూర మాలోచించి చేసుకొన్న నిర్ధారణది.

వీరే.__అలాగైతే దానిని నాయింట నుండనివ్వను.

ప్రేమా.__అది లేకుంటే నేనూ ఉండను- బ్రతికితే ఇద్దరమూ బ్రతుకుతాము, లేకుంటే ఇద్దరమూ చస్తాము.

వీరే.__మీరిద్దరూ కలిసి పన్నిన కుట్రా యిది ?

ప్రేమా.__ఇందు తప్పేమి ? దానిని మీరు సుఖపడనివ్వకుంటే దాని యోగక్షేమముల బాధ్యత నేను వహించవద్దా ?

వీరే.__మే ముండగానే ఇంటికి నీవు పెద్దవైనావా ?

ప్రేమా.__అట్లు నేననలేదు. మీ రింట నుంచనంటే దానిని పోషించే బాధ్యత నా దన్నాను.

వీరే.__బాగుబాగు, మీకు చదువు చెప్పించినందుకు మంచి లాభమే కల్గించినారు! ఎదు రాడడము, దేవతలకు పంచాంగము చెప్పడమూ నేర్చుకొని పెద్దలను గౌరవించడమే మానుకొన్నారు- పాడుచదువు వచ్చి బంగారమువంటి కుటుంబాలు పాడుచేస్తూన్నది; పసువులేను, మర్యాద లేదు... పిల్లలు పుట్టకుంటే ఒకటే మొర, పుట్టి యీలాగు భ్రష్టులైతే యమయాతన- పిల్లలు పెద్దవాళ్ళయ్యేసరికి పెద్దలు జీవించియుంటే ఇదే ప్రమాదము.

ప్రేమా—మీ అభిప్రాయమునకు తగిన సబబు చెప్పలేక మాకు పితృవాత్సల్యము లేదని అంటున్నారా? మీ కిదే బలమైన వాదము. సంతానమునకు పితరులయెడ వాత్సల్యము లేదంటే ఎవరైనా నమ్ముతా రనే మొండిధైర్యముచేత అతిసులభముగా మామీద నేరము నారోపిస్తారు. తల్లిదండ్రులు సంతానమునెడ ఎంత క్రూరముగా ప్రవర్తించినా వారి శిశువాత్సల్యమున లోప మున్నదని ఎవ్వ రనుకోరు. ఒక్కమాటకు జబాబు చెప్పండి. భద్ర నత్తింటికి పంపించడము దానిని చావచంపుటకా లేక దానికి సౌఖ్యము కూర్చడమునకా? నా కళ్ళతో దానిబాధ చూసినానని చెప్పితే మీకు చీమకుట్టినట్లైనా లేదే? ఏదీ మీ శిశువాత్సల్యము? దానియం దభిమాన ముండే కాబోలు ఆ రాక్షసికి దాని నప్పగించడము? మీ రేమిచేసినా మేము నోరుమూసుకొని ఒప్పుకోవలె నన్నారు. మీయాజ్ఞ మే మెప్పుడైనా ఉల్లంఘించినామా? ఇప్పుడు మేము పట్టుబట్టడానికి తగినంత హేతు వుంటుందని మీ కెందుకు తోచరాదు? మామాట లెక్కలే దన్నమాటేనా?

వీరే—నీ దుస్సర్వజ్ఞత్వ మిక చాలించు. ఇప్పుడు దానిని పంపవద్దన్నావు. రేపు దానికి పెళ్ళి చేయు మంటావు కాబోలు? ఇన్నేళ్ళు వచ్చినతరువాత ఇప్పుడు దురాచారపరుడను కావలెనేమి నీమాట విని? కులమర్యాద కూలిపోదా?

ప్రేమా—దురాచారము నేను చేయు మనలేదు,

సదాచారమునే జరుపుమన్నాను. కోపావేశముచేత మీరు పొరబడుతూన్నారు. సౌమ్యమైన బుద్ధితో నాలోచించండి, సదాచారమో దురాచారమో మీకే తెలుస్తుంది.

వీరే.—పురాతనమైన ఆచారము దురాచారమా?

ప్రేమా.—ఆచారముయొక్క మంచిచెడ్డలు కాలము ననుసరించి మారుతూండును. ఒక కాలమున సదాచారమని పించుకొని సర్వజన సమ్మతమైన ఆచారము ఇంకోకాలమున దురాచారమని దూష్యము కాలేదా? సహగమనము శిశు మారణము, నరబలి, మాంసభక్షణమున్నూ బ్రాహ్మణ వర్ణమున పూర్వము ప్రబలలేదా? అప్పుడవన్నీ సదాచార ములే; కొన్నాళ్ళకి కాలగతి మారేసరికి అవి దురాచార ములు కాలేదా? ఇప్పుడెవ్వరైనా వాటిని ప్రశంసిస్తారా, ఆచరణమున పాటిస్తారా? అవి సదాచారములుగా నున్నంత కాలము వాటి నుల్లంఘించినవాళ్ళు దురాచారవర్తనులు కాలేదా? కనుక ఆచారములకు కాలమునుబట్టి మంచి చెడ్డ అనే ప్రతీతి కలుగుతూండును. అందుచేత దురాచార మనే భయ మక్కరలేదు మన మిప్పుడు చేసే పనికి.

వీరే.—సురాపానము కూడా కొన్నాళ్ళకి సదాచార మవుతుందని దానిని కూడా మొదలుపెట్టుమంటావు కాబోలు?

ప్రేమా.—మీ యిష్టము వచ్చినట్లు మీరు వాదిస్తారు, అదే మేము చేస్తే దుస్సర్వజ్ఞత్వ మనీ తలబిరుసని

కనరుతారు. అన్ని దురాచారముల అన్ని సదాచారముల మాటా నేను చెప్పలేదు. ఒక్కొక్కదాని గురించి వేర్వేరుగా చర్చించి సుఖావహమైన రీతులనే ప్రవర్తిస్తూండవలెను. శుక్రాచార్యుడు మధుసేవ చేయలేదా? పూర్వము మధుసేవ మనవారియందుండేది; దానివల్ల ఎక్కువకీడు మూడినందుకే అది దురాచారమయింది. ఎప్పటికీ అది అట్టిదే.

వీరే—కుర్రకుంకలతో సరిగా వాదించడము నా బోటివానికి తప్పు... తుదిమాట విను- నీమాటలు నాకు నచ్చలేదు, అలాగు నేను చేయను. మూర్ఖపుపట్టు బట్టినావా ముప్పు తప్పదు, బాగా ఆలోచించుకో. భద్రయందు మాకు మాత్రము ప్రేమలేదా ?

ప్రేమా—నేను బాగా ఆలోచించినాను; నాది మూర్ఖపుపట్టు కాదు గనుక విడువను, ఎంతముప్పు వచ్చినా సరే భద్ర సత్రింటికి పంపనివ్వను, దానిని వెళ్ళనివ్వను.

వీరే—వినాశకాలే విపరీతబుద్ధిః- మీనుదుట బ్రహ్మ ఏమివ్రాస్తే అది జరిగితీరుతుంది, నా లోపము లేదు; చెప్పవలసినదంతా చెప్పినాను- పైనిమీయిష్టము... (వేగమేపోవును)

(భద్ర వచ్చును)

భద్ర—అన్నయ్యా, నాన్నగారికి చాలా కోపము వచ్చింది, మాట చెల్లవలెనని పట్టేకాని మంచిచెడ్డలాలోచించలేదు; నీ వెంతచెప్పినా నీమాట లెక్కచేయకున్నారు;

పైపెచ్చు మనకి ముప్పు తప్పదని శపించినారు. నాకు చాలా భయముగా నుంది.

ప్రేమా___నా కిదంతా కొత్తకాదు, ఇందుకు సిద్ధపడే ఉన్నాను. ఇతనిచేతనైనది మనను ఇంటినుండి గెంటి వేయడమే-చంపలేరు కదా?...బైటికి పోతే మనపని మరింత సుళువుగా నెరవేరుతుంది-నీకు శుభ మతిశీఘ్రముగా చేకూరుతుంది. భయపడి నీవు మాత్రము మెత్తపడకు, కార్యము చెడుతుందిసుమా!

(సుందరుడు వచ్చును)

సుంద___మెత్తపడడము దేనికి?

ప్రేమా___మా నాన్నగారికీ నాకూ గొప్ప వాదము జరిగింది. అతనిమాట అతనూ నామాట నేనూ నిలువబెట్టుకొన్నాము. భద్ర నత్తింటికి పంపకతీరదని! ఆయనా పంప వద్దని నేనూ నిశ్చయించుకొన్నాము. అతడు మాకు ముప్పు తప్పదని శపించినాడు, దానిని మహాప్రసాదమని ప్రతిగ్రహించినాము.

సుంద___ఇంటినుండి పొమ్మన్నారా?

ప్రేమా___అందాకా రాలేదు; పైమెత్తదే.

సుంద___దానికి నీ వేమి బదులు చేయదలచినావు?

ప్రేమా___పెట్టిబేడా కట్టి ప్రయాణము కావడమే.

సుంద___శుభం భవతు- ఇక నే నిక్కడుండను. మహేంద్రునిదగ్గరకు పోతాను, అందరమూ కలిసి ఊరు దాటుదాము...(వెళ్ళును)

## నాల్గో రంగము

---

వీరేశ్వరుడు—ప్రేమ

వీరే—ఇంగ్లీషుచదువు వద్దని నెత్తీ నోరూ కొట్టు కొంటే మానినావు కావు, ఇప్పుడు పీక కురి పోసినాడు. పెద్ద కాలము వచ్చింది, ఇద్దరే పిల్లలు, వాళ్ళని వదలి ఉండలేము, ఇంట్లో నుంచుకోలేము. కూనని పెంచితే గండయింది, తాను చెడడము కాకుండా దానిని కూడా పాడుచేసినాడు. అత్తింటికి వెళ్ళనని అది అఘోరిస్తూాన్నది. నిజముగా నా మన సులో పంపవలెనని లేదు, ఏమంటే దాని అత్తగారు రంపె లాడి; అన్నివిధములా దానిని కాలితో రాసి బొట్టు పెట్టు కొంటుంది. ఆబాధ పడలేక అ దెందులోనో పడి చస్తా నంటూాన్నది; పాడు లోకానికి వెరచి పంపడాని కొప్పు కొన్నాను, వా డది కానీయడు. దాని కేమి ఆశ పెట్టినాడో కాని వాడిమాట అది తప్పకుండా వింటూాంది, మన యిద్దరిని తోసిరాజన్నారు. ఇటువంటివాళ్ళని యింట్లో నుంచుకో లేము, పైకి గెంటలేము. ప్రాణాంతముగా నుంది.

ప్రేమ—ఇప్పు డేమి చూచినారు? రేపు వాళ్ళొచ్చిన తరువాత నుంది- వాళ్ళీమాట వింటే మనకు ఎంత అగా రవము! మనవాళ్ళ కొండిధైర్య మేమో నాకు తెలియదు... ఎప్పుడూ గట్టిగా మాటలాడడమే ఎరుగనివాడు ఎన్ని సభ

బులు నేర్చినాడు! ఎంత పట్టు పట్టినాడు! భద్ర వాడితో ఏమి చెప్పిందో? వీళ్లేమిదురంతము చేయదలచినారో?

వీరే__నా కొకదానికి సంతోషము- వాడి వాదము కాదనలేము. ఇప్పు డీ సంఘసంస్కారము దావాగ్నిలాగు దేశమం గంతటా పెరిగింది. ఆర్యసామాజికులు ఎన్నో పున ర్వివాహములు చేసినారు, అవి వృద్ధికి వస్తూన్నవి. అవే వాళ్ళకి ధైర్యము కలిగించినవి.

ప్రేమ__కొంపతీసి మనవాడు భద్రికి రెండోపెళ్ళి చేస్తా నంటాడా ఏమి ?

వీరే__అదే వాడి ఉద్దేశము. ఆమాట నిష్కర్షగా చెప్పలేదు కాని కాస్త సూచించినాడు.

ప్రేమ__అయ్యో, ఒక్క కూతురూ ఇంట్లో నుండ కపోవడమే కాకుండా తిరిగీ పెళ్ళి చేసుకొంటుందా ? ఎంత ప్రమాదము! అయ్యయ్యో! చూపులైనా ఉండవు కాబోలు ? ఏమి దారి ?

వీరే__నిక రానికి చూస్తే ఇదొక విధముగా మంచిదే. తలచెడ్డ కూతురు గుండెమీద కుంపటి. ఉప్పూ పులుసూ తినేదాని కే వేళ కే బుద్ధి పుట్టుతుందో ఎవరము చెప్పగలము? అందుచేత కంటికి రెప్పలాగు దానిని కాచుకు తిరిగేసరికి మన తాడు తెగుతుంది- ఇప్పు డాపూచీ ఎవరికీ ఉండదు- రెం డోది భద్ర నింట్లో శాశ్వతముగా నుంచుకోలేము. ఒక వేళ ఉంచుకొన్నా దానికి సుఖము చేకూర్చలేము. ఇప్పుడో వీడు

దాని నే అయ్యచేతిలోనో పెట్టి తీసుతాను. ఆ పైని దాని అదృష్ట మేలాగుంటే అలాగు జరుగుతుంది.

ప్రేమ—ఇంటిలోనుండి గెంటివేస్తే వాళ్ళ కెవరు దిక్కు ?

వీరే—వాళ్ళకేమే ? కావలసినంత సొమ్ము నే నిస్తాను, ధైర్యమూ మరిమి సహాయమూ వాళ్ళ కుండనే ఉంది.

ప్రేమ—అయితే పెళ్లిచేసి మీరే పంపివేయకూడదా?

వీరే—కాదుకాదు- ఇది పూర్వాచారవిరుద్ధము, మన పరువుపోతుంది; మనము బ్రతికున్నంతకాల మిది కానీయ కూడదు, తరువాత వాళ్ళ యిష్టము. సనాతనధర్మము మనము అతిక్రమించరాదు.

(ప్రేమానందుడు వచ్చును)

ఏ మాలోచించినావు ? నీపట్టు వదలవా ?

ప్రేమా—వదిలేటట్టైతే పట్టే పట్టియుండను.

వీరే—ఇంటిలోనుండే అదృష్టము మీకులేదా ?

ప్రేమా—మీ రుంచుతే తప్పకుండా ఉంటాము.

వీరే—ఓరీ మూర్ఖా ! నీకు నా మాటన్న లక్ష్యము లేనప్పుడు నాయింట్లో నిన్నె ట్లుంచుకొమ్మన్నావు?

ప్రేమా—మాకు పోవలెనని లేదు, మీరు పొమ్మంటే పోకతీరదు.

వీరే—దానికి పెళ్ళిచేసే తలంపుందా ఏమి?

ప్రేమా—లేకుంటే ఇంతవరకూ రానే రాదు.

వీరే—ఓరీ మేము చేసినపెళ్ళి ఏలాగు పరిణమించిందో చూచినావు- భద్ర దరిద్రముగొట్టు, లేకుంటే మూడేళ్ళమగడు ముక్కలయిపోతాడా?...ఇంకోపెళ్ళి అయితే మాత్రము అది బాగుపడి ఏముస్తుందా? దాని కర్మఫల మది. ఎందుకు నీ కీ శ్రమ?

ప్రేమా—ఇదేనా మీ శిశువాత్సల్యము? అడే నా విషయ మనుకోండి. ఒకభార్య పోతే రెండోదాని నప్పుడే చేయరా? అదీ నాదౌర్భాగ్యమే అని ఊరకుంటారా?

వీరే—మగవాళ్ళ నాడవాళ్ళతో సమము చేస్తావా?

ప్రేమా—ఇద్దరినీ భగవంతుడే సృజించి కొంత భేదము కల్పించినమాట వాస్తవము- దానిపై మానవుడు మరింత హెచ్చుచేసి ఆడవాళ్ళకి జాస్తిగా అన్యాయము చేసి నాడు. దానిని తొలగించేవన్నీ సదాచారములే.

వీరే—అబ్బో! సనాతనధర్మానికే ఎసరు పెట్టదలచి నావా? పితంతువుకు వివాహము చేసేవాళ్ళు ఏడుతరాలు దాకా నరకకూపములో పడతారని శాస్త్రము ఘోషిస్తూ న్నదిరా శుంఠా!

ప్రేమా—అదే తీరుగా సహగమనము చేయుమనీ చెప్పుతూన్నవి- అలా గేల చేయకూడదు?...ఆడదాని మాట విడిచి మగవానిమాట ఆలోచించండి. విధురు డెన్ని పెళ్ళిళ్లైనా చేసుకోవచ్చునేమి?

వీరే—మగవాడు స్వతంత్రుడు, పెళ్ళిచేసుకోకుంటే కర్మాధికార ముండదు. ఆడదానికా చిక్కు లేదు. పెనిమిటే దానికి దైవము, పాతివ్రత్యము కాక వేరే ధర్మమే లేదు దానికి; అందుచేత రెండోపెళ్ళిమాట తలపనే కూడదు.

ప్రేమా—ఇదే పురుషుల దౌరాత్మ్యము! వారు చేసిన పనులన్నీ పక్షపాతపూరితములు, స్వార్థపరములు. తమశక్తి యావత్తు చూపేలాగు ఆడదానినడుగుకి తొక్కివేసినారు. పాపము! అన్నివిషయములా వారి కబలత్వము సిద్ధించినది కాబట్టి పురుషుల పక్షపాతము మన సంఘానికి పక్షవాతము తెచ్చిపెట్టినది. దేశ మధోగతిని పడియున్నది. పురుషులూ స్త్రీలున్నూ సరిగా నభివృద్ధి చెందకుంటే దేశమున కౌన్నత్యము సిద్ధించదు. ఇదంతా ఆడవాళ్ళ ఉసురు పోసుకొనడముచేతనే.

వీరే—బాగుంది-(భార్యతో) చూచినావా మనవాడి బుద్ధి? మన పూర్వులంతా మూర్ఖులనిన్నీ వీడే సర్వజ్ఞుడనీ తూలిపడుతూన్నాడు. వీడీలోకములోని లోపములన్నీ దిద్ది చక్కపరుస్తాడట! అందు మొదటిమెట్టు భద్రాపునర్వివాహము!

ప్రేమ—అయ్యో! అయ్యో! ఏమి వీడి తెలివి తక్కువ!

ప్రేమా—నాన్నగారూ! పునర్వివాహము యోగ్యమని మీ రొప్పుకోరా? అదావశ్యకమని యెరిగీ మీకుమా

ర్తికే పెళ్ళిచేయుడమునకు మీకు సాహసము లేదు-బంధువులతో కలహము పుట్టుననీ మిత్రులు ఎకసక్కెము లాడుతారనీ మీకు భయము. నాకో, అనుభవము తక్కువౌట చేత పైనిచెప్పిన అడ్డంకులు లేవు. చిన్నవాళ్ళకు సాహసమెక్కువని మీరు చాలాసారు లనలేదా? తీరా కార్యారంభమయ్యేసరికి జంకుతూన్నారు.

ప్రేమ—కులములోనుంచి వెలివేస్తారురా! ఏమి గతి?

ప్రేమా—వెలివల్ల నష్టమేమి? గౌరవము తగ్గదు, ధనము పోదు...మనయింటికి బంధువులు భోజనాలకి రారు, పోనీ, అది మనకే మంచిది.

ప్రేమ—నీకు పెళ్ళి కావడ మేలాగు?

వీరే—ఏ మాలజాతిదానినో మెడకు కట్టుకొంటాడు. మనకు తిలోదకా లివ్వనక్కరలేదు- కొంత బరువు తగ్గుతుంది, తద్దినా లుండవు, సరీ మేలే.

ప్రేమా—అమ్మా, ఇప్పుడు వెలికి జడియనక్కరలేదు, వెలిబడ్డవారు చాలా కుటుంబములవా రున్నారు; ధనవంతులు, విద్యావంతులు, కీర్తిమంతులూకూడా కలరు-కర్మలు చేస్తున్నారు. ఎందుకున్నా వాళ్ళకి లోపము లేదు... ఇక మీ కుత్తరగతుల కేమీ లోపము రానీయను- యథా శాస్త్రీయముగా అన్నీ జరుపుతాను- మీ కాభయము వద్దు.

ప్రేమ—అయ్యో! ఏమి పాపమురా? ఇంటా వంటా లేని ఆచారము తెచ్చిపెట్టి కులము చెడగొట్టుతావా?

ప్రేమా—అమ్మా, మీ కంత జంకుగానుంటే మే మీయిల్లు విడిచి మరియొకదగ్గర నుంటాము. అంతేకాని భద్రను యావజ్జీవదుఃఖముపాలు చేసి చూడలేను.

(ముకుంద శాస్త్రి కావేరమ్మా వత్తురు)

వీరే—ఓహో! భావగారు రండి! అంతా క్షేమమా? మీ శరీరములో ఖులాసాగ నుందా?

ప్రేమ—రండి వదినా! బాగున్నారా?

ముకు—మీ ఆశీర్వచనమువల్ల అంతా నిమ్మళముగా నున్నాము. మీకు క్షేమమా?

వీరే—చిత్తము.

కావే—భద్ర క్షేమంగా నున్నదా? కానరాదేమి?

ప్రేమ—ఇప్పుడే లోపలికి వెళ్ళింది.

కావే—దానిని విడిచి ఉండడానికి మన సొప్పలేదు. అన్నము వంట పట్టలేదు. నిద్ర కంటికి రాలేదు.

ముకు—మీ పిల్లవాడు కోపగించి ఒక ఫూలైనా మాయింట నుండక చెల్లెలిని తీసుకొని వచ్చినాడని యిరుగు పొరుగువాళ్ళు మమ్ము దెప్పుతూన్నారు.

కావే—ఒదినా, సంసార మన్నప్పుడు ఏవో మాట లనుకొంటాము, కొంచెము పెద్దదాననౌటచేత చిరాకు పడు తాను. ఆపాటిదానికి మాయింట నీరైనా పుచ్చుకోకుండా బయలుదేరి వచ్చినాడు! ఇరుగమ్మా పొరుగమ్మా నా దవ

డలు నొక్కి నానామాట లంటున్నారు, తల యెత్తుకొని తిరుగలేకున్నాను. పెద్దదాన ననేనా ఆలోచించినాడు కాదు.

ముకు—కుర్రవాడు, లోకానుభవముతక్కువ, పడుచు కనపు పెంకెతనమే కాని ముందూవెన్కా ఆలోచన లేదు.

ప్రేమా—లోపము నాదా? నోటికివచ్చిన ట్లెల్ల మమ్మల్ని తిట్టి మా చెల్లిని చావమోది పైపెచ్చు నేను పెంకె వాడ నంటున్నారా? మీకన్న గడుసువాడనా? ఎందుకమ్మా వచ్చినంత కోపమూ చూపుతావా అంటే ఇప్పుడే దానిని తీసుకొనిపోయి ఇంకో మగని కూర్చుమని అన్నది. మా చెల్లి పూలరాణి అట-నిజమే మేముదానిని పువ్వులలో పెట్టి పెంచు కున్నాము. ఇట్టి సుకుమారి గట్టి పనులు చేయలేదు, కర్ర దెబ్బలు తినలేదు; మనసున నాటే దుర్భాషలు పడలేదు— ఇది కాబట్టి మీ యింట సకలబాధలూ సహించి యున్నది కాని ఇంకొకర్తె అయితే యింటికి పట్టపగలు చిచ్చుపెట్టి పారి పోవును. పుట్టింటివారికీ అత్తింటివారికీ అమర్యాద వస్తుందని అంత దుఃఖమూ అనుచుకొన్నకొద్దీ నిర్భర మయిపోతే ఏమి చేయగలదు? అంత క్రౌర్యమా?

ముకు—నాయనా చిరజీవీ, మీ అత్త కొంచెము నోటివడి చేతివడి గలదే, నేను చీటికీ మాటికీ మందలిస్తూనే ఉంటాను; ఇకముందు మా కోడలిని చిన్న మెత్తుమాట ఆడ నీయను, కాని ఒంటిమీద చెయ్యి వేయనీయను, నేను పూచీ పడుతాను దీనికి, నామాట విని ఈ సారి పంపి చూడండి.

వీరే.—భావగారూ! అది మాపిల్ల కాదు, మీపిల్ల; దానిని సుఖపెట్టినా దుఃఖపెట్టినా మీయింట నది ఉండక తీరదు, మీ యిష్టము వచ్చినప్పుడు తీసుకొని వెళ్లవచ్చును. కన్నవాళ్లము గనుక అది కష్టపడుతూంటే చూడలేము. మీరూ పిల్లలను కనుక్కొన్నవారే. దానితల్లిదండ్రులు మీరే ఎల్లుండి తీసుకొని వెళ్లవచ్చును, మా ఆటంకము లేదు.

ప్రేమా.—వల్లకాదు-అది క్షణమైనా వారింట నుండడము నాకిష్టము లేదు.

కావే.—నాయనా, పెద్దదానిని, నావల్ల తప్పు జరిగిందనుకో, క్షమించు-ఇకముందెప్పుడూ దానినేమీ అనను— అది మాయింట నుండకపోతే మా కాబోరు దక్కదు-నలుగుర్లో నగుబాటు.

ప్రేమా.—అది మాయింట నుంటే మీకు గౌరవము దక్కదంటూన్నారు కాని, అది మీ యింట నుంటే దాని ప్రాణమే దక్కదు. ఇంత గోలయిన తర్వాత దానిని మీరు పీల్చి పిప్పిచేయరా!

కావే.—నీవు వచ్చి చూడు దానినేలాగు సుఖపెట్టుతానో-నామాటయందు నీకు నమ్మకమప్పుడు కలుగుతుంది.

ప్రేమా.—బాగు బాగు. మా చెల్లెలితో కూడా నేనూ మీ యింటనుండనా? మీ అబ్బాయి నాకుకూడా పుస్తె కట్టినట్టేనా?

వీరే—ఓసీ, నీ నోటికి మేర లేనట్లుంది. పెద్దవాళ్లతో పరియాచకమా? నీ అంతర మేమి? ఆమె యంతర మేమి? భావగారూ, మావాడు పట్టి మతిమాలినవాడు, గమ్పుకోవలెనని మిమ్ము ప్రార్థిస్తూన్నాను. మీరు రేపొక్క రోజిక్కడుండి, ఎల్లుండి పిల్లను తీసుకొని పోవచ్చును- మేముండగా వీడి ఊసెవరికి కావలెను? ఓరీ మూర్ఖా! అది నా కూతురు, పంపడానికీ పంపకపోవడానికీ నీవెవడవు? ఆయధికారము నాది, నీవు మాటాడక పో—దానిని తప్పకుండా పంపివేస్తాను దానింటికి.

ప్రేమా—అది మీకు కూతురు, నాకు చెల్లెలు-మీరు దానిని కష్టపెట్టుతున్నారు, వద్దంటే నామాట వినకుండా ఉన్నారు. ఆమెను పెంచేభారము మీదే, నేను కాదనను, కాని నామాట విన్నానుకాను కదా అని ముందు మీరే చింతిస్తారు. నా చేతనైతే అత్తగారన్నమాట చేసి తీరుదును-ఇప్పుడు మీయిష్టమే జరుగనీ-దాని ప్రాప్తి ఎలాగుంటే ఆలాగు జరుగుతుంది.

ముకు—నాయనా, దానిని కష్టపెట్టడమువల్ల మాకేమి లాభము? కోడలు పుట్టింట ఉంటే నలుగురూ నాలుగంటారు, దానిని సహించలేము? కులగౌరవము కూలుతుంది, దాని నోర్వలేము-నీవు చిన్నవాడవు, లోకవర్తన మెరుగవు.

వీరే—వెఱ్ఱివాడితో వాదమెందుకు?—ఇదిగో విను. ఇదివరకు నన్ను మాటలాడినావు, ఇప్పుడు వీళ్ల నన్నావు-

నీమాహాత్మ్య మెచ్చుతున్నది గాని తగ్గలేదు; నాకు కోపము తెప్పించకు, దానివల్ల నీకు ముప్పు రాగలదు జాగ్రత్త.

ప్రేమా—అయ్యా! నేను మూఢుడను కాను, నాతో బుట్టువు కష్టపడుతూంటే చూచి ఓర్వలేను. మీతో కడ సారి చెప్పుతూన్నాను-భర్త నత్తింటికి పంపవద్దు, దానివల్ల కీడు మూడడము నిశ్చయము; దానిని మీరు భరించలేక పోతే నా కప్పగించండి, నేను దానికి సుఖము చేకూరుస్తాను.

ముకు—ఏలాగు దానిని సుఖపెట్టగలవో చెప్పు, మేమే ఆలాగు చేస్తాము-దానిని కష్టపెట్టడము మాకూ ఇష్టము లేదు.

ప్రేమా—దానికి తిరిగీ పెళ్ళిచేస్తేనే సకలసుఖములూ చేకూరుతవి- అదే తగిన పని.

కావే—(నోరు నొక్కుకొని) ఎంత దురంతము చేయ నెంచినావు! జాతిమర్యాద గంగలో కలుపుతావా? కులము వారు వెలివేయరా? మాఅబ్బాయి మా గొంతుకకోసినాడు, అది చాలక నీవుకూడా మమ్ము శాశ్వత నింద పాలు చేయ దలచినావా? ఇది న్యాయమేనా? పెద్దలమాట పెడచెవిని పెట్టి పెత్తనము పైని వేసుకొని మహాత్కార్యమే చేయదలచి నావులే-బలే!

ముకు—వెర్రి కుదిరింది, రోకలి తలకు చుట్టు మన్న ట్లుంది నీ పని-మాయింట నుంటే మీచెల్లెలికి సుఖము లేదని రెండో పెళ్ళి చేసి మీకూ మాకూ కులాని కంతటికీ అప

ఖ్యాతి తెచ్చిపెట్టుతావా? బాగుంది నీబుద్ధి, ఇంగ్లీషు చదువు కొన్నందుకు మంచి ఊహలే పుట్టుతూన్నవి! బాగు బాగు!

వీరే—పాజీ! చూచినావా అందరూ నోట్లో గడ్డి ఏలాగు పెట్టుతూన్నారో? చదువుకొన్న కొద్దీ నీకు మతి పోతూన్నది. మా కెంత అపకీర్తి తెచ్చిపెట్టినావో తెలుసునా? చిన్నలూ పెద్దలూ మా మొగాలమీఁద ఉమ్ముతూన్నారు. మా పాప మంతా పండి నీ వెందుకు మా కడుపున పుట్టినావు? పాలసముద్రములో హాలాహలము లాగు మా గర్భవాసమున పుట్టి తరతరాలకీ తఱుగని అపఖ్యాతి తెచ్చి పెట్టుతున్నావు.

ప్రేమ—నాయనా! ఎన్నో దేవుళ్ళకి మొక్కి నిన్ను కన్నాను. ఎప్పుడు పెద్దవాడవై మమ్ముద్ధరిస్తావో అని ఉవ్విళ్లూరుతూంటే ఈ పెడబుద్ధి నీ కెందుకు పుట్టించెరా? ఇదా నీవు మమ్ము సుఖ పెట్టే మార్గము? మీ నాన్నగారికి కోపము తెప్పించకు- మేము బ్రతికియున్నంత కాల మీ దురాచారము తలపెట్టకు, మా పెత్తనము నిలువబెట్టు; మాకు మనోవ్యాధి కలిగించకు-కొంతకాల మోపికపట్టు, మా అనంతరము నీ చిత్తమువచ్చిన రీతిని జరుపుకో వచ్చును. మమ్ము నలుగురి నోళ్లలో పడవేయకు.

ప్రేమా—అమ్మా! లోకులు కాకులు, సబబూ సందర్భమూ లేకుండా మాట లాడుతారు, వాళ్ల నోళ్లకు భయపడి బంగారుబొమ్మవంటి కూతురిని పాడుచేసు కొంటారా?

మేక నమ్మవారికి బలివేసినట్లు దాని నీ దురాచారమునకు బలివేస్తారా? ఏమైనా సరే-అది అత్తింటికి వెళ్ళడము నా కళ్ళతో చూడలేను-దానిని సుఖపెట్టడమునకు కన్నారా, లేక చంపడానికి కన్నారా? నా మాటవిని పంపకండి. వినకుంటే బ్రతికున్నన్నాళ్లూ దానికోసము దుఃఖిస్తారు.

పేరిమ— నా కేమి దారి? ఎందులోనో పడి చావవలెను. వీరు మాట వినరు, ఆయనకి కోపము తగ్గదు-హా! పరమేశ్వరా! ఏమి చేయదలచినావు?

వీరే—ఓరీ, పెద్దమ్మా—ఎవరిమాటా వినకుండా నీ మాటే నిలువబెట్టుకోవలెనని ఎంతపట్టు పట్టినావు? నామాట విన్నావా సరే, లేకుంటే నా యింటినుండి గెంటివేస్తాను-చిప్పా దొప్పా పట్టుకొని ఇంటింటా బిచ్చ మెత్తుకోవలసి వస్తుంది-గుడ్డు తల్లిని వెక్కిరించె నన్నట్లు నీ పెడసరపు మాటలు పొగరుబోతుపనులూ నా దగ్గిర సాగవు-నీదారి నీవు చూచుకోవలసి వస్తుంది జాగ్రత్త!

ప్రేమా—మీయిష్టమువచ్చినట్లు మీరు చేయవచ్చును, నాపట్టు నేను విడువను; చిప్పా దొప్పా నానుదుట వ్రాసియుంటే తప్పించ నెవరితరము? భాగ్యము పోతుందని భయపడి న్యాయము విడువను....ఇంకోసారి చెప్తూన్నాను-నామాట వినకుంటే తరువాత అందరమూ పరితపించవలసిఉంటుంది-

ఏరే—ఛీ! దౌర్భాగ్యుడా! నోరు మూసుకో-భావగారూ, లోపలికి పోదాము-ఏడీలాగ మొరుగుతూండనీ, పిల్ల నెల్లుండి తీసుకొని పోండి-అంతతో వీనికి ప్రాయశ్చిత్తమవుతుంది-　　(పోవుదురు)

ప్రేమా—నే ననుకొన్నంతా అయింది-శ్రేయాంసి బహువిఘ్నాని అన్నవాడు తెలివితక్కువవాడా?...ఇదివరకు దాటదలచినదే మహాసముద్రము, నాసిప్పై నింకొకటి దాపురించింది-ఈ దంపతులు వచ్చి నాత్రోవలో పెద్దబండ వేసినారు-ఎల్లుండి వీరి ప్రయాణ మట...మధ్య నొక్క రోజున్నది-జరుగవలసిన తంతు చాలా ఉంది......ఏమి సాధనము? .....ఆఁ. ఒక్కటే దారి-సుందరుడే యిప్పుడు దిక్కు...వానితో నాలోచించి కార్యము సాధించవలెను... ఆలోచన చెప్పడాని కెవరూ లేరు, నేడే కార్యసిద్ధి కావలెను-భద్రతో రెండుమాటలాడి పైకి దాటుతాను-తరువాత దైవమున్నాడు...భద్రా, భద్రా, ఇటు రా. (వచ్చును) అమ్మా నాన్నగారు ఏమిచేస్తున్నారు?

భద్ర—మా అత్తగారితో మాటలాడుతూన్నారు-

ప్రేమా—విన్నావా మావాదము?

భద్ర—అన్నయ్యా, నాకోసము నీవు పాడవుతూన్నావు, నీకెందుకీ ప్రయాసము? నా కర్మానికి నన్ను వదలి నీదారి నీవు చూసుకో-నునవాళ్ళతో దెబ్బలాడి ఆస్తి పోగొట్టుకోకు-నేను కొమ్ముకొట్టే గేదెను, నన్ను చేరనిస్తే నా

దౌర్భాగ్యదేవత నిన్ను కూడా ఆవహిస్తుంది-నీ పట్టు విడిచి పెట్టు; నాగతి ఏమైనా కానీ, ఆయు వున్నన్నాళ్ళు అనుభవిస్తాను, భరించలేకపోతే ప్రాణము వదలిపెట్టుతాను.

ప్రేమా—నాకంఠములో ఊపిరున్నంతకాలము నిన్ను విడువను......ఇదిగో విను-చిన్నవాళ్ళమైనా గొప్ప కార్యభారము మనమీదపడింది; సలహా యిచ్చేవారు లేరు, తప్పు త్రోవ త్రొక్కినట్లయితే మరి దిద్దుకోలేము-కొంత వ్యవధి ఉంటుందని అనుకొన్నాను కాని ఒక్క రోజులో అన్నీ ముగించవలెను-అతి జాగ్రత్తగా నాలోచించు......ఎల్లుండి తప్పకుండా నిన్ను పంపించి తీరుతారు, నామాట లక్ష్యపెట్టి నారుకారు; నేను నాపట్టు వదలను. నీకు బాగుపడవలెననే ఉద్దేశ ముంటే నేను చెప్పినట్లు చేయవలెను; ఒకవేళ నీకు యిష్టము లేకపోయినా కార్యసాధనముకొరకు నామాట వినక తీరదు-నేనైనా నీకు బొత్తిగా యిష్టములేని పని చెయ్యను-గండకత్తెర మెడపై పడుతూంటే ఏమి చేయగలము? ఆలోచించేటందుకు వ్యవధి లేదు-

భద్ర—త్వరగా చెప్పు, నీమాట కాదనను, అగ్నిలో నీవు పడుమన్నా సిద్ధమే; నాకది లాభమా నష్టమా అనే చర్చ అనవసరము-

ప్రేమా—మనమిద్దరమూ యింటిలోనుండి దాటిపోవలెను, తగిన సమయము నీవే చూసుకో-నీపెట్టె తేగల్గితే సరే, లేకున్నా ఇబ్బంది లేదు-పెద్దకోవెలలో నొక సన్యాసి

ఉన్నాడు, అతనిదగ్గర చేరుకో, ఇంతలో నేను సుందరమును తీసుకొని వస్తాను-ఆ సన్యాసి ఆర్యసామాజికుడు, లోకోపకారి, అనుభవశాలి; మనవృత్తాంత మంతా అతనితో చెప్పి అతని సలహా చొప్పున నడచుకొందాము-అతనిమాట నద్దు చెప్ప వద్దు-మన శ్రేయస్సుకోరి అతడు బోధనచేయును. కాని ఇందాతనికి వచ్చేదీ లేదు పోయేదీ లేదు-నే నిప్పుడే అతని దర్శనానికి వెళ్ళి కార్యక్రమము నిర్ణయించుకొని వస్తాను-నీవు సిద్ధముగా నుండు- (వెళ్ళును)

# పునర్వివాహము

## మూడో అంకము

---

ఒకటో రంగము......రహస్యమైన తావు.

సుం—ఏ మయినది తరువాత?

ప్రేమా—మన మనుకొన్నదే, మనవాళ్ళు భద్ర నత్తవారింటికి పంపక మాన మంటే, నేను పంపించ నివ్వనని గట్టిగా పట్టు బట్టినాను; మా నాన్నగారు చర్చ కొంతవరకూ చేసి ఆపైని నావాదము తప్పనలేక వెంటనే దుర్భాషా వర్షము నామీద కురిపించినారు; దానిని నేను లెక్క చేయ లేదు, నాపట్టు విడువలేదు...ఇంతలో మాఅమ్మ వచ్చి కొంత ఏడ్చి తండ్రిగారిని మందలించ యత్నించింది, ఆ ఏడుపు మొరలు కార్యసాధనకు పనికివచ్చు ననుకొంటూ ఉండగా అకస్మాత్తుగా గొప్ప అంతరాయము కలిగింది.

సుంద—ఏమి టది?

ప్రేమా—మాచెల్లి అత్తమామలు వచ్చినారు; వాళ్ళని చూడగానే మానాన్నగారు తనగౌరవము నిలువబెట్టుకో

వలెనని ముసుపటికన్న బిర్రబిగిసినారు-కావేరమ్మగారు తనది తప్పని ఒప్పుకొని క్షమాపణ వేడి ఇక ముందు మాచెల్లిని పల్లెత్తుమాట అన నని నీళ్ళ ఒంటిమీద దెబ్బ వెయ్యనని వేడుకొన్నది-

సుంద___ఆమాటలు మీవాళ్ళు నమ్మినారా?

ప్రేమా___సంశయ మేమి? అందుకే ఆమె వేసిం దా వేషము. అంతతో మాచెల్లి సుఖపడుతుందని ఆశించి మా వాళ్ళు ఎల్లుండి పంపడానికి నిశ్చయించినారు-

సుంద___అన్నా! ధూమకేతువుల లాగు వీళ్ళెందుకు వచ్చినారు?

ప్రేమా___మాచెల్లిని తీసుకోపోదామని-వాళ్ళు రావడము మనకి గొప్ప ఆటంక మయింది.

సుంద___ముందుమాట ఏమాలోచించినావు?

ప్రేమా___ఇందు మానాన్నగారి కోపము నాకు కొంత సహాయము చేసింది-ఆయనమాట వినకుంటే అతని కంట నన్ను పడవద్దన్నారు-ఇకెక్కడికి వెళ్ళినా అడిగేవారు లేరు నన్ను

సుంద___భద్ర మాట?

ప్రేమా___నిన్నడుగవలెనని వచ్చినాను-

సుంద___ముం దామెను కూడా యింటినుండి దా టించే సూత్రము చూడు.

ప్రేమా—అది నిశ్చయమే, కాని ఎక్కడ నుంచడము? ఎన్నాళ్ళుంచడము ?

సుంద—మాఊరు పోదామా? మాయింట మీకిష్టము వచ్చినన్నాళ్ళుండవచ్చును.

ప్రేమా—ఏమి లాభము? రేపే పోలీసువారు నన్ను తరుముకొని వస్తారు-పైపెచ్చు నీకుకూడా మాట రావచ్చును-

సుంద—ఏమి వచ్చినా రానీ, నేను దానిని లెక్క చేయను.

ప్రేమా—నాకుకూడా మంచిది కాదు-మన మిద్దరమూ కలిసి దానిని ప్రోత్సాహపరిచినా మని వదంతి పుడుతుంది-మరి పెళ్ళి కానీయదు.

సుంద—ఆమె మేలుకేకదా మనము పాటుపడేది-

ప్రేమా—ఎన్నాళ్ళిలా గజ్ఞాతవాసము?

సుంద—పెళ్ళిచేసినదాకా ఇలా నుండక తప్పదు.

ప్రేమా—దానికేమి! ఎన్నాళ్ళు పట్టుతుందో?

సుంద—ఇక్కడనుంచి వెళ్ళిన దగ్గరనుండి వరాన్వేషణము మొదలుపెట్టుదాము.

ప్రేమా—అదేమి సామాన్యపు పని అనుకున్నావా? తగినవాడు లభించడము చాలాకష్టము-ఒకటుంటే ఇంకొకటుండదు-కన్యలకే వరులు కరవైనారు.

సుంద—ఆర్యసామాజికుల నడుగుదామా?

ప్రేమా—సరిసరి, మనపని సాగినట్లే-వాళ్ళ నాశ్ర

యించుకొని చాలామంది బూటకపు సంఘసంస్కర్త లుం టారు; వారికి చదువుండదు, ఆస్తి ఉండదు, కేవలము ఉత్సాహమే. ఆసామాజికులు వారి నిజస్థితి దాచిపెట్టి మసి పూసి మారేడుకాయ చేసి ఎవడినో ఒకడిని కొండమీద కూర్చోపెట్టి అంతవాడు మరి లభించడని చాటుతారు-తీరా చూస్తే వాడి జన్మమంతా నిప్పచ్చరమే-

సుంద___ఆలాగైతే మనమే వెతుకుదాము-

ప్రేమా___వెర్రివాడా, అందుకు వ్యవధి యేది? మనము కంటపడగానే పోలీసువారి సహాయముచేత భద్రను మన నుండి ఎడబాపుతారు-అంతతో దానికి తగిన కట్టుదిట్టము లేర్పరిచి మనకు మరి చిక్కనివ్వరు-అప్పుడు మనప్రయత్న మంతా వృథా అయితీరుతుంది-

సుంద___ఇప్పుడేమి ఆలోచన?

ప్రేమా___భద్ర మనచేతులనుండి తప్పకుండా ఉండ వలెనంటే దానికి పెళ్ళి ఇప్పుడే చేసివేయవలెను-

సుంద___అది నిజమే-వరనిర్ణయము కానిదే?

ప్రేమా___దానికే దారీ తెన్నూ తోచకుండా ఉంది-

సుంద___ఈ యూరిలో ఎవరైనా ఉన్నారా?

ప్రేమా___నే నీవిషయమై కృషి చేయనిదే? ఏమి చెప్పగలను? ఎవడెట్టివాడో నాకు తెలియదు.

సుంద___అన్నా! గట్టి చిక్కే. వ్యవధి కూడా లేదు- ఏమి సాధనము?

ప్రేమా॰—నీవు నాకు ఒక్క సాయము చేస్తావా?

సుంద—సంశయ మెందుకు? ఏమి చేయ మన్నావో చెప్పు.

ప్రేమా॰—(ఊరక చూచును)

సుంద—ఏ మూరకు న్నావు!

ప్రేమా॰—చెప్పినపని నీకు సాధ్య మవునా కాదా అని ఆలోచిస్తూన్నాను-

సుంద—యత్నము చేసి విడిచి పెట్టుదాము, మన శక్తికి మీరితే ఏమి చేయగలము? నేరము మనది కాదు.

ప్రేమా॰—మనోదార్ఢ్య ముండవలెను కాని అసాధ్య మన్న దుండనే ఉండదు.

సుంద—అయితే చేసి తీరుతాను-

ప్రేమా॰—నీతో ఒకమాట చెప్పలేదు-నాపట్టు వీడకుంటే నన్నింటినుండి గెంటి వేయుడమే కాక తన ఆస్తిలో చిల్లిగవ్వైనా చెందనీయ నన్నారు మా తండ్రిగారు-

సుంద—అన్నా! ఎంతపట్టు బట్టినాడు! ఇదేనా ఆతని శిశువాత్సల్యము?...గొప్ప విపత్తు ప్రాప్తించినదే.

ప్రేమా॰—అవును. ధర్మసాధన మూరకే సిద్ధించదు-స్వార్థత్యాగము చేస్తేనేకాని లోకసంగ్రహార్థము పనిచేయలేము-మాతండ్రిగారికి నా అభిప్రాయము రుచించదని ఎరుగుదును, అట్టియెడ తన చలము సాధించుకోవడమున కాయన నన్ను పలుకష్టముల పాలు చేస్తారని కూడా ఎరుగుదును;

ఆతని కెంత శక్తియున్నదో అంతా చూపించి తీరినాడు-ఇది నే ననుకొన్నదే-

సుంద—(కౌగిలించి) ఓయీ, నీ స్వార్థత్యాగమూ చిత్తస్థైర్యమూ నాకు వింత గొల్పుతూన్నవి-అబ్బా, మాట లెన్నైనా చెప్పవచ్చును కాని ఇంతనష్టము కలిగేపని చేయుడము సర్వజనసామాన్యము కాదు-ధీరోదాత్తులు చేయ దగిన కార్యక్రమమును నీవు సాధించగలిగినావు-భగవంతుడు నీకు పూర్ణాయు రారోగ్య ధన సంపదలు కూర్చుగాక! మా బోటివాళ్ళకు నీవు మార్గదర్శకుడ వయినావు. నిన్నాదర్శ ముగా పెట్టుకొని మా నడవడి మేము దిద్దుకోవలయును. నీబోటి ధర్మవీరుని సహవాసము లభించడము నా సుకృతమే-

ప్రేమా—నన్నింత పెద్దచేయకు - ఉత్తమాదర్శము సాధించదలచినవాళ్ళు తమ స్వార్థము త్యజించకున్న కృత కృత్యులు కాలేరు-త్యాగ మత్యంత సుఖదాయకమని అను భవమూలమున నెరిగినవారి కది రాజమార్గ మవును. ఈ దారిని దృఢముగా పట్టినవారికి త్యాగవిస్తృతి ఒకలెక్క కాదు-మాతండ్రిగారి కిష్టములేని పని నేను చేయదలచినప్పుడు వారింటినుండి గెంటుతా రని, వెలి వేయిస్తారనిన్నీ నే ననుకొన్న శిక్షలే, అందుకు సిద్ధపడి యుంటిని-అంతకన్న ఆత డింకొక మెట్టెక్కినాడు, నేను మాత్రము వెనుకంజ వేయనేల? రోటిలో తలపెట్టినవాడు రోకలిపోటులకు జంకవచ్చునా? దెబ్బ

తగులు నన్నప్పుడు చిన్నదెబ్బ కావచ్చును, పెద్దదెబ్బ కావచ్చు, జంకనే కూడదు.

సుంద—ఉపదేశించడానికి నీ ధర్మసూత్రము సులభమే కాని ఆచరించడానికి కతికష్టము-లక్షాధికారి కుమారుడవు, అంతసొమ్ము పోగొట్టుకొని శుద్ధశూన్యుడవై లోకయాత్ర చేయ నిశ్చయించినావు! ఎంత గుండెదిట్టము! జీవనమం దెంత హైన్యము తెచ్చి పెట్టుకొన్నావు! ఇట్లాచరించేవారు వెయ్యిమంది కొక్క రుంటే మనదేశము ఉన్నతస్థితి కతిశీఘ్రముగా రాగలదు...మాటల సందడిని ప్రకృతమును మరచినాము. భద్రి విషయమై ఏమి చేయనెంచినావు?

ప్రేమా—నేను చేయదగినంత చేసినాను, ఇంకొక్క పని మిగిలింది; అది నావల్ల కాదు, ఇతరులు చేయదగినది-అదీ స్వార్థత్యాగముతో కూడుకొన్నదే. నేను నా సర్వస్వమూ త్యజించగలను కాని ఇంకొకరి నట్లు చేయుమనడము న్యాయము కాదు. ఒకవేళచెప్పినా, అది అందరికీ సాధ్యము కాదు.

సుంద—ఆపని నాచేత నవుతుందా?

ప్రేమా—అది నే నెట్లు చెప్పగలను? నీ చిత్తవృత్తి ఏలాగున్నదో, నీ స్థైర్య మెట్టిదో నే నే మెరుగుదును?

సుంద—నీ కా చింత వద్దు, నేనుకూడానీవు చూపిన మార్గమునే అనుసరిస్తాను, రవ్వంతైనా జంకను చెప్పు.

ప్రేమా— నీమాట నమ్మవచ్చునా? తీరా పనిచేయ వలసివచ్చినప్పుడు జంకిపోవు కదా?

సుంద— నీ కా సందేహము వద్దు.

ప్రేమా—అలాగైతే మా భద్రను నీవు పెళ్లాడ వలెను.

సుంద—(తెల్లమొగము వేయును)

ప్రేమా—ఏమూరకున్నావు? అది చేయలేవా?

సుం—చేయలేకేమి...కాని...

ప్రేమా— ఎందుకీ జంకు? నిన్ను వెలివేస్తారనా?

సుంద.—కాదు, కాదు.

ప్రేమా— మీతండ్రిగారింటినుండి గెంటుతారా?

సుంద—అదీ కాదు.

ప్రేమా— తెలిసింది- నీ వన్నట్లు ఉత్తమధర్మాచరణము ఒకరికి బోధించడానికే కాని స్వవిషయమున కక్కర రాదు—ఇది ప్రకృష్టసాధన కావున సామాన్యచిత్తవృత్తులకు సాధ్యము కాదు-నీ వాచావాత్సల్యమూ వాక్శూరత్వమున్నూ చూచి దానికనుగుణ్యరీతి నాచరింతువని నమ్మి నే నీ కార్యప్రవాహమున దిగినాను. చక్కగా నాలోచించి సమాధానమియ్యవలెను; వ్యవధి లేదని ఎరుగుదువు, మించి వచ్చింది; ఇప్పుడు మిడకరించిన ప్రయోజనము లేదు.

సుంద—నాకు కొన్ని సందేహము లున్నవి, అడుగుదునా?

ప్రేమా___అందు కేమి యాటంకము ?

సుంద___నాకీవిషయము కలనైనా తట్టలేదు-భద్రకి సుఖము చేకూర్చవలెనని ఎంచినానే కాని అందు కాధార భూతుడను నేను కావలె ననుకొనలేదు.

ప్రేమా___అదీ నే నెరుగుదును- నేను కూడా దానిని నీమెడకు చుట్టవలెనని నేటిదాకా అనుకోలేను-ఎల్లుండి అత్త వారింటి కది వెళ్ళకతీరదని తెలిసిన తరువాత దానిని తప్పించే మార్గమిది యొకటే అని నిశ్చయించినాను-ఇంకెవరికైనా ఆమె నివ్వవచ్చును, కాని అది సావకాశమున జరుగవలసిన పని; ఇప్పు డందుకు వ్యవధిలేదు- "పెళ్లి యిప్పుడు కాకుంటే ఎప్పుడూ కానేరదు" అని నిశ్చయించి నీ కిత్తామని నిర్ణయించు కొన్నాను-నీకు మామెడ ప్రేమ యుండి, అనుక్షణమూ మృత్యువు నోట పడుటకు సిద్ధముగానున్న అనాథవితంతువు ప్రాణములు నిల్పడమే కాక, దానికి సుఖము చేకూర్చవలె నని నీకు నిశ్చితాభిప్రాయ ముంటే, ఈపని చేసి తీరవలెను- లేకుంటే దాని జన్మము దుఃఖదాయకముగానే నిలిచిపోతుంది; ఏదో ఆలోచించి వేగము చెప్పు.

సుంద___ఏమి చెప్పడానికీ నోరాడదు అప్రతిహాత ములైన రెండు విపరీత జలప్రవాహములమధ్య చిక్కుకొన్న నావగతి నున్నది నాచిత్తము. ఎటుపోవుటకూ వీలులేదు-నిశ్చలముగా నుండరాదు.

ప్రేమా___మిత్రమా, సంసారము సూటిగా సాగవలె

నంటే ఉన్న ఆదర్శముల నవలంబించక గతానుగతికులవలెనే జీవయాత్ర నడుపుకోవలెను. అం దేవీ సంకటావస్థలుండవు. ఉత్కృష్టధర్మాచరణ మెప్పుడూ ప్రమాదభరితమే-ఏటవాలుగానున్న కొండ ఎక్కవలనంటే ఎంతకష్టమో ఆలోచించు...నిన్నలమిన చిక్కు కొంచెము తెల్పితివా నాకు తోచిన సలహా ఇస్తాను. మాకొరకు నీ విడుములు పడవద్దు.

సుంద—మిత్రమా, మావాళ్ల విషయమైతే నే నంతగా సంకోచించను. నా వృత్తాంతము విను-నేను ధనికుడను కాను; కాని జరుగుపాటుకి లోపములేదు-మాయూరనే ఒక ధనికుడున్నాడు-అతని కొక్కర్తెయే కూతురు. అందకత్తె కాదు గాని అంగలోపము లేమీ లేవు-దాని నతిగారాబముగా తలిదండ్రులు పెంచుకుంటూ పంచప్రాణములూ దానిమీద పెట్టుకొనియుండి తమతో సమానులయినవారి పిల్లడికి పెళ్లిచేస్తే పిల్లదగ్గర తాముండడమునకు వీలులేదని నాకివ్వదలచి నాకుటుంబమును తమకుటుంబ సమానగౌరవముతో చూస్తూ నాకు చదువు చెప్పించుతూన్నాడు నాలుగేళ్లనుండి. నిరుడే వివాహము చేతామనుకొని నా ఆటంకముచేతనే అప్పటి కాపి వచ్చేనెలలో ముహూర్తము నిర్ణయించుమని మమ్ము బలవంతపెట్టుతూన్నాడు. ఆపిల్లను వివాహమాడుతానని పెళ్ళియీడపిల్లలుగల మా బంధువులూ వారి బంధువులూ ఈర్ష్యాయత్తులై మమ్మనేక నిందలపాలు చేసినా దానిని మేము సరకుచేయలేదు- వివాహమయితేనే

కాని బంధుబాధ చాలా ఎక్కువగానున్నదనిమానాన్నగారూ కాబోయే మామగారునున్నా పదేపదే నాకు వ్రాసినారు- నేను వచ్చినతరువాత ముహూర్తనిర్ణయము చేయవచ్చునని నేను జాబు ఇచ్చినాను. వారంతా నారాకను నిరీక్షిస్తూంటారు. పట్టణము వదిలేటప్పుడు పదిరోజులలో వస్తూన్నానని వ్రాసినాను, నేడు వత్తునో రేపు వత్తునో అని వారు వేచియుంటారు. ఇంతలో ఈప్రళయమాసన్నమయింది. ఇప్పుడు నా చిత్తవృత్తి ఎట్లుండునో నీ వూహించు. ఈ ద్వైధీభావము నామనస్సును పీడించడముచేత నాకేది చెయ్యడానికీ పాలుపోలేదు...ఏమి సలహో యిస్తావో చెప్పు.

ప్రేమా—సమష్టిదృష్టిని చూస్తే ఈసమస్య ఉభయ సంభవము ఉత్కటమైనదిగా కనబడుతుంది కాని వ్యష్టిరూపమున సారాంశవిభజన చేస్తే చిక్కులన్నీ సులభముగా విడిపోవును. ఈయిద్దరు వధువులలోనూ కొంత తేడా ఉన్నది. మీయూరిపిల్లను నీవు కాకుంటే మరిఒకడు పెళ్ళియాడవచ్చును, మాచెల్లెలికి తగినవాడు దొరకడు, ఇప్పుడు తప్పితే వివాహమే కాదు; వధూసౌందర్యముమాట తలచనే వద్దు- రెండవది, మాచెల్లెలిని పెళ్లాడితే నీకు ధనము రాదు, ఆ పిల్లను పెళ్ళాడితే వారిభాగ్యానికి నీవే ఉత్తరాధికారివి.

సుంద—ధనము నా కక్కరలేదు, మీచెల్లెలిని వివాహమాడడమువల్ల అగాధమైన దుఃఖాబ్ధిని మునిగియున్న ఒక జీవికి సౌఖ్యము చేకూర్చిన వాడను కానా? కసాయివాని

కష్టబడే పశువుని కొని దానిని సుఖముగా పెంచడములో భూతదయ లేదా? ఉత్తమాదర్శము కాదా?

ప్రేమా—సరే...ఆ ధనవంతుని సొమ్ము తిని వాని విశ్వాసమునకు ప్రతిగా ద్రోహము చేయవచ్చునా? అని ఒక సారాంశము-నాల్గేళ్లనుంచి కాచుకొనియున్నాను, లోకమంతటా దృఢమైనది నీ వాపిల్లను పెళ్లియాడుతావని; అందరూ నమ్ముకున్నారు దానిని చెడగొట్టవచ్చునా? ఇది కృతఘ్నత.

సుంద—ఇందులో నొక సంగతి- తన కూతురిపై అనురాగముచేత దానిని విడువలేక ఇల్లరికమల్లుడిని చూస్తూ నేను కనబడగానే తెలివితేటలతో చదువుకొంటూన్నాను, ఎర్రగా బుర్రగా నున్నాను, ధనాశ కల్గిస్తే మామగారినీ నన్నూ ఒప్పించవచ్చునని ఎంచి స్వార్థమును కోరి చేసిన పనిగాని, కేవల న్యాయబుద్ధితో చేసినపని కాదు; తనకూతురు చక్కనిది కాదనీ నే నొకవేళ ఒప్పుకొంటానో లేదో అనీ నాకు కావలసినంత సొమ్మిచ్చి చదువు చెప్పించుతూన్నాడు-ఆసొమ్మతని కిచ్చివేస్తే అప్పు తీరిపోతుంది. ధన మార్జించుకోలేనివాని నెవనినైనా ఎంచి వానికి కూతురునిచ్చి పెళ్ళిచేసి హాయిగా అతని యింట్లో నుంచుకోవచ్చును, నేనే అన్న నియమ మక్కరలేదు-నీచెల్లెలు విషయములో మరొకని వెతకడానికే వ్యవధిలేదు.

ప్రేమా—ఓయీ! ఇది నావిషయము కావున నేను సలహా నివ్వలేను. నీవే నిశ్చయించుకోవలెను......ఈపని

చేస్తే ప్రమాదము లెక్కువ, ఆదర్శమొకటి మంచిది, ధర్మాచరణ ముత్తమమార్గము అన్న అనుకూలవిషయములు రెండే, నష్టము లెన్నైనా ఉన్నవి-నీ వేదారి తొక్కుతావో నిశ్చయించుకో. ఇప్పుడు పోదాము, రేపు ప్రొద్దుట నిర్ధారణ అయి తీరవలెను, లేకుంటే కార్యమంతా విషమిస్తుంది......

(సుంద॥ వెళ్లును)

భద్రతో చెప్పవలసిన మాటలు చెప్పి దాని చిత్తవృత్తి ఎట్లుందో తెలుసుకోవలెను. భద్రా! భద్రా!

(ఆమె వచ్చును) సర్వము సిద్ధమా?

భద్ర—సిద్ధమున కేముంది? నగలు నాన్నగారి పెట్టెలో నున్నవి, బట్టలు అమ్మదగ్గిర నున్నవి, కట్టుగుడ్డ మారుగుడ్డతో పోవలెను-తాళముచెవి అడుగుతే అనుమాన పడతారు-

ప్రేమా—గుడ్డల కేమి లోపమే! కావలసినన్ని కొనవచ్చును, నగలు క్రమేపి చేయించుకో వచ్చును....ఇప్పుడో కొత్తచిక్కు వచ్చింది మీ వృద్ధజంబుకాలు రావడముచేత.

భద్ర—ఏమి టది?

ప్రేమా—గట్టి చిక్కే. దారితెన్నూ తోచకుండా ఉంది. నేను చేయవలసినదంతా చేసినాను; ఇప్పుడితరుల చేతులలో కార్యసిద్ధి పడింది. వాళ్లాలోచించడానికి తగినంత వ్యవధిలేదు-ఒక్క రోజులో అంతా కావలెను- అంతటా ప్రతికూల పరిస్థితులు, ఆలోచన చెప్పేవారు లేరు;

నాకా లోకానుభవము లేదు-ఒక్క తప్పు జరిగిందా దాని ఫలము అత్యంతదుఃఖావహ మగును. పనిచేసేది నేను, దాని ఫల మనుభవించేవారు పరులు. ఏమాత్రము ప్రమాదము వచ్చినా యావజ్జీవనింద నాపైని బడుతుంది.

భద్ర—నా గురించి నీకు చింతవద్దు. నీ వేమి చేయు మన్నా చేయడానికి సిద్ధముగా నున్నాను. ఆకాశుసి బాధ తొలగించి నాకు మహోపకారము చేసినావు. ఒకవేళ నా విషయములో నీవుచేసిన పని ప్రతికూలిస్తే నా దౌర్భాగ్య మనుకుంటాను గాని నిన్ను నిందించను. ఇతరుల మాట నేను చెప్పలేను.

ప్రేమా—నిన్నిక్క డుంచి తగిన వరుని పరిశీలించి పెళ్ళి చేతామని అనుకొన్నాను, కొంప ములిగినట్లు వా ళ్ళిప్పుడే వచ్చినారు. నాన్నగారు మొదట కొంత మెత్తపడ్డారు కాని వాళ్ళను చూడగానే తిరిగీ ఎప్పటితో వలో పడ్డారు. నా పట్టు నేను విడువలేదు, నోటికి వచ్చినట్లు తిట్టినారు, లెక్క చేయలేదు;ఇంట్లోనుండి గెంటుతా మన్నారు, సరే అన్నాను; ఒకదమ్మిడీ అయినా నాకు చెందనీయ నన్నారు, మహాభాగ్య మన్నాను. ఇంక చేయగలిగినది లేక ఊరకున్నారు-ఇంతలో ఎల్లుండి ప్రయాణ మన్నారు. పని విషమించింది-ఇప్పుడు నీవు మీ అత్తవారింటికి వెళ్ళకుండా ఉండవలెనంటే పెళ్ళాడి తీరవలెను; తగిన వరుడు దొరకవలె నంటే వ్యవధి కావలెను, అది లేదు. తంటాలుపడి ఎవరినైనా ఒప్పించుదా మంటే

అతనిని పెళ్ళియాడడము నీ కిష్టమవునో కాదో? ఆతురమున వెతకవలసినప్పుడు అన్ని లక్షణాలు చేకూరవు—ధన ముండక పోవచ్చును, విద్య ఉండవచ్చును; అయుంటే ఇది యుండదు; రెండూ కుదిరితే రూప ముండదు- కావలసినంత వ్యవధి ఉన్నా ఈమూడు లక్షణములూ సమకూరవు, ఇంక వ్యవధి లేనప్పుడు వేరే చెప్పవలెనా? ఏది లేకపోయినా లోటే

ఇవన్నీ కుదిరినా అతని నైజ మెరుగజాలము-అన్ని విధములా నీకు నచ్చనివానిని కట్టుకొని ఏమి సుఖ మనుభవించగలవు? కోళ్ళను కోసేవాడు పోయి గొడ్లను కోసేవాడు జతపడునేమో? ఇన్ని చిక్కు లున్నవి. పిన్న వయస్కులము వేగిరించి కార్యసాధనము కావించవలెను-ఏమి విమర్శించునో తెలియదు. భావి అంతా అంధకారబంధురముగా కనబడుతూన్నది.

భద్ర—పోనీ, ఆసన్యాసి నడుగకూడదా?

ప్రేమా—ఈ విషయము లాతని నడుగవలసినవి కావు. మనమే నిర్ధారణ చేసుకొని అతనివద్ద చేరితే అతడు పెళ్ళి చేయిస్తాడు, అతని సాయ మంతే మాత్రమే. కార్యభారమంతా మనయిద్దరి నెత్తిమీద నున్నది-ఏదో రీతినీ మనమే తెగతెంపు చేసుకోవలెను.

భద్ర—బుద్ధిమంతుడవు నీకే పాలుపోనప్పుడు బుద్ధిహీనురాలను నే నేమి చెప్పగలను? ఒకటిమాత్రము చెప్పతాను-నీవు చేయుమన్న దెల్లా జంకకుండా చేస్తాను-అందువల్ల

నాకు నష్టము గలిగితే నిన్ను నిందించను-నా తలవ్రాత అనుకొని అనుభవిస్తాను-ఇక వరునిమాట-నీ వెవరిని కూర్చుతే అతడే నాకు మన్మథుడు, అతడే కుబేరుడు, అతడే విద్యావంతుడు-నా అదృష్టము కొద్దీ నాకు వరుడు లభించును-పుణ్యానికి పుట్టెడి స్త్రీ పిచ్చుకుంచమని పీకులాడవచ్చునా? వితంతువునే ధనవంతుడు, విద్యావంతుడు, రూపసి పెళ్ళియాడును? జాతిలోనుండి వెలి కెవ్వరు సమ్మతింతురు? ధనవంతులైతే ఏకన్యనో కట్టుకొంటారు. నేను ధనవంతురాలను కానుకదా? నీకే నాన్నగారు కాసివ్వనప్పుడు నాకే మిస్తారు? విద్యావతినై పెద్దపరీక్షల నివ్వలేదు-ఇంక రూపమూ కొద్దో గొప్పో ఉన్నది, ఇది యెంతకాల ముంటుంది? కనుక నాకు నచ్చిన వానినే పెళ్ళియాడుతానని పట్టుబట్టడము తెలివిమాలినతనము. వయసుచెల్లినవాడూ బలహీనుడూ కాకుంటే చాలు; లేకుంటే కొద్దికాలములోనే తిరిగీ వైధవ్యము ప్రాప్తిస్తుందేమో అని భయము. అదీ మూర్ఖత్వమే-మీబావ ఎంత చిన్నవారు, అప్పుడే కాలము మూడలేదా? అతనిని కన్న తలిదండ్రులు అధికాయువులై నన్ను కాల్చుకొని తినడానికి బ్రతికియుండలేదా? ఇంతకూ ముందేమి జరుగబోవునో ఎవ రెరుగుదురు? ఇప్పటిమాటే సరిగా చెప్పలేను.

ప్రేమా—భద్రా! నీ బుద్ధికి సంతసించినాను. నీ వన్ని విధములా నాకు తగిన చెల్లెలివే; నీదుఃఖము నూడ

లేకే నేను నీ కార్యమునకు పూనుకొన్నాను. నీ వదృష్టవంతు రాలవైతే అన్నీ అనుకూలముగా జరుగుతివి, లేకుంటే ఏదో విషమిస్తుంది. వరుని నిర్ధారణ చేయడమందు కూడా నీవు చెప్పిన రెండువిషయములే కాక తక్కినవి కూడా కలిసివచ్చే టట్లు చూస్తున్నాను. నా ప్రయత్నము కొనసాగితే మేలే, లేదా మన దురదృష్టము. నీవీ విషయమున నాతో ఏకీభవించడము నాకు పరమసంతోషదాయక మయింది. ఈరాత్రి పదిగంటలకు నీవు దేవాలయము చేరుకోవలెను, నేను కూడా అప్పటికే బావతో కూడా వస్తాను-పోయి పరుండు.

---

రెండో రంగము—సన్న్యాసి ఆశ్రమము.

(సన్న్యాసి, ప్రేమానందుడు, భద్ర, సుందరము.)

సన్న్యా—కావలసిన వస్తువు లన్నీ తెచ్చినావా? హోమసామగ్రి, పువ్వులు, ఫలాలు, బట్టలూ మొదలయినవి దొరికినవా?

ప్రేమా—వీలునుబట్టి కొన్ని తెచ్చినాను, వీటితో జరిపివేయ ప్రార్థిస్తున్నాను.

సన్న్యా—(నీళ్ళుజల్లి స్థలము పవిత్రముచేసి సింధూరము సున్నము మొదలైనవాటితో ముగ్గులు పెట్టి హోమము చేసి) నాయనలారా, వినండి. మీ రిప్పుడు మొదలుపెట్టినది *కష్టసాధ్యమైన పని, భగవంతుడు మీకు చిత్తస్థైర్యము ప్రసాదించును. మీ రాచరించేది ఉత్తమధర్మము, ఇది భగవద

నుజ్ఞచేత మీరు సాధిస్తూన్నారు కావున మీకు సంతసము చేకూరును. మీ ఉద్దేశ మతి సుఖదాయకము గనుక మీ ఆత్మబలమూ ఆత్మప్రత్యయమూ హెచ్చి ఎట్టి విఘ్నములైనా మిమ్ము చేరితే మీరు క్షణములో వాటిని తరించ గలరు.

ప్రేమా—స్వామీ, ప్రకృతమందెట్టి అంతరాయములూ రాకుండా వివాహము కానీయండి.

సన్యా—నాయనా, ఇక్కడ ఆటంకములు కలుగ నేరవు. (కొంత హోమముచేసి-హరిః ఓమ్ అని మూడు మారులని, సత్యం జ్ఞానమనంతమమృతం బ్రహ్మ—అని మరికొన్ని క్రియలు జరిపి వధూవరులను చేరతీసి) అమ్మా—ఇతనిని భర్తగా వరింతువా త్రికరణశుద్ధిగా?

భద్ర—(తల వంచి ఊరకుండును)

సన్యా—మాటాడవలెను.

భద్ర—నే నాయనను భర్తగా వరించినాను త్రికరణ శుద్ధిగా.

సన్యా—(సుందరముతో) నాయనా, అట్లే ఈమెను భార్యగా గ్రహింతువా?

సుంద—త్రికరణశుద్ధిగానీమెనుభార్యగాగ్రహింతును.

సన్యా—అమ్మా-ఇతని సుఖదుఃఖములు నీవు పంచుకొందువా? ఇతని మాటచొప్పున నడుచుకొందువా?

భద్ర—వారి కష్టసుఖములు నావిగా భావించుకొని వారిమాట ఎన్నడూ జవదాటను.

సన్యా—ఈమె కష్టసుఖములయందు నీవు పాల్గొని ఆమె చెప్పిన చొప్పున నడచుకొందువా?

సుంద—ఈమె నర్థాంగిగా గ్రహించినాను కావున సుఖదుఃఖములయందు ఈమెకు తోడ్పడి ఈమె కిష్టము వచ్చిన చొప్పున వర్తించెదను.

సన్యా—(ప్రేమూ॥తో) వీరి వివాహము నీకు సమ్మతమేనా?

ప్రేమ—నాకది పరమసమ్మతము. (భద్రచేయి సుందరునిచేతిలో పెట్టి) పంచభూతములు, నవగ్రహములు, సకల మానవులూ సర్వేశ్వరుడూ సాక్షులుగా నాసోదరియైన శ్రీమతి సుభద్రాదేవిని శ్రీయుత సుందరముగారికి ధర్మపత్నిగా అర్పిస్తూన్నాను. వీ రనురూపవధూవరులు కావున వీరి వివాహము వీరికే కాక మా బంధుకోటికిన్నీ మిత్రసంతతి కిన్నీ అత్యంత మోదదాయకమని నా దృఢవిశ్వాసము. నే నీ యుద్దేశముతో ఈదాంపత్యము కూర్చినాను కావున ఇది సర్వజనసమాదరణీయ మగుగాక! సుందరా, నే నీదినమున నీ భుజస్కంధమున గొప్ప బరు వెత్తినాను. నాసోదరి సుభద్రను నీవు యావజ్జీవమూ సుఖపెట్టుమని ప్రార్థిస్తూన్నాను. సర్వమంగళదాయకుడగు భగవంతుని తరువాత నీవే ఆమెకు దిక్కు. సోదరీ సుభద్రా, నీ వితని కర్ధాంగివి

ధర్మపత్నివినై ఇతనియాన జవదాటక సకలవిధముల ,నీతని సుఖపెట్టి నీవునూ సుఖపడుము. భగవంతుడు మీకు సక లైశ్వర్యములూ ప్రసాదించుగాక !

సన్యా—అనయోర్దంపత్యోః ఆయురారోగ్యైశ్వర్య సమృద్ధి రస్తు, సంతతశ్రీ రస్తు, నిత్యకళ్యాణ మస్తు. అవిచ్ఛిన్నపుత్రపౌత్రపారంపర్య మస్తు, మనోవాంఛాఫలసిద్ధి రస్తు.

ప్రేమా—వృద్ధాశీర్వాద మమోఘ మస్తు. తథాస్తు.

సన్యాసి—నాయనా, లేచి అగ్నిచుట్టూ ప్రదక్షిణ ముచేయుము. (ముడివేయును వారు సప్తప్రదక్షిణము లయినపిమ్మట హారము లొకరిమెడలో నొకరు వేసుకొందురు. సన్యాసి మిఠాయి ఫలములూ పంచిపెట్టును.) అయ్యలారా! ఈ వివాహము ముగిసినది, మీరు సంతతసుఖము అనుభవించేటట్లు సర్వసాక్షియు సర్వశక్తుడు నైన పరమేశ్వరుడు ప్రసాదించుగాక! మీరు మీమిత్రకోటికి బంధువులకునూ సంతసము చేకూర్తురుగాక-మీరు ధర్మపథానురతు లవునట్లు మనోధైర్యము భగవత్ప్రసాదమున మీ కలవడుగాక! మీరు గృహస్థాశ్రమమున ప్రవేశించినారు, అది సుఖదుఃఖపూరితము, వాటి ననుభవించి తీరవలయును. సంసృతియందు త్తమపురుషార్థము ధర్మము కావున మీ రధర్మము నుజ్జగించి ధర్మమునే అనుసరించవలయును. త్రికరణశుద్ధిగా ధర్మాచరణ మొనర్చువారి కేభీతీ ఉండనక్కరలేదు. ఒకరు మెచ్చుతారని కాని ఇంకొకరు నిందిస్తారని కాని

మిమ పెట్టి ధర్మపథము తప్పబోకండి. మీ దంపతు లిద్దరూ వివేకవంతులు కావున మీ జీవనము పరస్పరసుఖావహ మయితీరును. పాపభీతి, భగవద్భక్తి, సమాజానురక్తి న్నీ కలిగి ప్రవర్తించండి. ఓం తత్సద్బ్రహ్మార్పణ మస్తు. ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.

సుంద—మహాత్మా, మీ కరుణచేత నే నొకయింటి వాడ నైనాను. మీరు చేసిన ఉపకారమునకు తగిన ప్రతి క్రియను చేయజాలము. ఈ వందనములు గైకొని మమ్ము ఋణవిముక్తుల గావించండి. (అందరూ నమస్కరింతురు)

సన్యా—బిడ్డలారా! మీకు సకలసుఖములూ చేకూరుగాక! నా కింతకన్న వేరేమీ అక్కరలేదు. నాకు సెలవు. (లోనికి పోవును)

సుంద—మిత్ర... బావా, ఇటుపై నేమి చేయు మంటావు?

ప్రేమా—ఏమో? నా కేమీ తెలియదు. మాయిం టికి మేము పోతాము, నీ దారిని నీవు వెళ్ళు. ఏరు దాటినాముగా?

సుంద—అంతే? నన్ను బోడిబావను చేసినావా?—(వెళ్ళుదురు.)

## మూడో రంగము — వీరేశ్వరు నిల్లు.

---

కావేరి — ప్రేమ.

కావే — ఇ దేమి పిల్లడమ్మా! పెద్ద లున్నారనే జంకైనా లేక ఎంతెంతలేసిమాట లన్నాడు! ఇప్పటి చదువు లిలాటివే. వీళ్ళచదువు సన్నగిల్లా! భయమూ లేదు భక్తీ లేదు. ఎటువంటి వాళ్లనీ ఈసడించడమే!

ప్రేమ — వదినా! నోరు నొక్కుకోవలెను. వీడు చిన్నప్పు డెంత మెత్తనివాడు, ఎంత తెలివైనవాడుగా నుండె ననుకొన్నావు? ఎంతో సంతోషించినాము. ఇప్పు డాబుద్ధి ఎక్కడికి పోయిందో ఎరుగను. పట్టణము వెళ్ళినదగ్గరనుండీ నానాటికి మాట వినకుండా ఉన్నాడు. ఎవ రేమి చెప్పినా వినడు, ఎవరి లక్ష్యమూ లేదు, తనకు తోచినట్టే చేస్తాడు. మీ యింటినుండి మా భద్రను తెచ్చినప్పటినుంచీ దాని కేవో పుస్తకాలు చదివి చెప్పుతూన్నాడు. ఆడదానికి చదు వెందుకురా? ఉద్యోగము చేస్తుందా, ఉళ్ళేలుతుందా? ఇంట్లో పని చక్కబెట్టుకొంటే చాలు అని నే నెంత చెప్పినా విన్నాడు కాడు. ఊరివారందరూ మమ్ము చూచి నవ్వు తున్నా రన్నా మానినాడు కాడు.

కావే — అందుకే భద్రని మావెంట పంపిస్తే మీ కేచిక్కూ ఉండదు. మాయింటా నుంటే వంట కుట్టూ, చారముతీయడమూ నేర్చుకొంటుంది. ఆడదాని కంతేగా

కావలసినది ? కానికాలము వచ్చింది, పిల్లలు పెద్దలమాట వినకుండా ఉన్నారు; మన చిన్నతనాన ఋట్టి వెక్కడనైనా ఉండెనా ? ఇదేమి విపరీతమమ్మా !

ప్రేమ—పీడిబెంగ నన్ను గట్టిగా పట్టుకొన్నది. ముసలికాలానికి మా కీముప్పు వచ్చింది. మావాడి చర్య చూసేసరికి మావారి ప్రాణము విసిగింది. కొట్టవలెనని రెండు మూడుసారులు సిద్ధపడి, పెద్దవాడైనాడు తొందరపడకూడదని మానివేసినారు.

కావే—ఇంకోటి-వాడు తిరుగబడితే మన పెత్తనము సాగుతుందా ? వీళ్ళకి మనము జడియవలసినదే. మీతో వాడు గట్టిగా మాట్లాడినప్పుడు నాశరీర మంతా గజగజ వణికింది. వాడు తలుచుకుంటే మన నందరినీ తన్నగలడు.- ఈనాడే భద్రను పంపించివేస్తే ఈజగడము మరి పెరుగదు. ఇంటిలో పోరు కూడదు. మనస్సుకి శాంతి ఉండదు, క్రమేపి మనోవ్యాధి కూడా రావచ్చును.

ప్రేమ—మీ రీసమయానికి రావడము మా అదృష్టము-ఒదినా, నా దొక మనవి-మాపిల్ల వెర్రిబాగులది, దానిని నీవు తిట్ట నక్కరలేదు, కొట్ట నక్కరలేదు, వట్టి అర్భకురాలు; కాని తెలివైనది, ఒళ్ళు దాచుకోదు, నా పిల్ల అని చెప్పడము కాదు కాని కొద్దో గొప్పో పనిమంతురాలు. ఏపని చేసినా అతిశుభ్రముగా చేస్తుంది. "కూతురు చెడుగైన మాత తప్పు." దానివల్ల ఏదైనా లోపముంటే అది

నాతప్పుగా మన్నించి దానిని చక్కగా తిప్పుకొంటే నీ చిత్తమువచ్చినట్లు మసలుతుంది. పెంకె కాదు.

కావే—రామ రామ—నేను దాని నేమీఅననేఅనను. దానికి కావలసిన వస్తువు తినుమనీ, బట్టకట్టుమనీ, ఇష్టమున్న పని చేయుమనీ చెప్పుతూంటాను. అంద రత్తగార్లలాగు దాని నారటపెట్టను.

ప్రేమ—జరిగిపోయిన దాని కేమి? లోగడ మీయింట నున్నప్పు డది పడ్డబాధలు దానినోట వింటే గుండెలు చెక్క లయిపోయినవి.

కావే—అవన్నీ కిట్టనిమాటలు. ఎంత మంచి అత్త గారిని చూసినా కోడలికి గిట్టదు. ఇది సహజమే.

ప్రేమ—దానిమాటలు నే ననలే నమ్మలేదు-మా అబ్బాయి కళ్లారా చూచినానని చెప్పినాడు, అందుకోసమే అక్కడికి పంపనని పట్టుపట్టినాడు.

కావే—కుఱ్ఱవాళ్ల మాటలా మీకు గురి? దాని నేమైనా అంటే నా నాలుక చీలిక లయిపోదా! పల్లెత్తుమా టన నమ్మా.

ప్రేమ—ఒదినా, నీ చెయ్యి పైది, నీవేమన్నా సాగు తుంది...ఇదిగో కొంగుపట్టుకొని బతిమాలుతున్నాను— మాపిల్లని పువ్వుల్లోపెట్టి పెంచుకొన్నాము, ఎన్నడూ కోప పడి ఎరుగము; ఆడపిల్ల ఉసు రంట గాదంటారు, మీరు దాని నేమన్నా అది మామీద ఏడుస్తుంది; కనుక నీ కూతు

రులాగే దానిని చూచుకోమని వేడుకొంటూన్నాను. ఆడబిడ్డ కన్నదాన వంతా తెలుస్తుంది నీకు.

(వీరేశ్వరుడూ ముకుందుడూ వత్తురు)

వీరే__గుర్రపుబండి మాటలాడినాము, దొరకడము చాలాకష్ట మయింది-అన్నీ ప్రొద్దుటే వెళ్లిపోయినవి. ఇది తిరుగుబండి గనుక కట్టుతా నన్నాడు- రేపుప్రొద్దుట ప్రయాణము కమ్మన్నాను కాని వారియిష్టము. అప్పుడైతే చాలా బళ్లు సాయముంటవి, అద్దెకూడా తగ్గుతుంది. దొంగాదొ్రా ఉండరు.

ముకు__ఇప్పుడు పొద్దు వాలినది, చల్లగా నుంటుంది; ప్రొద్దుటైతే ఎండంతా మాపా లవుతుంది-ఆలస్యము చేయక బయలుదేరితే దీపాలు పెట్టేసరి కూరుకి చేరుకోగలము- ఇంటి ముఖమైనదిగనుక గుర్రము వేగమేపోతుంది-దొంగల భయము లేనేలేదు.

ప్రేమ__(కన్నీటితో) ఆడపిల్ల నన్నా ళ్ళుంచుకోగలము? అ దన్యుల సొత్తు- ఏదో కన్నామన్న మాటే కాని దాని బ్రతుకంతా మీచేతులలో నున్నది. అల్లరిపిల్ల కాదు, చెప్పినట్టూ నడుచుకొంటుంది కాని మారుమా టాడలేదు... మీరే దానికి తల్లి-మీరే దానికి తండ్రి-మా ఊసేమీ లేదు, అయినా కన్నకడుపు గనుక కష్టపడుతూంటే చూడలేము-వినలేము.

ముకు—మీరు చెప్పవలెనా? మే మెరుగమా? మీ కేబెంగా వద్దు- నాకడుపున పుట్టిన బిడ్డకన్న ఎక్కువగా చూస్తాను. ఇది మంచిపిల్లని నే నెరుగనా?

వీరే—వాళ్లకి మాత్రము పేగు కాదే? వాళ్లపిల్లన్న మాటే.

కావే—నేనుచాలా అపకీర్తి పడ్డాను-దాని నేలాగు చూచినానో భగవంతు డెరుగును. నావల్ల దోష ముంటే ఆతడు నన్నే శిక్షిస్తాడు. అయిన దేమో అయింది. ఇటు పైని అది నన్ను కొట్టినా తిట్టినా సరే పల్లెత్తు మాటనను.

వీరే—హరిహరీ! ఏంతమా టన్నావు! తప్పుచేస్తే నీవు కోపపడడము న్యాయమే-పెద్దలు దిద్దకుంటే ఇంకెవరు బుద్ధిచెప్పేవాళ్ళు? మేము మాత్ర మూరుకో మనగలమా?

ముకు—ఆమె యిక్కడికి కెప్పుడు వస్తానంటే అప్పుడు తీసుకొని వస్తాను.ఆమె కేదికావలెనంటే అది తెచ్చియిస్తాను.

(ప్రేమానందుడు వచ్చును)

ముకు—అబ్బాయీ! మేము వెళ్ళివస్తాము. నీ కొక్కమాట చెప్పుతాను, జ్ఞాపక ముంచుకో—తలిదండ్రుల కెదు రాడకు-భావగారూ, అమ్మాయిని పిలువండి, బయలు దేరుతాము.

ప్రేమా—అమ్మా! అంతా సిద్ధము చేసినారు కదా, సుభద్ర ఉద్దేశ మేమో అడిగినారా?

వీరే—అదేమంటుంది? వెళ్ళననదే? వెళ్ళక తప్పుతుందా దానికి?

ప్రేమా—అలాగే కానీ, అడిగి చూడండి దాని ఉద్దేశము.

వీరే—బాగుబాగు-ఎద్దు నడిగి గంతలు కట్టుతారా? తెలివిమాలిన మాట లాడక నోరు మూసుకో-ఇదివర కెన్నడూ లేని మర్యాద తెచ్చిపెట్టుతూన్నావు. నీ వెవడవు మాకు సలహా యివ్వడానికి? దాని నడుగమనడానికి? మీ ఒప్పుదలతో పనిలేదు.

ముకు—దానికి చెప్పడాని కేముంది? అది చాలా బుద్ధిమంతురాలు. తల్లిదండ్రులమాట కెదు రాడదు.

కావే—మాయా మర్మమూ ఎరుగని అమాయికురాలు. అది మూర్ఖపుపట్టు పట్టదు. ఇదివర కెప్పుడూ వెళ్ళననలేదే?

ప్రేమా—అది వెళ్ళడమునకిష్టపడితే మంచిమాటే-లేకుంటే దానిని బలాత్కరించుతారా? లోగడసంగతి వేరు, అడిగి చూడండి యిప్పుడు.

వీరే—అదేమంటుంది? దాని ఊసేముంది?

ప్రేమా—అది వెళ్ళనని నాతో చెప్పింది.

వీరే—ఏమన్నది! ఏదీ చూతాము. భద్రా, ఇటు రా. ఓరీ! నిర్భాగ్యుడా, (ఆమె వచ్చును) నీవేమైనా దీనికి చెప్పిపెట్టినావా?

వీరే—ఏమే, అబ్బాయితో నీ అత్తవారింటికి వెళ్ళనన్నావట నిజమేనా?

ప్రేమ—ఇదేమిటే? ఇంగా గెక్కడేనా ఉందా? మీ అత్తమామలెంతో మంచివాళ్ళు, నిన్నే మనమని చెప్పుతూన్నారు; నీకేమీ భయముండదు-వెళ్ళమ్మా! వెళ్లననకూడదు, తప్పు.

వీరే—మొద్దురాయిలా కూరకుంటావేమి? చెప్పు-వెళ్ళడానికి నీ కిష్టము లేదా? నీబుద్ధికూడా పెడదారిపెట్టినట్టుంది!

భద్ర—(ఊరకుండును)

వీరే—మాటలాడవేమి? నోరు కట్టివేసినాడే ఈమూర్ఖుడు?

ముకు—బావగారూ, కోపపడకండి—సుభద్రమ్మా, చెప్పు, నీకు మాయింటికి రావలెనని ఉన్నదా లేదా?

ప్రేమ—ఇదేమే మాటలాడవు! దయ్యము పట్టిందా ఏమి?

వీరే—నీవు కూడా మాట వినవా? ఎంత సిగ్గు లేదే? మాకపకీర్తి తేవడానికా మా కడుపున పుట్టినారు?

భద్ర—నాకక్కడికి వెళ్ళవలెనని లేదు-నేను వెళ్లను.

వీరే—ఏమన్నావు?

ప్రేమ—వెళ్ళదట! ఇంకేమి దారి, దేవుడా? దీని

కేమి వినాశకాలము వచ్చిన దమ్మా! మతి శుభ్రముగా పోయిన ట్లుంది.

బండివాడు—ఏమండో చాలా ప్రొద్దయింది-ఊరికి వెళ్ళవలెనంటే వేగము బయలుదేరండి-చీకటి పడితే చాలా కష్టము.

ముకు—ఇదిగో బయలుదేరుతూన్నాము. ఆలస్యము లేదు.

వీరే—వెళ్ళవా? ఎందుచేత? లే. లే. నడువు-అయ్యా, పెట్టెలు బండిలో పెట్టించండి. ఎందు కాలస్యము!... (భద్రతో) ఏమే సిగ్గుమాలినదానా, ఎందుకు వెళ్ళనంటూన్నావు? బావగారూ మీరు ముందు నడువండి, వెనుక దీనిని నేను తీసుకొనివస్తాను. (సుభద్రను లాగబోవ ఆమె కదలకుండును.)

భద్ర—నేను వెళ్ళను-నన్ను బలవంతపెట్టకండి. నాకిష్టము లేదు.

ముకు—ఇదేమి అన్యాయము? అత్తింటికి వెళ్ళననే కోడ లుంటుందా? ఎంత కాలవైపరీత్యము!

కావే—అయ్యో! అయ్యో! ఏమి పాపమే! ఎక్కడేనా ఉందే ఈలాగు? అపకీర్తి ముచ్చట! (నోరు నొక్కుకొనును)

వీరే—ఊరకుంటూన్నకొద్దీ దీని పెంకెతనము చెలరేగుతూంది-నడుస్తావా? గెంటనా? ఊఁ, కదలవేమి?

ప్రేమా—జోరావరి చేసి పంపుతారా? ఇదేనా మీ అభిమానము? మీ శిశువాత్సల్య మిట్టిదే కాబోలు?

ప్రేమ—నీయింటికి పో నంటావేమే? ఎప్పుడూ లేదు ఈ మొండితనము.

భద్ర—నన్నేమిచేసినా సరే, కావలిస్తే చంపండి-నే నక్కడికి వెళ్లను.

వీరే—ఓసి నిర్భాగ్యురాలా! అక్కడికి కాకుంటే ఇం కెక్కడికి పోతావే? కాటికా, నరకానికా? ఇంత సిగ్గుమాలినదాన వైనా వేమే? పో-నీమొగము చూడ నింక-ఎందులోనేనా పడి చావు, పీడ వదలుతుంది-నీవు బ్రతికితే ఏమి నిండు?

ప్రేమ—నాన్నగారికి కోపము వచ్చిందే; ఆయనిది వెర్రికోపము-నామాట విను. నీ వపనిందపాల బడకు, మాకు నింద తీసుకొనిరాకు. లే, బండిలో కూర్చో.

ప్రేమా—అమ్మా, ఇందుకే నేను దాని నడుగుమన్నాను. ఎవ్వరూ కూతుళ్లని మీలాగు గెంటివేయరు పొమ్మని...

వీరే—దీని మొగ మిక చూడను-అపకీర్తి అభాజనపు ముండ-దీనిని నాయింట్లో నుండనివ్వను. నలుగురిలోనూ నాపరువు తీసింది-బంధువులముందర నాకు నగుబాటు తెచ్చింది-ఇలాంటిది బ్రతికినకన్న చస్తే మేలు. జీవచ్ఛవము!

ప్రేమా—నాన్నగారూ, దాని కిష్టము లేనప్పుడు ఎందుకు మీరు బలవంతపెట్టుతారు?

వీరే—తలచెడ్డ ముండ తలిదండ్రులదగ్గ రెన్నాళ్ళుంటుంది?

ప్రేమా—నేను చెప్పినట్లు చేస్తే అంతా అనుకూలిస్తుంది. మీరు దాని నుంచుకో నక్కరలేదు, అదీ సుఖపడుతుంది. (సుభద్ర పోవును, ఆమెవెంట ముకుందుడు కావేరిన్నీ పోదురు.)

వీరే—ఓరి చండాలుడా! ని న్నెవ్వరూ బొట్టుపెట్టి రమ్మని పిలిచినారు సలహా యిమ్మని? నిర్భాగ్యుడా! నీవే దీని కుపదేశము చేసినావు. వద్దురా అంటే అగౌరవపు ప్రసంగము మానకున్నావు. నీకూ దానికీ భయమూ లేదు, భక్తీ లేదు. సిగ్గూ లజ్జా వదిలివేసి మొండికెత్తి, బండబారినారు.

ప్రేమా—మీ రేమన్నా సరే, కాని నేను చెప్పినది మాత్ర మతియోగ్యమైన పని.

వీరే—ఛీ-చండాలుడా, పాజీ, నీవు పుట్టకున్నా బాగుండును రా? ఇటువంటి అపకీర్తి భాజనుడు, అగౌరవ పాత్రుడూ కొడు కయినాడు కదా అని నలుగురిలో తల ఎత్తుకోలేకున్నాను.

ప్రేమా—న న్నేమన్నా సరే, వద్దనను, కాని పాపము, భద్రయెడ నింత క్రూరత్వము మీకు తగదు.

దాని నక్కడికి పంపడము దాని చావుకే-బ్రతుకుకి నీళ్ళు వదలుకోవలెనంటే ఆపని మీరు చెయ్యవచ్చును-ఉంచుకుంటే అపకీర్తి అన్నారా తిరిగీ పెళ్ళిచేయండి, దానిబాధ మీ కుండదు; నామాట వినండి, చేతులారా దానిని చంపుకోకండి.

ప్రేమ—పట్టిన మూర్ఖపుపట్టు వదల వేమిచేతునురా? నాప్రాణానికి వచ్చింది. ఇలాగు మమ్మపనిందపాలు చేస్తున్నారు మే మేమి పాపము చేసుకొన్నాము రా నాయనా! ఇప్పటికే నలుగురూ నోట్లో గడ్డి పెట్టుతూన్నారు, ఇదిచాలక యింకా మా కపకీర్తి తెచ్చిపెట్టుతారా? ఈలాగు మేము బ్రతికియుండడము మీ కిష్టము లేదా?

వీరే—ఓరీ చండాలుడా, మాలమాదిగలలోకూడా నీవంటి బుద్ధిహీనుడుండడు రా! నాయెదుట నిల్వకు, నిన్ను చూస్తే నాకంట్లో కలికము వేసినట్లున్నది. నీకు నరకమే గతి. పురుగులు కారి బాధపడుతావు మాకింత సంతాపము గలిగించినందుకు-కొడుకు వైనావు కాని మరొకడైతే రెండు ముక్కలకింద చీల్చివేతును. పో, నాయింట్లో నుండవద్దు. ఇంకెప్పుడైనా గడపలో కాలుపెట్టితే నెత్తి బద్దలుకొట్టుతాను. (ముకుందుడు కావేరి సుభద్ర వత్తురు.)

ప్రేమా—సరే-మీమాట కాదనను-నే నిక్కడుండి మీకోపము హెచ్చించను, పోతూన్నాను; సుభద్రనుకూడా పొమ్మన్నారు కావున దానిని నావెంట గొనిపోతాను. ఈ మాట మీతో చెప్పకుండా వెళ్లడాని కిష్టము లేదు, కనుక

చెప్పినాను. చెల్లీ-పద-ఇక మన మిక్క డుండవద్దు. ఈ గడప తొక్కవద్దని కదా నాన్నగారి యాజ్ఞ-అలాగే కానీ.

ప్రేమ—దాని నెక్కడికి తీసుకొని పోతావు?

ప్రేమా—ఇప్పుడు నాదగ్గ రుంటుంది. తరువాత డా నిరంటికి తీసుకొని పోతాను.

వీరే—ఓరి చండాలుడా, దాని కెక్కడ ఇల్లు ఏర్ప రచినావు?

ప్రేమా—నిన్న దానికి పెళ్ళి అయింది.

అందరు—ఏమిటీ! అయ్యో! అయ్యో!

ప్రేమ—మాకొంప కూల్చినావురా నాయనా, ఇక మే మెలాగు బ్రతకడము? (అంతా కూలబడుదురు)

బండి—ఏమండోయి, బయలుదేరుతారా లేదా?

ముకు—(ముందుకి వచ్చి) నేటికి ప్రయాణ మాగి పోయింది-రేపు చూతాము.

బండి—బాగానే ఉంది. ఇంతసేపూ సిలువబెట్టి యిప్పుడు వద్దంటారా? బేరాలన్నీ మించిపోయినవి. ఈ రాత్రికి భత్యము నేను కట్టుకొని రాలేదు. నా అద్దె చెడగొట్టి నారు. పెద్దమనుష్యులు కదా అని మాట నమ్ముకొన్నందుకు బాగాచేసినారయ్యా-ఉభయత్రా చెడ్డాను.

ముకు—కేకలు వేయకు-ఇదిగో ఈ పావలా తీసుకో.

బండి—ఎందుకు? పావలా యిస్తారా? మీరే ఉంచుకోండి-ఏన్నో బేరాలు వదలుకొన్నాను. అప్పుడే

చెప్పితే ఈపాటి మాఊరు పోదును. నా కింత నష్టము కలిగించిపావలా యిస్తారా! పావలా! చాలా తెగించినారయ్యా ఏడీ-ఆయనని పిలువండీలాగు.

ముకు___ఇదిగో ఇంకో పావలా, గోల పెట్టకు.

బండి___బిచ్చగాడి ననకొన్నారా ఏమి? రెండు రూపాయీల అద్దె చెడగొట్టినారు, మీరు మిక్కిలి ఈరాత్రి వస్తుందుమన్నారా?

ముకు___ఎం తివ్వ మంటావు? న్యాయము నీవే చెప్పు.

బండి___మాటలాడుకొన్న అద్దె రెండురూపాయీ లివ్వండి-లేదన్నారా బయలుదేరండి.

ముకు___ప్రయాణ మాగిపోయిందని చెప్పలేదూ? ఎందుకు కేకలు వేస్తావు?

బండి___ఏడీ ఆయన్నిరమ్మనండి-మీరు మాట్లాడలేదు నాబండి-ఆయన వస్తే రెండురూపాయిలూ యివ్వవలసివస్తుందని నిన్ను పంపినాడా? నీ వెవడ వయ్యా? పల్లెటూరివాడిలా గున్నావు.

ముకు___ప్రయాణ మయ్యేది నేనే.

బండి___మీతో నా కవసరము లేదు, నన్ను మాటలాడినవా డాయన; పిలువండీలాగు___మీ కీ ఊరి వ్యవహారము తెలియదు.

ముకు___ఊ-ఈ రూపాయి తీసుకొనిపో.

బండి — బాగుందయ్యా, క్రొత్తవాడవని ఊరకున్నాను, అతడైతే రెండురూపాయీలక్కడ పెట్టించి తీరుదును. (పోతూ) నా అదృష్టము బాగుంది ఇతను రావడము. అతనైతే అర్ధణా దొరకకపోవును. నోరుంటే సరి ఈకాలము-న్యాయ మక్కరలేదు-నోరున్నవాడిదే రాజ్యము నొల్లుకొన్నవాడిదే భోజ్యము. (వెళ్ళును)

వీరే — ఓరి కులద్రోహీ! ఎంతపని చేసినావు రా! ఇంతలోనే నీ కేబావ జతపడ్డాడు రా ఈ నిర్భాగ్యురాలిని పెళ్ళాడడానికి? వా డెవడో జాతితక్కువవాడిలా గున్నాడు. నీలాటి పోకిరీ వాడే కాబోలు! లేకుంటే ఇంత దురంతము చేయడు. ఆ తలమాసినవా డెక్కడ దొరికినాడు?

ప్రేమా — భగవంతుడు ప్రసాదించినాడు. అట్టివాడు వేయిమందిలో నొక్కడు కానరాడు; మణిపూస. అటువంటి వా డల్లుడైనందువల్ల మన కుటుంబానికి గొప్ప గౌరవము కల్గింది. నాతో వచ్చిన సుందరుడే సుభద్ర పెనిమిటి.

ప్రేమ — అమ్మా! వీడా మాకొంప తీసినాడు!

వీరే — ఆపాజీ నిందుకా తీసుకొని వచ్చినావు? ఏమి నక్కవినయాలు వేసినాడు! అతివినయం ధూర్తలక్షణ మ్మనుమాట సార్థక మయిందే. ఎంతో మంచివా డను కొన్నాను. ఇంత దగాఖోరా? ఎంత ద్రోహీ వీడు! అన్నా! ఈ నాగుబాము నింట్లోచేర్చి పాలుపోసి పెంచి

నావు రా? చండాలుడా, మూర్ఖా! కాటువేసిందిరా కాల
సర్పము!

ప్రేమా—అతనివల్ల తప్పేమీ లేదు, అతనిని నిందించవద్దు; అంతా నేను చేసినదే. అతని నెంతో వేడుకోగా భద్ర పడ్డ పాట్లుచూచి జాలిపడి ఆమెదుఃఖము తొలగించవలెనని ఎంతో స్వార్థత్యాగ మొనర్చి భూతదయార్ద్రబుద్ధితో దానిని శోకాబ్ధి తరింపజేసినాడా మహాత్ముడు; ధర్మాచరణదీక్షగొన్న ధీరుడు, అతడనింద్యుడు. ఈ పన్నుగడ నాపని; ఇది ధర్మాపేతము కాదనిన్నీ ఉభయతారకమనీ అవశ్యాచరణీయమనీ త్రికరణశుద్ధిగా నమ్మి చేసినాను. మీరు నిందించవచ్చును, మీ కిది గౌరవహాని యని తలచవచ్చును. నామనస్సాక్షి నా కిది ధర్మకార్య మని బోధించినది కావున నేను భగవంతునిమీద భారము వేసి చేసినాను. మీ కిది నచ్చకపోవడము మాదుష్టదైవదుర్విపాకము. మీ యెదుట మమ్ము సిలువవద్దన్నారు కావున కనుకలకవాని ముందర పెద్దదీపములలాగు మేము నిలువము. మాకు సెలవిస్తే మాదారి చూసుకొంటాము.

వీరే—ఓరి నీచా! నీ వబద్ధ మాడుతూన్నావు. పెళ్ళీ లేదు, గిళ్ళీ లేదు. నీ వెవడవు దీనికిపెళ్ళిచేయించడానికి? ఆపెళ్ళి చెల్లదు.

ప్రేమా—నామాట మీరు నమ్మకుంటే ఊరివెలు

పలనున్న కోవెలలోని మహాత్ముని నడుగండి. అతడే పురోహితుడై ఈ శుభకార్యము జరిపించినాడు.

వీరే—వాడా? గజదొంగ! ఫుండాఖోర్. ఈ వేషమువేసి లోకుల నందరినీ దగా చేస్తున్నాడు. వాడి నెత్తి పగులగొట్ట! వాడు మీ కూటములో చేరినాడా? ఓరీ తుచ్ఛుడా! ద్రోహీ! నీ వెక్కడి పుత్రుడవు? నాకు పరమ శత్రుడవై నాకులము ధ్వంసము చేయడానికి యాదవకులమున ముసలములాగు పుట్టినావు. నీవు సుఖపడవు సుమా! మా ఉసురు నీకు తప్పకుండా తగులుతుంది. నన్నెంతవరకూ పాడు చేయగలవో అంతవరకూ చెడగొట్టినావు, నీగర్వమణచివేస్తాను చూడు. నే నుండగా నాకూతురుకి పెళ్ళి చేయడానికి నీవెవడవు? దానిసంరక్షకుడను నేనుగాని నీవు కావు. లేనిపెత్తనము పైనివేసుకొని నా మర్యాద మట్టిలో కల్పుతావా? నీకధికారమెక్కడిదిరా తుంటరీ? ఏదీ నా కూతురి నేలాగు తీసుకొని పోతావో చూస్తాను. రహస్యముగా కుట్ర పన్ని గొప్పింటి పడుచుని తుంటరీ బికారీ అయిన అనామధేయుడికి పెళ్ళి చేస్తావా? ఎంత పెడసర ముందిరా నీకు! పిల్లను దొంగలాడినారని పోలీసువారికి రిపోర్టు చేస్తాను చూడు.

ప్రేమా—ఆమె నతని కిచ్చి పెళ్ళిచేయడపు హక్కు నాకు లేదు నిజమే. అది స్వబుద్ధిచేతనే అతనిని వరించింది. మైనరు కాదు, యోగ్యాయోగ్యవిచక్షణ గలిగిన యువతి, కావున దాని వరు నదే ఎంచుకొన్నది. ఆ సుందరుని వెంట

పెట్టుకొని కలక్టరు దగ్గిరికి పోయి అతనిని నేను పెళ్ళిచేసుకొన ననుజ్ఞ యివ్వండని అడుగుతే ఎవ రేమనగలరు? అడ్డుపడ డాని కెవరి కధికార ముంది? లాయరు నడిగే పెళ్ళిచేసినాను.

వీరే—(నెత్తికొట్టుకొని) ఓరి నీ బ్రతుకు మండ! ఎన్ని పద్ధతులెరిగినావు రా? నీఅవజ్ఞకు శాశ్వతము గాపురుగులగుంట లోపడి కుళ్ళుతావు సుమా! న న్నింత క్షోభపెట్టుతున్నావు, బాగుపడవు. నేను బ్రతికి ఉన్నప్పుడే నన్ను చంపినావు. ఇక నా జన్మము వృథా! నా మర్మము లన్నిటినీ వేధిస్తూ న్నావు! ఒక్కసారి గొంతుక కోయలేకపోయినావా? నా బాధ తీరియుండునే నీకు!

ప్రేమ—మా కడుపున పుట్టి మ మ్మింత క్షోభపెట్టు తూన్నావు! నీ పట్టు విడువురా నాయనా! తలిదండ్రు లిట్లు తల్లడిల్లుతూంటే నీకు దయాదాక్షిణ్యాలు లేవా? ఎంత రాతిగుండెరా నీది! ఔరా! నిన్ను పెంచి పెద్దచేసినందు కిదా నీవు మాకు చేసిన ప్రత్యుపకారము?...ఆయ నెంత కలతపడుతూన్నారో చూడు. ఇకనైనా మా మాట వినవా?

ప్రేమా—మీ రూరకే క్షోభను తెచ్చిపెట్టికుంటూ న్నారు. నిష్పక్షపాతబుద్ధితో నాలోచించినవారికి నేను చేసిన పని తప్పుకాదని తోస్తుంది. మీ రపోహముచేత నింత తల్లడ మొందుతూన్నారు. నేను చేసినది సకలమతసమ్మత మైన విధి. ద్రోహము చేసినానని లేని తప్పు నామీద నారోపించి నన్ను నిందించి మీరు కలతపడుతూన్నారు కాని

ఇది కేవల మపోహము. మీరీడ చూచి మీరే భ్రమపడు తూన్నారు!

వీరే—ఛీ కుక్కా! ఏమని మొరుగుతూన్నావు? నాదా తప్పు? నీ వేమీ చేయలే దేమి? ఎవడో దిక్కులేని వాడిని తెచ్చి చెల్లెలి నిచ్చి రహస్యముగా విధవావివాహము చేసి మీదిమిక్కిలి ఇది న్యాయమనీ ధర్మమనీ పెద్దపెద్దమాట లాడుతూన్నావా! మీకందరికీ ఎంత సిగ్గు లేదురా? పడుచు వాడితో పరిచయము చేసుకొని వీడే నా మగడని లజ్జా బిడి యములు లేక అది మచ్చికచేసుకుంటే వాళ్ళిద్దరినీ తార్చి దానికి వివాహ మనిపేరు పెట్టినావా? దొంగపెళ్ళి వివాహ మవుతుందా?

ప్రేమా—కోపావేశమున మీరన్నమాటలు పాటి చేయరాదు గాని మీ నోరే నాకంటె హెచ్చుగా మిమ్మ గౌరవపరుపు తూన్నది. మేము యథాశాస్త్రీయముగానే వివాహము చేసినాము.

వీరే—ఛీ! చండాలుడా! పాషండుడా! గురు ద్రోహీ, నీ నోరు మూయిస్తాను చూడు (కర్రతో నొకదెబ్బ కొట్టి రెండోదెబ్బ కొట్టబోగా భద్రా ప్రేమా అడ్డుపడి ఆపుతారు)

ప్రేమ—జరిగిన దేమో జరిగింది. ఇక వీరియెదుట నిలువబడకు-నిన్ను కొట్టుతూంటే నేను చూడలేను.

భద్ర—నాన్నగారూ! ఇంకో దెబ్బ వేసినారంటే నేను ప్రాణములు భరించలేను. అయ్యో! అన్నా! నాకోసకు నీ వెన్ని పాట్లు పడుతూన్నావు? నే నెట్టి పాడువేళ పుట్టినానో నీ కింతకష్టము తెచ్చిపెట్టినాను.

వీరే—వాడిని కొట్టితే నీవు చస్తావా? నిన్ను కొట్టితేనో?—(కొట్టపోగా ముకుందుడు కావేరిన్నీ అడ్డుపడి కర్ర లాగివేయుదురు) నన్ను విడువండి. వీళ్ళిద్దరినీ చంపి నేను చస్తాను. (భద్రగొంతుక పిసిగి తోసివేయును)

భద్ర—అమ్మా! నన్ను చంపివేయ మను-గృహకలతలు మానుతవి-తప్పనాది. (పడిపోవును. అందరూ చుట్టూ మూగుదురు.)

ప్రేమా—సుందరం! సుందరం! త్వరగా రా!

ప్రేమ—అమ్మా భద్రా, లే లే-చూడవే మమ్మా!

భద్ర—అమ్మా విషమిచ్చి నన్ను చంపివెయ్యి, నేను బ్రతికుండి ఏమి లాభము? ఎవరు సుఖిస్తారు నావల్ల?

ప్రేమ—అమ్మా, ఆలాటి మా టనకు-ఎక్కడో ఒక దగ్గర ఏదోలాగు బ్రతికుండు నేనున్నాన్నాళ్ళు-నీయిష్టము వచ్చినట్లుండు, వద్దనను-మాయింట నుండ నక్కరలేదు.

వీరే—చావనీ, నిర్భాగ్యరాలు! చుప్పనాతిలాగు మన కులమంతా ధ్వంసము చేసింది, మానమంతా మట్టిలో కలిపింది, గౌరవమంతా గంగలో తోసింది, ఇంతమంచి చావడముకన్న ఇది చస్తే మేలు. పీడ వదలుతుంది.

ప్రేమా—సరే-తలిదండ్రు లయినందుకు తగినట్టు కొట్టినారు, తిట్టినారు, హితోపదేశము చేసినారు. ఇవన్నీ నిష్ఫలమని తేలిందికదా. ఇంతతో మీకోపము కొంత తగ్గవచ్చును...ఇప్పటి కైన దేదో అయింది, ఎవరికీ ఇంకా తెలియలేదు, వివాహము రహస్యముగా నిన్నరాత్రి జరిపినాము. ఇప్పుడు భద్ర సుందరము సంరక్షణలో నున్నది కాని మీ సంరక్షణలో లేదు. ఇంతవరకూ మీమీది గౌరవముచేతనూ మాయందు స్నేహభావముచేతనూ అతడు విని ఊరకున్నాడు, శృతి మించుతూంది; ఇక కోర్టు కెక్కవలసి వస్తుంది...మీ రేమన్నా కార్యము లేదు. మాయిద్దరి యోగక్షేమములు కోరినవారైతే శుభముహూర్తనిర్ణయము చేసి బాహాటముగా తిరిగీ వివాహము జరపండి. లోకు లెవ్వరూ మన నేమీ అనలేరు.

ప్రేమ—లోకుల కేమి లే. వా రేమి మనని పోషిస్తున్నారా? వా రేమన్నా మాకు లక్ష్యము లేదు. (వీరేశ్వరుని రెండుచేతులూ పట్టుకొని)—నామాట వినండి-మన పిల్లలకన్న పైవాళ్ళు మన కెక్కువ కారు-చచ్చేదే భద్ర బ్రతికింది-ఎన్నడూ చీపురుపుల్లతోనైనా కొట్టని కన్నకొడుకుని కర్రతో చావమోదినారు, అనరాని మాట లన్నారు. వాళ్ళిద్దరూ వెళ్ళినవెనుక మన కిల్లెందుకు వాక లెందుకు? పెంచి పెద్దచేసిన పిల్లల నెవరైనా పాడుచేస్తారా? ఏదో యుక్తవయస్సు వచ్చింది కనుక వాళ్ళు స్వతంత్రించినారు,

మనమాట చెల్లలేదు. మీరు చెప్పవలసినంతా చెప్పినారు, చెయ్యవలసినంతా చేసినారు, కార్యము లేకపోయింది, వాళ్లు చేసినది చెడ్డపనికాదు; మనమాట వాళ్ళు వినకపోతే పోనీ, వాళ్ళమాటే మనము విందాము. కులములో వెలివేస్తారని మనము జంక నక్కరలేదు. మనయింటికి బంధువులు రారు, పోనీ-వాళ్ళసాయము మన కక్కరలేదు. మన కేమి లోపము? మనకుటుంబము పోరులేకుండా ఉండవచ్చును కదా?

కావే—పిల్లలు మాట వినకపోతే చేయదగినంత శిక్ష చేసినా, కార్యము లేకపోయింది. పెద్దకాలములో పిల్లలను విడిచి యుండడము భావ్యము కాదు. వాళ్ళని చూసుకొనేకదా మనము సుఖించవలసినది. వేరే మన కేముంది?

ముకు—అయ్యో! ఇట్టి గృహచ్ఛిద్రము లెక్కడా ఉన్నవే-కాల మెల్లప్పుడూ ఒక్కలాగే ఉండదు. కొత్త శకము వచ్చింది. పెద్దలు చిన్నలమాట వినవలసివచ్చింది. మాటపట్టింపువల్ల పిల్లలను పాడుచేయకండి. వాళ్ళు బిచ్చ మెత్తుకుంటే ఆ హీనత మనది కాదా? మీవాడు బుద్ధిమంతుడే-ఏదో తప్పుచేసినాడు దండించినారు, ఇక దీర్ఘకోపము కూడదు, శాంతించండి. పోనీ వాళ్ళమాటే కానీ.

ప్రేమా, భద్ర, సుంద—(వీరేశ్వరునికాళ్ళపై బడి) మాతప్పు మన్నించి మామాట చెల్లించండి-మేము చేసినది సుభద్ర మేలుకొరకే గాని మాకొరకు కాదు. లోకుల కేమి? వాళ్ళేమన్నా అనగలరు.

ముకు—ఇంతటితో మీకోప ముపసంహరించి యీ బాలుర ముద్దు చెల్లించండి. భగవద్విలాస మిట్లున్నందున వాళ్ళ కీబుద్ధి పుట్టింది. వాళ్ళు చెప్పిన ట్లిది కొంతవరకూ శుభముగానే పరిణమించవచ్చును. ప్రస్తుతమున ఇట్టి వివాహములు చాలా జరుగుతూన్నవి, ఆ దంపతులు సుఖముగా ఉంటున్నారు, మనము చూడలేదా ?

కావే—అయ్యా-మీ కొమార్తె సుఖపడుతూంటే చూడడము మాకు ప్రాప్తించలేదు. మరొకయ్యను చేపట్టితే సుఖించుతుందేమో? పోనీ-మనము కాదనడ మెందుకు ?

వీరే—నా కేమీ తోచలేదు; అంతా అగమ్య గోచరముగా నుంది. సర్వేశ్వరా, ఏమి నీవిలాసము ?

ముకు—అంతా చూస్తూ మీ రట్లు చింతించ తగునా ? మనరోజులు గడిచినవి, నవభావోదయ మయింది. పాతఆకులు పండి రాలినవి, చెట్లు కొత్తగా చిగురిస్తూన్నవి. కాలానుగుణముగా పరిస్థితులు, పరిస్థితుల ననుసరించి నూత్న భావములూ, నవనవాదార్శములూ అవతరిస్తూన్నవి. కాల ప్రవాహ మనివార్యము, కావున దాని కనుగుణముగా మనము నడుచుకొనతగ్గదే కాని ఎదు రేగ వశముకాదు. ఇప్పుడు మీవాడు చెప్పినట్లు శుభముహూర్తమున నిష్కల్మష హృదయముతో మీ కూతురు సుభద్రను ఆమె వరించిన వరున కిచ్చి వివాహము చేయండి. దానివల్ల ఆమెకు సమస్త

సుఖములూ చేకూరును గాక! లేకుంటే కొడుకూ కూతురూ మీకు దక్కరు. మీ బ్రతుకు నిష్ఫల మవుతుంది.

వీరే—గత్యంతరము లేదు. దీని కొప్పుకొనకుంటే మాభవిష్యత్తంతా శోకపూరిత మయితీరుతుంది. ఎంతోకాల ముండేవాళ్ళము కాము. మా జీవితగోధూళిలగ్నమున నిట్టి పరివర్తనము విధివిలసితము కావడముచేతనే వీళ్ళ కీపెడబుద్ధి పుట్టింది. కానీ-చింతించి లాభము లేదు బిడ్డలారా, లెండి. మీరు చెప్పినరీతినే చేస్తాను. ఆపైని ఏమైనా సరే. భావి కాలమున ఏమి జరుగనున్నదో ఎవ రెరుగుదురు? కోపావేశ ముచేత మిమ్ము సకలదుర్భాష లాడినాను.

ప్రేమ—అవి మీరనలేదు మేము వినలేదు. గతజల సేతుబంధ మేల? మామనవి చెల్లించినారు మా కదే పదివేలు.

ముకు—ప్రేమానందా! నీవు ధర్మవీరుడవు, కర్మ వీరుడవు. నీశాంత మనన్యసామాన్యము. నీబుద్ధి అద్వితీయ శోభాయుతము. సాహస మత్యాశ్చర్యకరము.

ప్రేమా—అయ్యా మీరు పెద్దలు-చిన్నవాడను లోకజ్ఞానవిహీనుడ నౌటచేత మిమ్ము సమాధానపర్చలేక తప్పుతోవ తొక్కి పట్టుపట్టి మీకింత క్షోభ కలిగించినందుకు మమ్ము క్షమించకోరుతూన్నాను. (నమస్కరించును)

సుంద—అయ్యలారా! ప్రేమానందుడు ప్రసంగవశ మున భద్రదుఃఖదాయకమైన స్థితిని కళ్లకు కట్టినట్లు వర్ణించగా, మనసు కరిగి ఆమెకు సుఖము చేకూర్ప ప్రతినబట్టి

నా మిత్రునికి చేదోడు వాదోడునై యుండి ఈకార్యభార మతనితో పంచుకొన్నాను. ఆమెను చూచినప్పుడు నాచిత్తము ద్రవీభూత మౌటచేత కార్యక్రమము నతిశీఘ్రముగా కావించుమని ప్రోత్సహించినాను. మీకు తెలియకుండా రహస్యముగా వ్యవహరించినందుకు క్షమించండి. అలాగు చెయ్యక తప్పిందికాదు.

వీరే—భావగారూ, మీదంపతులు మాకు సహాయులై ఈశుభకార్యము జరిపించవలెను.

ముకు } అవశ్య మల్లే చేస్తాము. శుభస్య శీఘ్రమ్. సర్వే
కావే } జనాః సుఖినో భవంతు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

సమాప్తము.